ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-3-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 54 పేజీలు: 10+4 వెల: 6.50

ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం
ఢిల్లీ కాంగ్రెస్ ఆఫీసు ఖాళీ చేయాలని ఆదేశాలు 5

# పెట్రోలు దాస్తే కొరడా


బుధవారం హైదరాబాద్‌లో పెట్రోలు, గ్యాస్‌పై నిర్వహించిన సమీక్షలో డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్, సిఎస్

**రాష్ట్రంలో సమృద్ధిగా గ్యాస్, పెట్రోలు నిల్వలు**
**డ్రమ్ములు, కంటైనర్లలో పెట్రోలు నింపితే కఠిన చర్యలు: డి.సిఎం భట్టి విక్రమార్క**
**2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు: మంత్రి ఉత్తమ్**
**పెట్రోలు బంకుల వద్ద భారీగా రద్దీ.. కొన్ని చోట్ల నోస్టాక్ బోర్డులు**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ విషయమై బుధవారం శాసనమండలి సమావేశ మందిరంలో పౌరసరఫరాలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి రాష్ట్రంలో గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. అవసరానికి మించి పెట్రో, డిజిల్‌ను కొనుగోలు చేసి నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో పౌర సరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జనార్, సుధీర్‌బాబు, పెట్రో ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, డ్రమ్ములు, కంటైనర్లలో కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో రెండు నెలలకు సరిపడా ఇంధన నిల్వలున్నా యని స్పష్టం చేశారు. పెట్రోల్ బంకుల వద్ద క్యూ కట్టొద్దని సూచిం చారు. కొందరు పుట్టించిన పుకార్ల కారణంగానే ఈ పరిస్థితి నెలకొం దన్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ బంక్‌ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూ కారణంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంధన సరఫరాను ఆయిల్ కంపెనీలు గణనీయంగా పెంచాయనిపేర్కొన్నారు. డిమాండ్‌ను >>2

**ఇంధనం లభ్యతపై ప్రత్యేక కంట్రోల్ రూమ్స్** 2



## ఇరాన్‌తో సంధికి 15 సూత్రాలు!

**యుద్ధం ముగింపు కోసం ఇరు పక్షాల షరతుల జాబితాలు**
**దాడులు ఆపబోమన్న ఇజ్రాయెల్**
**హార్ముజ్‌పై పెత్తనం తమకే ఉండాలన్న ఇరాన్**

**టెహ్రాన్ / వాషింగ్టన్, మార్చి 25:** ఇరాన్‌తో నెల రోజులుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా కీలక ముందడుగు వేసింది. యుద్ధాన్ని నిలిపివేసి, అణు కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు 15 సూత్రాలతో కూడిన ఒక విస్తృత ప్రణాళికను ఇరాన్‌కు పంపింది. మరోవైపు, ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రతిపాదనలను >>2

## ఇప్పసారా రచ్చ రచ్చ






**ఇందిరమ్మ పేరు మాత్రం పెట్టొద్దు...**
**ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలతో తీవ్ర గందరగోళం**
**రాకేష్ వ్యాఖ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**
**మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, వాకిటి, సీతక్క ఫైర్**
**ఇందిరమ్మపై వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన ప్యానెల్ స్పీకర్**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** ఇప్పసారా అంశం అసెంబ్లీలో రచ్చకు దారితీసింది. బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఇప్ప సారా అంశంపై ప్రత్యేకంగా సభలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ... ఇది ఉత్తర తెలంగాణ ప్రజలకు ఉపయోగపడే అంశమని, టకీలా అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంచిపేరు పెట్టారని, కల్తీ కల్లు, కల్తీ మద్యం తాగి ఉత్తర తెలంగాణ ప్రజలు శవాలుగా మారుతున్నారని అన్నారు. ఇప్పసారా ఆర్గానిక్ విస్కీ అని, కల్తీమద్యం, అల్ఫజోలం, కల్లు కంటే ఇప్ప సారా మంచిదన్నారు. ఇప్పటకీలా అనండి, ఇంకేమైనా పేరు పెట్టండి, కానీ ఇందిరమ్మ పేరు మాత్రం పెట్టొద్దంటూ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిచేసిన ఈ వాఖ్యలు సభలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ఇప్ప సారా విషయంలో ఇందిరమ్మ పేరు వాడటంపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని, రాకెష్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. ముందుగా మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర అభ్యంతరం తెలపగా ఆ తర్వాత మంత్రులు వాకిటి >>2



## నాలుగేళ్ల చిన్నారిపట్ల తీరు ఇదేనా?

**నిందితుని సమక్షంలోనే క్రాస్‌ఎగ్జామినేషనా?**
**పోలీసులపై మండిపడిన సుప్రీం చీఫ్‌జస్టిస్**

**న్యూఢిల్లీ, మార్చి 25:** నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో గురుగ్రామ్ పోలీసులు స్పందించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులతో అధికారులు ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. బాలికను క్రాస్‌ఎగ్జామినేషన్ చేసిన అధికారులను మందలిస్తూ ఈ చర్యలు ఆ బాలికను మరింత మానసిక వేదనకు గురిచేయడం సహా అగౌరవపరిచాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ కూతురిపై అత్యాచారం జరిగిందని గురుగ్రామ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో >>2

## ఇళ్లు కట్టండి.. బిల్లు తీసుకోండి 6

**పల్లారాజేశ్వర్ రెడ్డిపై డి.సిఎం భట్టి ఆగ్రహం**
**పేదల సంక్షేమం పట్టని ప్రతిపక్షం.. అని విమర్శ**

## పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



**1.12 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి**
**జూన్ నాటికి మిగిలిన గృహాలు రెడీ**
**గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు థర్డ్‌పార్టీతో తనిఖీ: అసెంబ్లీలో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇక నగరాలు, పట్టణాలలోఉండే పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్ళను ఇవ్వడానికి చర్యలు తీసుకొంటామని ఇందిరమ్మ కమిటీలతోనే ఇళ్ళను ఇస్తామనీ డ్రా ద్వారా ఇళ్ళు కేటాయిస్తే చాలా మంది అక్కడ నివాసం ఉండటంలేదని ఎవరి అవసరమో వారికే ఇళ్ళు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్‌శంకర్, రామారావుపవార్, ధనపాల్ సూర్యనారాయణ అడిగి ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ వంటి నగరాలలో కూడా ఇందిరమ్మ ఇళ్ళను లబ్దిదారులకు ఇస్తామని తెలిపారు. గ్రేటర్ పదరిధిలో 14,15 పేదలు నివసించే మురికివాడ బస్తీలను గుర్తించామని నివాసయోగ్యమై స్థలాలలో ఇందిరమ్మ ఇళ్ళను నిర్మిస్తామని చెప్పారు. నగరాలకు దూరంగా ఇళ్ళు ఇస్తుంటే లబ్దిదారులు వెల్లడంలేదని వారికి అందుబాటులోనే ఇళ్ళన నిర్మించి ఇవ్వాలనిభావిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం 2,31,206 ఇళ్ళను మంజూరీ చేసినారని ఐతే వాటిలో 1,62,936 ఇళ్ళు మాత్రమే కొన్ని మౌళిక వసతులు మినహా పూర్తి చేశారనీ వివరించారు. మిగితా వాటిఇక విద్యుత్తు ,తాగునీటిసరఫరా, >>2




## సమీక్షలు చేస్తే ఇన్ని ప్రశ్నలు వచ్చేవా?

**మంత్రి పొంగులేటిపై స్పీకర్ అసహనం**

**హైదరాబాద్, మార్చి25, ప్రభాతవార్త:** ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళపై ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్ గడ్డంప్రసాద్ మంత్రి పొంగులేటి >>2

## భద్రాద్రి ఆలయానికి మహర్దశ



**మొదటి దశలో రూ.351 కోట్ల పనులు**
**3 దశలకు రూ.586 కోట్లు.**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 25:** భద్రాచలం దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ముందడుగు వేసింది. దేవాదాయశాఖ ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ, భద్రాచలం పునరాభివృద్ధి-పునరుజ్జీవన కార్యక్రమాల కోసం మొదటి దశలో భాగంగా రూ.351 కోట్ల పరిపాలనా అనుమతిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీచేశారు..ముఖ్యమంత్రి రేవంత్ గతఏడాది భద్రాచలం పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీకి అనుగుణంగా ఈ నిర్ణయం వెలువడటం విశేషం. ఈ ప్రక్రియలో దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గనిరంతర పర్యవేక్షణ, కృషి కీలక పాత్ర పోషించాయి. ఆమె తీసుకున్న ప్రత్యేక చొరవతో ప్రతిపాదనలు వేగంగా ఆమోదం పొందగా, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. మొదటి దశలో గోదావరి ఘాట్ విస్తరణ, ఆధునిక వసతులతో అభివృద్ధి, ఆలయ సముదాయం విస్తరణ వంటి ప్రధాన పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం గోదావరి ఘాట్‌కు రూ.75 కోట్లు, ఆలయ సముదాయానికి రూ.180 కోట్లు, పరిసర అభివృద్ధికి రూ.96 కోట్లు కేటాయించారు. మొత్తం మూడు దశల్లో అమలు కానున్న ఈ ప్రాజెక్టులో రెండో దశలో కాపా రామలక్ష్మమ్మ భూమిలో రూపాంతరాత్మక అభివృద్ధి, మూడో దశలో భద్రాచలం పట్టణ సమగ్ర అభివృద్ధి చేపట్టనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.586 కోట్లుగా అంచనా వేయబడింది. అగమ శాస్త్రాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపడుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. పనుల అమలును రోడ్లు, భవనాల శాఖకు అప్పగిస్తూ నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వుల పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు.



## బంపర్ ఆఫర్

**మెట్రో, ఎసి, డీలక్స్ బస్సుల్లో 30% రాయితీ**
**సద్వినియోగం చేసుకోవాలి: ఆర్టీసీ ఎండీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి25:** పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తలెత్తిన ఇంధన కొరత దృష్ట్యా, నగర వాహనదారులకు ఊరటనిచ్చేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా టీజీఎస్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వేచిచూస్తున్న సామాన్యుడి కష్టాలను గమనించి, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని తక్కువ ధరకే అందించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. హైదరాబాద్ పరిధిలోని మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో టికెట్ ధరలపై 30 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు నగరవాసులు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. పెట్రోల్‌తో ఇబ్బందులు పడటం ఎందుకు దండగ, ఆర్టీసీ బస్సులు ఉండగా! తమ బస్సుల్లో ప్రయాణించండని ఎండీ నాగిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



బుధవారం జగిత్యాలలో జరిగిన సమావేశంలో జీవన్‌రెడ్డి

## కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి గుడ్‌బై

**విధిలేని స్థితిలో పార్టీని వీడుతున్నానని వెల్లడి**

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** ఇంకా ఎంతకాలం అవమానాలు మానసిక క్షోభ భరించక వీధి లేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ పవీడుతున్నానని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ కండువా వేసుకొని ఇందిరా భవన్ నుండి బుధవారం అభిమానులు, కార్యకర్తలు, నాయకుల నినాదాల మధ్య స్థానిక జంబి హనుమాన్ >>2

## వైద్యవిధాన పరిషత్ రద్దు బిల్లుకు అసెంబ్లీ ఓకే



**ప్రజలకు మరింత మెరుగైన వైద్యం: మంత్రి దామోదర**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ రద్దు బిల్లుకు శాసనసభ ఆమోదం పొందింది. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులకు మేలు చేకూరడంతోపాటు రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని స్పష్టం చేశారు. అదనపు ఖర్చు లేకుండా అధిక ప్రయోజనం అందించే నిర్ణయంగా అభివర్ణించారు. రాష్ట్ర నలుమూలల ప్రజలకు అందుబాటులోనే మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి, దాని స్థానంలో సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఇది కేవలం పాలనా పరమైన మార్పు కాదని, ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణ అని వివరించారు. టివివిపిలో ప్రస్తుతం 184 హాస్పిటళ్లు ఉన్నాయని గ్రాంట్‌ఇన్‌ఎయిడ్‌సంస్థగా పనిచేయడంవల్ల పరిపాలనా పరిమితులు, ఉద్యోగుల వేతనాల చెల్లింపులో జాప్యం, రోగులకు సేవలు అందించడంలో లోపాలు ఏర్పడు తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చేందుకు టివివిపిని డీఎస్‌హెచ్‌గా మార్చుతున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ఉద్యోగులకు ట్రెజరి ద్వారా సమయానికి జీతాల చెల్లింపుతోపాటు పూర్తి ప్రభుత్వ ఉద్యోగ హోదా లభిస్తుందని మంత్రి వివరించారు. ప్రజలకు వైద్య సేవలు మెరుగుపడతాయని, నిపుణులైన వైద్యుల నియామకం, రోగ నిర్ధారణ సేవల విస్తరణ, బలమైన రిఫరల్ వ్యవస్థ ద్వారా జిల్లా స్థాయిలోనే 80 శాతం వైద్య సేవలు అందించే విధంగా సెకండరీ స్థాయి హాస్పిటళ్లు బలోపేతమవుతాయన్నారు.



## ఆగని వడగళ్ల వానలు

**వాతావరణంలో భారీ మార్పులు**
**పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హైదరాబాద్ మహానగరంతోపాటు పరిసర జిల్లాల్లో కుండపోత వర్షం కురిసింది. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలర్ట్‌ను వాతావరణశాఖ జారి చేసింది. వనస్థలిపురం, హాయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్‌లో కొన్ని చోట్ల వడగళ్ల వర్షం కురిసింది. అదేవిధంగా ఘట్కేసర్, పోచారం, అన్నోజిగూడ, నారపల్లిలో మోస్తారు వర్షం పడింది. మంచిర్యాల, నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల్లోనూ అకాల వర్షాలు కురిశాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో ద్రోణి మరాత్వాడ ప్రాంతం నుంచి ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ కర్ణాటక తీరం వరకు సగటు సముద్ర మట్టం >>2



ఇరాన్ యుద్ధంతో ఇంధన కొరత ఏర్పడుతుందన్న వదంతుల కారణంగా బుధవారం కరాడ్‌లోని ఒక పెట్రోల్ బంకు వద్ద క్యూలో ఉన్న ద్విచక్ర వాహనదారులు

# జీవన్‌రెడ్డి గుడ్‌బై

>> ఆలయం వరకు కాలినడక వెళ్ళి కొబ్బరికాయ కాయకొట్టి, పూజలు చేసి అనంతరం జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో గల బండారి గార్డెన్ వరకు వాహనంలో జీవన్ రెడ్డితో నా అనుచరులతో తరలి వెళ్లారు.సమావేశానికి జగిత్యాల నియోజకవర్గం నుండే కాక చొప్పదండి ధర్మపురి కోరుట్ల మానకొండూర్ తదిత నియోజకవర్గాల నుండి అభిమానులు కార్యకర్తలు సమావేశానికి తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూనాలుగు దశాబ్దాల అనుబంధం వదులుకోవలని ఎవరు కోరుకోరు విదిలేని పరిస్థితిలో నిర్ణయం తీసుకున్నను అన్నారు.నా ఈ స్థాయికి మిత్రులు, అభిమానులు, నాయకులు కార్యకర్తలు తోడు ఉండడంతోనే ఈ స్థాయికి ఎదిగాను అన్నారు1984 లో కాంగ్రెసు పార్టీ చేరి నాను అన్నారు.ఎన్నికల్లో గెలవడం ఓడటం సహాజం..ఉమ్మడి రాష్ట్రంలో జగిత్యాల ఐక్యతకు చిహ్నామని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితిలో సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీ ఐక్యత కు నిదర్శనం అన్నారు 1996 శాసన సభ ఉప ఎన్నికల్లో 1 లక్ష ఓట్లు పోలైతే 54 వేల మెజార్టీ తో గెలుపొందిన అన్నారు.ఉప ఎన్నికల్లో 73 శాతం ఓట్లతో గెలుపొందిన చరిత్ర దేశంలో ఏ రాష్ట్రంలో లేదు అన్నారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కెసిఆర్ పై 2006, 2008 పార్లిమెంట్ ఉప ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీ చేసి ఓడిపోయాను అన్నారు.2014 ఎన్నికల్లో రాష్ట్రంలో టీఆర్ ఎస్ గెలుపొందితే ఉత్తర తెలంగాణ జలాల్లో ఏకైక శాసన సభ్యుడిగా ఎన్నికయ్యాను.ప్రజల పక్షాన ప్రజల గొంతుకగా వినిపించాను అన్నారు.2018 లో ఎమ్మెల్యేగా ఓడినా2019 ఉమ్మడి నాలుగు జిల్లాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో ప్రశ్నించే గొంతుకగా ఎమ్మెల్సీగా గెలుపొందిన పార్టీకి ప్రజలకు సేవలు అందించాను అన్నారుశాసన మండలి లో ఏకైక సభ్యుడిగా ఒంటరి పోరాటం చేసిన.కాంగ్రెస్ పార్టీ 65 స్థానాలు, ఒకటి సీ పీ ఐ7 గురు ఎంఐఎం సపోర్ట్ ఉండగా.. మెజారిటీ ఉండి కూడా బీ ఆర్ ఎస్ పార్టీ పది స్థానాల్లో ఫిరాయింపులు ప్రోత్సహించారు ఎందుకో తెలియడం లేదన్నారుదశబ్ద కాలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పై దౌర్జన్యం చేసిన వారిని మళ్ళీ పార్టీ లో స్థానం కల్పించారు. వారు మా కార్యకర్తలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు.

రాజీనామా పత్రం విడుదల చేసి, కాంగ్రెస్ పార్టీ కండువా తీసేసి, ఆకు పచ్చ కండువా మెడలో కప్పుకున్నారు.కార్యకర్తలు.. అభిమానులు.. నాయకులు మాట్లాడుతూ..జీవన్ రెడ్డి అడుగు జాడల్లో నడుస్తాం..జీవన్ రెడ్డి వెంటే నడుస్తాం. జగిత్యాల మరో జైత్ర యాత్ర మొదలవుతుంది..జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అవమానించిన తీరు పై నిరసన వ్యక్తం చేస్తూ పార్టీ కి రాజీనామా చేస్తున్నాం అన్నారుపార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీ కి అండగా నిలుస్తూ, కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చిన జీవన్ రెడ్డికి మద్దతు నిలుస్తాం అన్నారు అధికారంలో ఉన్నప్పుడు పార్టీ వీడడం అంటే ఎంత బాధ ఉంటే వేడుతమో తెలుసుకోవాలని అన్నారు..జీవన్ రెడ్డి వెంట ఉండి సైనికులుగా పోరాటం చేస్తాం..జగిత్యాల పోరాటాల గడ్డ.. ఎక్కడి నుండి మరో జైత్ర యాత్ర పోరాటం చేస్తాం అన్నారు. జగిత్యాల జిల్లా మండల అధ్యక్షులుఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఉప సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, జిల్లా ఫిషరీస్ అధ్యక్షుడు, మండల అధ్యక్షులు, వందలాది మంది కార్యకర్తలు, సర్పంచులు, కౌన్సిలర్లు, బతికేపల్లి సర్పంచ్, మండల మాజీ అధ్యక్షులు, వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.బీర్పూర్ మాజీ ఎంపీ పీ, యూత్ కాంగ్రెస్ స్టేట్ జెనరల్ సెక్రటరీ పదవితోపాటు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.యూత్ కాంగ్రెస్ జగిత్యాల్ అసెంబ్లీ నియోజక వర్గం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, జగిత్యాల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవికి, రాజీనామా.రాష్ట్ర మహిళా కార్యదర్శి రాజీనామా చేశారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.ఈ సమావేశంలో వివిధ నియోజకవర్గాల నుండి వచ్చిన కాంగ్రెస్ నాయకులు , ప్రజా ప్రతినిధులు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిపట్ల తీరు ఇదేనా?

>> పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం నిందితుడి సమక్షంలో మేజిస్ట్రేట్ ఆ బాలికను ఎలా ప్రశ్నించారనే దానిపై పోలీసులు, జిల్లా న్యాయవ్యవస్థ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పోలీసులు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేరు వాళ్లేమైనా రాజులా అని సీజేఐ ప్రశ్నించారు. ఈ కేసులో హరియాణా తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాల నుంచి రక్షణ(పోక్సో) చట్టంలోని సెక్షన్ 6(నేరం రుజువైతే 20ఏళ్ల జైలుశిక్ష) నుంచి నేరాన్ని సెక్షన్ 10(పదేళ్ల జైలుశిక్ష)కి ఎందుకు కుదించారని ధర్మాసనం నిలదీసింది. బాలల సంక్షేమ కమిటీ నివేదిక ఆధారంగా అభియోగాలను మార్చినట్టు భాటి సమాధానమివ్వగా బాలిక వాంగ్మూలం కంటే ఆ నివేదికకు ఎందుకు ప్రాధాన్యమిచ్చారని ప్రశ్నిస్తూ అసమర్థమైన విషయాన్ని సమర్థించవద్దని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీసీపీ, ఏసీపీ హోదా కలిగిన పోలీస్ అధికారులు ఈ విచారణలో భాగమయ్యారు. ఆ చిన్నారిపై జరిగిన నేరం గురించి వారి అవగాహన ఇదే అయితే, మరి చట్టబద్ధమైన పాలన సంగతేంటి అత్యాచారం అంటే లైంగిక చొరబాటు మాత్రమే కాదు. ఈ విషయంలో పోలీసులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. నేర తీవ్రతను తగ్గించేందుకే అత్యున్నత పోలీస్ అధికారులను రంగంలోకి దించారు అని జస్టిస్ బాగ్చి అన్నారు. పోలీసులు కనీసం చట్టాన్ని చదవలేదు. నాలుగేళ్ల చిన్నారి నిర్దోషిత్వాన్ని నమ్మలేదు. వారికి సిగ్గుండాలి. రాష్ట్రానికి చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, వారిని తక్షణమే బదిలీ చేయాలి. సీసీటీవీ కెమెరాలు లేవని చెబుతున్నారు. 15 రోజులుగా ఏమీ చేయకుండా మేమీ కేసును పరిగణనలోకి తీసుకున్నాకే అరెస్టులు మొదలెట్టారు. మీరెందుకంత తీరిక లేకుండా ఉన్నారో మేమే చెప్పాలా ఈ కేసు సున్నితత్వం లేమికి పరాకాష్టగా నిలుస్తోంది. సీడబ్ల్యూసీ సభ్యులు ఎవరు వారిని ఎవరు నియమిస్తారు వారి అర్హతలేమిటని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసు నమోదులో భాగంగా అఫిడవిట్‌లో పలుమార్లు ఆ చిన్నారి పేరు ప్రస్తావించడంపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గురుగ్రామ్ పోలీసులు నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన, పూర్తిగా చట్టవిరుద్ధమైన దర్యాప్తు విధానాన్ని కొనసాగించారని ఈ తీరుతో ఆ చిన్నారి మరింత మానసిక క్షోభకు గురై ఉంటుందని అభిప్రాయపడింది.

# ఇంధనం లభ్యతపై ప్రత్యేక కంట్రోల్ రూమ్స్

### ఎల్‌పిజి, పెట్రోలియంపై కేంద్ర కార్యదర్శి నీరజ్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి25:** దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ, సహజ వాయు, పెట్రోలియం ఉత్పత్తుల లభ్యత, సరఫరా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులతో బుధ వారం కేంద్ర పెట్రోలియం సహజ వాయు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.. ఈ సమావేశంలో, ఎల్‌పీజీ సిలిండర్లు, పెట్రోల్ ,డీజిల్ వంటి అవసరమైన ఇంధన పదార్థాల నిరంతర లభ్యత, ఉత్పత్తి, పంపిణీ, సరఫరాపై కార్యదర్శి సమీక్షించారు. ఎల్‌పిజి డిమాండ్, ప్రాంతీయ అవసరాల దృష్ట్యా తగిన నిల్వలను అందుబాటులో ఉంచి సమయానుకూలంగా పంపిణీ చేయాలని కేంద్ర కార్యదర్శి సూచించారు. పెట్రోల్, గ్యాస్ కొరతలపై వస్తున్న తప్పుడు సమాచారాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర కార్యదర్శి రాష్ట్రాలకు సూచించారు. ఎల్‌పీజీ నిల్వల్లో ఎటువంటి కొరత లేదని ఆయన స్పష్టం చేస్తూ, పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిలోనే రీఫిల్ బుకింగ్ చేయాలనే నిబంధనలు యథాతథంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలు తప్పుడు వార్తలను నమ్మకుండా, అవసరం లేని భయంతో బుకింగ్ చేయవద్దని సూచించారు.ఇంకా, గ్యాస్ నెట్‌వర్క్ విస్తరణ వల్ల కలిగే దీర్ఘకాల ప్రయోజనాలను సమావేశంలో ప్రస్తావించారు. ఎల్‌పీజీ నుంచి పైప్ ద్వారా వచ్చే సహజ వాయువు (పిఎన్‌జి) వైపు మారడం గృహాలకు తక్కువ ఖర్చుతో పాటు సౌకర్యవంతమని అధికారులు తెలిపారు. ఈ మార్పును ప్రోత్సహించాలని రాష్ట్రాలకు సూచించారు. రాష్ట్రాల ప్రభుత్వ కార్యదర్శులకు తమ తమ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లభ్యత, పంపిణీ విధానాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇందుకే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను (స్టేట్ కంట్రోల్ సెంటర్స్) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కేంద్రాలు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, జిల్లా పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను (హోర్డింగ్)ను అరికతలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణరావు, సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

26-02-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
అష్టమి ఉ.11.51
ఆరుద్ర సా.4.21
వర్జ్యం : రా.3.54-తె.5.26
దు.ఉ.10.11-ఉ.11.00
2)మ.3.04-మ.3.53
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** వ్యాపార వృత్తి వ్యవహారములు క్షణము తీరిక లేకుండా చేస్తాయి. మిత్రుల కలయిక వలన ఆనందం కలుగుతుంది.

**వృషభం:** ప్రతి విషయమునకూ మీమీద ఆధారపడే స్వజనుల వలన స్వతంత్ర నిర్ణయములు చేయలేరు. వస్త్రలాభం.

**మిథునం:** ఆర్థిక విషయముల ఒత్తిడిని తగ్గించే విషయములలో ఇంటిలో వారి సలహాలు లభిస్తాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల అప్రమత్తత అవసరం. గృహావసర ఖర్చులు మితిమీరి ఉంటాయి.

**సింహం:** ఆస్తి వివాదాలు పరిష్కారదిశగా ఉన్నట్లు అనిపిస్తాయి. వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య:** కళలు, వైద్య రంగాలలోని వారికి అనుకూలం. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ధనలాభం.

**తుల:** అనుకున్న కార్యక్రమాలను నెరవేర్చగలుగుతారు. కుటుంబసభ్యులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

**వృశ్చికం:** మీ శత్రు వర్గం మీపై చేస్తున్న దుష్ప్రచారం కొంత అశాంతికి గురిచేస్తుంది. ప్రయాణాలు.

**ధనుస్సు:** వత్తిడి పని భారంగా వలన శారీరకంగా, మానసికంగా అలసటకు గురి అవుతారు.

**మకరం:** కొంత ఆలస్యమైనా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. ఆస్తి వివాదాలు పరిష్కారదిశలో ఉంటాయి.

**కుంభం:** మిమ్ములను దెబ్బతీయాలని మీ శత్రువర్గం చేసే ప్రయత్నాలు ప్రారంభంలోనే విఫలం అవుతాయి.

**మీనం:** భూములకు సంబంధించి, స్థిరాస్తులకు సంబంధించి కొన్ని నిర్ణయాలు అమలు చేస్తారు.వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పెట్రోలు దాస్తే కొరడా

>> మించి సరఫరా కొనసాగుతోందని, బుధ వారం 17,246 కిలో లీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరిగిందని స్పష్టం చేశారు. దీనికి తోడు అదనంగా 16,000 కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతోపాటు 100 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని తెలిపారు. అయితే కొన్ని పెట్రోలు బంక్‌లకు నిర్ణిత సమయానికి ట్యాంకర్లు చెరుకోకపోవడంతో ఆయా బంకుల్లో నోస్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు. పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో, డబ్బాలలో పెట్రోల్, డిజిల్‌ను తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని హెచ్చరించారు.

పెట్రోలియం సరఫరాలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేందుకు ఓజిసి లైన్‌ను విస్తరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంతమేర సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో ఇంధన కొరత ఉందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింది. కొన్ని రోజులుగా పెట్రోల్ బంకుల్లో ఇంధన కొరత ఉందనే వార్తలు ప్రచారం కావడంపై బుధవారం అసోసియేషన్ స్పందించింది. హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్, బిపిసిఎల్ కంపెనీల వద్ద సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని ధృవీకరించింది. రాష్ట్రంలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనం అందుబాటులో ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేసింది. వినియోగదారులు పుకార్లను నమ్మి ఆందోళన చెందొద్దని విజ్ఞప్తి చేసింది. వాహనదారులు ఎవరి నోట చూసిన ఫుల్ ట్యాంక్ మాటే వినిపిస్తుండటంతో బంకుల్లో నిల్వ ఉన్న పెట్రోల్, డిజిల్ ఖాళీ అవుతోందని, మళ్లీ పెట్రోల్ నిల్వలను సమకూర్చుకునేందుకు సమయం పడుతుండటంత్లో నో స్టాక్ బోర్డులు పెట్టాల్సి వస్తోందని, తీవ్రమైన కొరత మాత్రం లేదని తేల్చి చెప్పింది. ఈ పరిస్థితిని ఇంధన కొరతగా భావించవద్దని అసోసియేషన్ తెలిపింది.

హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉన్న పెట్రోల్ బంకులు తెల్లవారుజాము నుంచే వాహనదారులతో రద్దీగా కనిపిస్తున్నాయి. కిలోమీటర్ల మేర వాహనాలు పెట్రోల్ బంకుల వద్ద క్యూ కట్టాయి. ఆటోలు, కార్లు, కంటైనర్లు కూడా పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద వాహనాల రద్దీ అమాంతం పెరగడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తల కారణంగా ఉద్యోగస్తులు, సామాన్యులు ఆందోళనకు గురై పెద్దమొత్తంలో పెట్రోడిజిల్ కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో వందలాది పెట్రోల్ బంకుల వద్ద ఎప్పుడూ చూడని విధంగా భారీ క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. వాహనదారులు తమ వాహనాలతోనే కాకుండా, ప్లాస్టిక్ క్యాన్లు, బాటిళ్లు, చివరికి స్టీల్ బకెట్లతో బంకులకు చేరుకుంటున్నారు. పెట్రోల్ కొరత ఏర్పడుతుందేమోనన్న భయంతో అర్ధరాత్రి వేళ కూడా నిద్ర మానుకొని గంటల తరబడి లైన్లో వేచి ఉంటున్న ఫొటోలు వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజా పరిస్థితులతో బంకుల వద్ద రద్దీ పెరగడంతో పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు యాజమాన్యాలు పోలీసుల సాయం కోరుతున్నాయి. పెట్రోల్ కొట్టించుకునే క్రమంలో అక్కడక్కడ వాహనదారుల మధ్య వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

# ఇప్పసారా రచ్చ రచ్చ

>> శ్రీహరి, శ్రీధర్‌బాబు, సీతక్కతోపాటు పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. " ఇందిరమ్మ మా దేవత. వాజ్ పేయే ఇందిరమ్మను ఉక్కు మహిళ, దుర్గామాత అని బిజెపి మాజీ ప్రధాని వాజ్‌పేయి కూడా కొనియాడారు. ఇప్ప టకీలాకు పేరు విషయంలో ఇందిరమ్మ పేరును ఉచ్చరించడం సరికాదు. భేషరతుగా క్షమాపణలు చెప్పాలి. చనిపోయిన ఇందిరమ్మ పేరు ఉపయోగిస్తారా?. ఇందిరమ్మను అవమానించడం అంటే మహిళా సమాజాన్ని అవమానించినట్లే. ఎం తమాషాగా ఉందా రాకేశ్‌రెడ్డి. " అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.

" రాకేశ్‌రెడ్డి మాటలు మహిళా లోకాన్ని కించపరిచే విధంగా ఉన్నాయి. మత్తు అనేది పెద్ద చెత్త. ఇందిరమ్మ మీద మీ అక్కసు శోచనీయం. సంక్షేమ పథకాలకు గొప్ప వారి పేర్లు పెడతారు. అందుకే ఇందిరమ్మ పేర్లు పథకాలకు పెట్టాం. బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి ఇందిరమ్మ అంటే ఎందుకంత విద్వేషం? వెంటనే క్షమాపణ చెప్పాలి. ఆ మాటలను వెనక్కి తీసుకోవాలి" అని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. రాకేశ్ రెడ్డి క్షమాపణ చెప్పాలని, ఆయన మాటలను రికార్డుల నుంచి తొలగించాలని శాసనసభా వ్యవహారాలశాఖమంత్రి శ్రీధర్‌బాబు సైతం డిమాండ్ చేశారు. దేశం కోసం త్యాగం చేసిన ఇందిరమ్మ గురించి ఇలా మాట్లాడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ క్రమంలో రాకేశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయాలని అధికార కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా జరిగిన వాగ్వాదంలో కాంగ్రెస్ సభ్యులపై బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి కల్పించుకుని ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు. తమ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్ పార్లమెంటరీ భాష ఎక్కడా మాట్లాడలేదన్నారు. రాకేశ్ రెడ్డి మాట్లాడిన మాటలను రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరం లేదని ఏలేటి ధ్వజమెత్తారు.ఈ క్రమంలో బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ పేరుపై గంటకు పైగా సభా సమయం వృథా చేయడం సరికాదన్నారు. బిజెపి సభ్యుడు తప్పుగా మాట్లాడి ఉంటే ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. ఇందిరాగాంధీని తూలనాడితే కాంగ్రెస్ పక్షం మండిపడుతోందని మరి అదే సూత్రం అందరికీ వరిస్తుందని పేర్కొంటూ... తమ నేత కెసిఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే సిఎం నోటికొచ్చినట్టు దూషిస్తున్నారని సభలో ప్రస్తావించారు. సిఎం వైఖరి సరైనదేనా..? అని ప్రశ్నించారు. ఈ సమయంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బిఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇప్ప పువ్వు సారా చర్చ సందర్భంగా తాను మాట్లాడిన మాటలను ఎవరూ అపార్థం చేసుకోవద్దని ఎమ్మెల్యే ఎట్టకేలకు రాకేశ్‌రెడ్డి కోరారు. ఒకవేళ ప్రభుత్వం ఇప్ప సారాను అందుబాటులోకి తెస్తే, దానికి ఇందిరమ్మ పేరు పెట్టవద్దని చెప్పడం తప్పా అని ప్రశ్నించారు. ఒకవేళ తాను మాట్లాడిన మాటలు తప్పనిపిస్తే వాటిని సభ రికార్డుల నుంచి తొలగించాలని ఆయన పేర్కొన్నారు. తనకు ఇందిరాగాంధీ అంటే ఎంతో గౌరవమని, ఆమె ఉక్కు మహిళ అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీని తూలనాడాలనే, కించపరచాలనే ఉద్దేశ్యం తనకు ఏమాత్రం లేదన్నారు. ఈ అంశంపై ప్రొటెమ్ స్పీకర్ బాలునాయక్ స్పందిస్తూ... ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించినట్లు ప్రకటించారు. ఇకమీదట ఏ పార్టీ సభ్యులైనా సభా నియామాలను, హుందాతనాన్ని గౌరవిస్తూ మసలుకోవాలని, ప్రజలు అంతా గమనిస్తున్నారని సూచించారు.



'చైతీ ఛఠ్' పండుగ సందర్భంగా బుధవారం గంగానదిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

# ఇరాన్‌తో సంధికి 15 సూత్రాలు!

>> పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్ వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు చేరవేశారు. ఈ ప్రణాళిక ప్రకారం ఇరాన్ తన మూడు ప్రధాన అణు కేంద్రాలైన నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోలను పూర్తిగా మూసివేయాలి. యురేనియం శుద్ధిని నిలిపివేసి, ఇప్పటివరకు శుద్ధి చేసిన అణు ఇంధనాన్ని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థకు అప్పగించాలి. బాలిస్టిక్ క్షిపణి తయారీ కార్యక్రమాన్ని కూడా నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేసింది. కాల్పుల విరమణ చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ అత్యంత కఠినమైన షరతులను అమెరికా ముందు ఉంచింది. గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ పూర్తిగా మూసివేస్తేనే చర్చలకు సిద్ధమని స్పష్టం చేసింది. నౌక రవాణా మార్గమైన హార్ముజ్ జలసంధిపై పూర్తి హక్కు కలిగి ఉండాలి. అలాగే, యుద్ధం వల్ల తమకు కలిగిన నష్టానికి పరిహారాన్ని కూడా ఇరాన్ కోరింది. దీంతోపాటు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని కూడా ఇజ్రాయెల్ డిమాండ్ చేసింది. హార్ముజ్ జలసంధి నుంచి రవాణా చేసే నౌకలపై పన్ను వసూలు చేస్తారు. ఇరాన్‌లో ఇటీవల బలపడిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఈ చర్చల వైఖరిని నిర్దేశిస్తున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. ఇరాన్ కేవలం సైనిక స్థావరాల మూసివేతతోనే సరిపెట్టలేదు. తమపై అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడుల వల్ల జరిగిన నష్టానికి పూర్తి పరిహారం చెల్లించాలని కూడా డిమాండ్ చేస్తోంది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు తెరవెనుక జరుగుతున్న చర్చల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బృందం కంటే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో చర్చలు జరపడానికే ఇరాన్ ఎక్కువ ఆసక్తి చూపుతోంది. ట్రంప్ ప్రధాన సలహాదారులు, అల్లుడు అయిన జేర్డ్ కుష్నర్ తో పాటు స్టీవ్ విట్‌కాఫ్‌లను పక్కనపెట్టి వాన్స్‌తో సంప్రదింపులకు టెహ్రాన్ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. కుష్నర్‌కు ఇజ్రాయెల్‌తో సన్నిహిత సంబంధాలున్నందున న్యాయం జరగదని ఇరాన్‌భావిస్తోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, అమెరికాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌ఇజ్రాయెల్ ఘర్షణలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఇరాన్ సైనిక దళాల ముఖ్య ప్రతినిధి ఆరోపించారు. ఓటమిని ఒకదౌత్యపరమైన ముందడుగ్గుగా చిత్రీకరించే ప్రయత్నాలను మానుకోవాలని ట్రంప్ కు హితవు పలికారు. ఇరాన్‌కూడా కొంత సడలింపుధోరణిలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఐదేళ్లపాటు బాలిస్టిక్ మిస్సైళ్ల తయారీని నిలిపివేస్తామ, యురేనియం నిల్వల్ని కూడా తగ్గించుకునేందుకు అంగీకరించిందన్న వార్తలు వెలువడ్డాయి. ఇరాన్‌లోని అణ్వాయుధాలు, యురేనియంపై అంతర్జాతీయ సంస్థల తనిఖీకి కూడా అంగీకరించింది. ఇరాన్ సమీపంలోని దేశాల్లో ఉండే హెజ్బొల్లా, హమాస్, ఇరాకి మిలీషియాస్ వంటి తీవ్రవాద సంస్థలకు నిధులు అందించడం నిలిపివేస్తామనికూడా ఇరాన్ అంగీకరించినట్లు అమెరికా చెపుతోంది. ఈ అంశాలన్నింటిపై అధికారిక ప్రకటన రాలేదు. కానీ, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తుల ద్వారా సందేశం పంపినట్లు తెలుస్తోంది. అమెరికా చర్చల ప్రతిపాదనను ఇరాన్ తప్పుబడుతోంది. అమెరికా తనతో తానే చర్చించుకుంటోంది అని ఇరాన్ మిలిటరీ ప్రతినిధి ఎబ్రహీమ్ అన్నారు.

ఇదిలా ఉంటే హార్మూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంతో పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ నౌకను ఇరాన్ వెనక్కి రప్పించుకుంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇరాన్ సరిహద్దుల్లోని హార్మూజ్ జలసంధిలో నౌకాయానానికి సంబంధించి ఆ దేశం నిబంధనలు విధించింది. ఈ జలసంధి మీదుగా వెళ్లడానికి అనుమతులను తప్పనిసరి చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా చేస్తున్న శాంతి ప్రయత్నాలకు ఇజ్రాయెల్ గట్టి షాకిచ్చింది. ఇరాన్‌తో అమెరికా జరుపుతున్న చర్చలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ దేశంపై తమ సైనిక దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. తమ దేశ భద్రతకు ఇరాన్, దాని అనుబంధ సంస్థల నుంచి ముప్పు పొంచి ఉన్నంత కాలం ఈ వైఖరి మారదని తేల్చి చెప్పింది. ఉగ్రస్వరూపస్వభావాలున్న ఇరాన్ పాలక ప్రభుత్వాన్ని సమూలంగా దించివేయాలని, ఇరాన్‌ప్రజలకు స్వేచ్ఛాయుత పాలన అందించడమే మా లక్ష్యమని ఇజ్రాయెల్‌ప్రకటించింది. అలాగే లెబనాన్, ఈజిప్టుల్లో ఉన్న హెజ్బొల్లా గ్రూపులను కూడా సమూలంగా నిర్మూలిస్తామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

>> మురుగునీటి వంటి వసతులు లేకపోవడంతో వాటిని పంపిణీ చేయలేదని అన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్ళనాణ్యతను థర్డ్ పార్టీతో తనిఖీచేయిస్తున్నామని తెలిపారు. 99రోజుల కార్యక్రమంలో వాటిని కేటాయించాలని సూచించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంకు 3500 ఇళ్ళచొప్పున 119 నియోజకవర్గాలలో 4.5లక్షల ఇళ్ళను మంజూరు చేశామని ఇప్పటికి ఒక లక్షా 12వేల ఇళ్ళుపూర్తిచేశామని జూన్‌లో మరో లక్ష ఇళ్ళను పూర్తిచేస్తామని తెలిపారు. రెండో విడుత ఇందిరమ్మ ఇళ్ళకేటాయింపు కూడా మేనెలలలో శ్రీకారం చుడుతామని తెలిపారు.గతంలో సంగం నిర్మించి వదిలేసిన ఇళ్ళకు కూడా నిదులు ఇస్తామని తెలిపారు. ఇళ్ళు నిర్మించిన స్థాయిని బట్టి నిధులు కేటాయిస్తామని ప్రతి వారం నిధులు విడుదల అవుతున్నాయని వివరించారు. సర్పంచ్ చైర్మన్‌గా ఇందిరమ్మ కమిటీ సిఫార్సులను కలెక్టర్‌కు పంపుతారని అక్కడే ఇందిరమ్మ ఇంటిలబ్ధిదారుడిని ఎంపిక చేస్తారని ఆయనతెలిపారు.బిఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కెపి వివేకానంద, సునీతాలక్ష్మారెడ్డి, కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి,తలసాని శ్రీనివాసయాదవ్‌లు మాట్లాడుతూ డ్రా పద్ధతిలో ఇళ్ళను కేటాయించాలని పేదలకు పార్టీలు అంటగట్టొద్దని సూచించారు. తలసాని శ్రీనివాసయాదవ్ ఒక్క ఇటుక కూడా రెండున్నర ఏళ్ళుగా పేర్చలేదని ఇందిరమ్మ అంటు గొప్పలు చెప్పుకొంటున్నారని అన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ టవర్స్ 5నుంచి 12 అంతస్తుల్లో ఉన్నాయని వాటినిర్వహణకోసం వాణిజ్యసముదాయలను గత ప్రభుత్వంనిర్మించారనివాటిని విక్రయించకూడదని సబిత ఇంద్రారెడ్డి కోరారు. అయితే మంత్రి వాటిని విక్రయించి డబ్బును వారి అసోసియేషన్‌పేరుపై డిపాజిట్ చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్,కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి,చిక్కుడు వంశీకృష్ణారెడ్డి,ఠాగూర్ మక్కాన్‌సింగ్, శ్యాముల్, బండారులక్ష్మారెడ్డి, నాగరాజు, ఆదినారాయణ, విజయరమణారావులు,బిజెపి ఎమ్మెల్యే ధనపాల్‌సూర్య నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌పేరిట ప్రజలను వంచించిందనీ ఆరోపించారు.

# ఇన్ని ప్రశ్నలు వచ్చేవా?

>> శ్రీనివాసరెడ్డిపై అసహనం వ్యక్తంచేశారు. మరోవైపు కెటిఆర్ కూడా ఈ అంశంపై మాట్లాడటానికి అవకాశం ఇవ్వమనికోరగా స్పీకర్ ఇవ్వకపోవడంతో సభలో బిఆర్ఎస్ సభ్యులు కొంత సేపు నిలబడి స్పీకర్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. ప్రశ్నవేసినవారికి మాత్రమే అనుమతి ఇస్తామంటూ స్పీకర్ బిఆర్ఎస్ సభ్యుల అభ్యర్థనను త్రోసిపుచ్చారు. గృహనిర్మాణంపై ప్రశ్నోత్తరాలు ప్రారంభిస్తూనే స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ గతంలో తాను ఇచ్చిన సూచనలు మంత్రి పట్టించుకోలేదని ఇప్పుడు సభలో ఇన్ని ప్రశ్నలు వస్తున్నాయని స్పీకర్ వ్యాఖ్యనించారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు పడక గదుల ఇళ్ళ పరిస్థితిపై జిల్లావారిగాసమీక్ష చేయాలని మంత్రికి సూచించాని స్పీకర్ అసహనంతో తన అభిప్రాయం వ్యక్తీకరించారు. జిల్లా కలెక్టర్‌లతో కూడా సమీక్ష చేయాలని సూచించాను నేను చెప్పినప్పుడు అన్నిజిల్లాల వారిగా సమీక్ష చేసి ఉంటే క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై స్పష్టత వచ్చేదని సభలో సభ్యులు ఇన్ని ప్రశ్నలనుసంధించే వారే కాదని అన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి జిల్లా వారిగా ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తానని స్పీకర్‌కు తెలిపారు.

# ఆగని వడగళ్ల వానలు

>> నుంచి 1.5 కి మీ ఎత్తులో ఏర్పడిందని వాతావరణశాఖ ప్రకటించింది. దీని ప్రభావంతో అదిలాబాద్, కొమరం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగాం, యాదాద్రి, భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

ఈ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలతో పాటు ఈదురుగాలుల తీవ్రత గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని, అక్కడక్కడ పిడుగుపాటు సంభవిస్తుందని హెచ్చరించింది. వర్షాలతో రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి నుంచి ఒకటి నుంచి రెండు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

# రేపు కవిత కొత్తపార్టీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి25:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.

## మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు కూరగాయలు

### తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** మార్కెట్‌లో డిమాండ్ ఉండి తక్కువ కాలంలో రైతులకు నికర లాభాలు ఇచ్చేవి కూరగాయ పంటలేనని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్. అన్వేష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యాన శాఖ సంయుక్తంగా ఏడు జిల్లాల కూరగాయల రైతు వలంటీర్లకు కూరగాయల సాగుపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధ వారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేంద్రియ, సహజ పద్ధతుల్లో సాగుచేస్తే కూరగాయలకు మంచి ఆదరణ ఉందని చెప్పారు. కేవలం టమోటా వంటి పంటలనే కాకుండా ప్రతి రైతు కనీసం నాలుగైదు కూరగాయ పంటలు సాగు చేస్తే ప్రతి గ్రామం కూడా వాటి మార్కెటింగ్‌కు అనువుగా ఉంటుందన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం విసి దండ రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులైన రైతుల ఆధ్వర్యంలో కూరగాయల సాగు విస్తీర్ణం పెరిగితే భవిష్యత్తులో ఎటువంటి డోకా ఉండదన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న పామ్ ఆయిల్ తోటల్లో సైతం కూరగాయల పంటలను అంతర పంటలుగా వేసుకుంటే అదన పాదాయం కచ్చితంగా ఉంటుందని ఆయన తెలిపారు. కోతుల బెడద తగ్గించేందుకు సోలార్ ఫెన్సింగ్ మేలైన పరిష్కారమని తెలిపారు.

## రోహిత్, రితేష్, నమిత్‌ల

# రెండోరోజు విచారణ

### మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్‌పార్టీ కేసు.. నేటితో ముగియనున్న కస్టడీ

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎం ఎల్‌ఏ పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మలను చేవెళ్ల పోలీసులు వరుసగా రెండవ రోజూ విచా రించారు. వీరిని మంగళవారం కస్టడీలోకి తీసుకున్న పోలీసులు మొదటి రోజు తొమ్మిది గంటల పాటు విచారించడం తెలిసిందే. రెండవ రోజు బు ధవారం కూడా తొమ్మిది గంటల పాటు విచారించారు. వరుసగా రెండవ రోజు కూడా వీరిని శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్‌లో గల శంషా బాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లోనే విచారించారు. ఈ విచారణను ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు, చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం స్వయంగా ప ర్యవేక్షించారు. మరోవైపు డ్రగ్ పెడ్లర్ అభిషేక్ సింగ్ కనిపించడం లేదని అతని తండ్రి రాజేంద్రనగర్ పోలీసులకు చేసిన ఫిర్యాదుపై పోలీసులు స్పంది ంచడం లేదు. దీనిపై వారు మౌనం వహించడం గమనార్హం. మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీపై ముగ్గురు నిందితుల కస్టడీ విచారణ రెండవ రోజుకు చేరింది. ఈ నెల 14వ తేదీన జరిగిన పార్టీని అ దేరోజు రాత్రి పోలీసులు రట్టు చేయడం తెలిసిందే. ఈ పార్టీలో 11 మంది పాల్గొనగా వీరిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా ఆరుగురు డ్రగ్స్ సేవించినట్లు తేలడం విదితమే. ఫాం హౌస్‌లోకి వచ్చిన పోలీసులను బెదరగొట్టేందుకు రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు నమిత్ శర్మ నాలుగు రౌండ్లు కాల్పులు జరపగా అనంతరం అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నమిత్ శర్మ కాల్పులు జరిపిన రివాల్వర్ రితేష్ రెడ్డిది కావడంతో రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో మరింతగా వి చారించేందుకు ముగ్గురిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు వారిని భిన్న కోణాల్లో విచారిస్తున్నారు. గురువారంతో ముగియనున్న ఈ విచారణలో ఇప్పటి వరకు ముగ్గురు నిందితులు పోలీసులు ఆశించినంతగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదని తెలిసింది. డ్రగ్స్ పెడ్లర్లతో తమకున్న సంబంధా లపై రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలు నోరు మెదపడం లేదని తెలిసింది. దీంతో ముగ్గురిని మరోదఫా కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరనున్నట్లు తెలిసింది. గురువారం నాడు వీరిని మొయినాబాద్ ఫాం హౌస్‌కు తీసుకువెళ్లి అక్కడ మరోదఫా విచారించి అనంతరం నేరుగా రాజేం ద్రనగర్ కోర్టులో హాజరు పరిచి, అటుపిమ్మట చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు. అంతకు ముందు ముగ్గురికి ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల నివేదికను జైలు అధికారులకు ఇవ్వనున్నారు. కాగా ముగ్గురు నిందితులు వెల్లడించిన అరకొర సమాచారం తమకు సం తృప్తి ఇవ్వలేదని, కేసు విచారణలో ఇది ఎంతమాత్రం సరిపోనందున ముగ్గురిని మరోసారి వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరాలని నిర్ణయించారని తెలిసింది. దీనిపై గురువారం లేదా శుక్రవారం నాడు పోలీసులు రాజేంద్రనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నార ని తెలిసింది. మరోవైపు పోలీసుల కస్టడీలో వున్నాడని చెబుతున్న డ్రగ్స్ పెడ్లర్ అభిషేక్ సింగ్ వ్యవహారం ఇంకా మిస్టరీగానే వుంది.

తన కుమారు డిని పోలీసులు తీసుకు వెళ్లారని అభిషేక్ సింగ్ తండ్రి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫాం హౌస్ డ్రగ్స్ కేసును విచారిస్తున్న మొయి నాబాద్ పోలీసులు దీనిపై మౌనం వహించారు.

## తెలంగాణలో ఫసల్ బీమా యోజన అమలు

# ఈ యేడాది నుండే అమలుకు కృషి

### రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### వ్యవసాయాన్ని వదిలేస్తున్న అన్నదాతలు: పాయల్ శంకర్

### రైతుల గురించి మాట్లాడే అర్హత బిజెపికి లేదు: విజయరమణా రావు

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ ఏడాది నుండే అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ విషయమై సిఎం రేవంత్‌రెడ్డిని సంప్రదించి త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. ఒక్క ఏడాదిలోనే రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు.

**వ్యవసాయాన్ని వదిలేస్తున్న అన్నదాతలు: పాయల్ శంకర్**

రానురాను రాష్ట్రంలో సాగు భారంగా మారుతోందని బిజెపి శాసనసభాపక్ష ఉపనేత పాయల్‌శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ పద్దులపై చర్చలో భాగంగా బుధవారం బడ్జెట్ పద్దులపై ఆయన శాసనసభలో మాట్లాడారు. వ్యవసాయం చేసి అప్పుల పాలవడం కంటే ఏదైనా కూలి చేసుకుని బతికొచ్చన్న ఆలోచనకు రైతులు వస్తున్నారని, కనీసం కౌలుకు తీసుకుని కూడా సాగు చేయడంపై మొగ్గు చూపడం లేదన్నారు. రాష్ట్రం లక్షల కోట్ల అప్పుల్లో చిక్కుకుపోయిందని, వాటిని ఎలా తీరుస్తారో పేర్కొంటూ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో ఓటర్లను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చారని అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను రూపొందించిన సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు హామీల అమలుపై మాత్రం సంతకం చేయడం లేదని విమర్శిఇంచారు. రైతులకు బ్యాంకులు సరిపడా రుణాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ఎప్పటి నుండి అమలు చేస్తారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు వ్యవసాయ జెడిలు లేరని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. రైతులుతమ పొలాలకు వెళ్లేందుకు రోడ్లు నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. భూసార పరీక్షలు క్రమంతప్పకుండా నిర్వహించేలా వ్యవసాయ అధికారులపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. రాష్ట్రంలో 90శాతం సబ్సిడితో రైతులకు పాలిహౌజ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. టమాట రైతుల బాధలు వర్ణతాతీతంగా ఉన్నాయని, కిలో రూపాయి కూడా రైతుకు రావడం లేదన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సిఎస్టి సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎజెన్సి ప్రాంతాల్లోని ఎస్సిల భూములకూ పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమిక సహకారసంఘాల నిధులు దారిమళ్లకుండా చూడాలని, అక్రమాలకు పాల్పడి పార్టీ మారిన డిసిసిబి ఛైర్మన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రైతుల గురించి మాట్లాడే అర్హత బిజెపికి లేదు: విజయరమణారావు**

రైతుల గురించి మాట్లాడే అర్హత బిజెపికి లేదని విప్ విజయరమణారావు స్పష్టం చేశారు. పలు పంట దిగుబడులకు ఏటా మద్దతు ధర పెంచుతున్న కేంద్రం ఆ ధరకు కొనుగోళ్లు మాత్రం చేయడం లేదని మండిపడ్డారు. బిజెపికి తెలంగాణలో 8మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు ఉన్నా కేంద్రం నుండి అభివృద్ధి నిధులు తేవడం లేదని మండిపడ్డారు. ఉపాధిహామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, పనిదినాలను తగ్గించిందని మండిపడ్డారు. నల్ల చట్టాలు తెచ్చి రైతులపై రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. బడ్జెట్ పద్దులపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గండ్ర విజయరమణారావు, మందుల సామెల్ మాట్లాడారు.

## పూరీ జగన్నాథ్ రత్నభాండార్ లెక్కింపు షురూ!

**పూరి, మార్చి 25:** ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రత్న భండార్ రహస్యం త్వరలోనే వీడనుంది. సుమారు 48 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత, రత్న భండారంలోని అమూల్యమైన బంగారం, వెండి, వజ్ర వైఢూర్యాల లెక్కింపు ప్రక్రియ బుధవారం అధికారికంగా ప్రారంభమైంది. బుధవారం మధ్యాహ్నం 12:09 గంటల నుంచి 1:40 గంటల మధ్య ఉన్న అత్యంత శుభ ముహూర్తంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఆలయ సంప్రదాయాలను పాటిస్తూ, అధికారులు, నియమించ బడిన సిబ్బంది సమక్షంలో ఆభరణాల జాబితాను సిద్ధం చేసే పని మొదలైంది. అంతకుముందు 11:30 గంటల ప్రాంతంలోనే సిబ్బంది సాంప్రదాయక దుస్తులైన ధోవతి, ఉత్తరీయం ధరించి ఆలయంలోకి ప్రవేశించారు. 48 ఏళ్ల తర్వాత రత్న గర్భం వెలుగులోకి వచ్చింది. దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత మళ్లీ లెక్కింపు జరుగుతుండటంతో, ప్రస్తుతం అక్కడ ఎంత సంపద ఉందనేది యావత్ దేశ వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన విభాగం ఈ ప్రక్రియను అత్యంత గోప్యంగా, భద్రత నడుమ నిర్వహిస్తోంది. కేవలం ప్రభుత్వం గుర్తించిన, లెక్కింపు కోసం నియమించిన వ్యక్తులకు మాత్రమే లోపలికి అనుమతి కల్పించారు. లోపలికి వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆలయ నిబంధనల ప్రకారం సాంప్రదాయక దుస్తుల్లోనే వెళ్లాలి. పూరీ జగన్నాథుడి రత్న భండారంలో ఉండే అంతుచిక్కని నిధుల గురించి తరతరాలుగా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇప్పుడు జరుగుతున్న ఈ అధికారిక లెక్కింపు ద్వారా ఆ నిధుల అసలు విలువ, వివరాలు బయటకు రానున్న నేపథ్యంలో భక్తుల్లో ఆసక్తి నెలకొంది.

# విజయవాడలో అరెస్టయిన వాళ్లు ఖతర్నాక్‌లు

### పాతబస్తీ మహిళతో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం పెంచుకుని ఉగ్రవాదంపై రీల్స్



**హైదరాబాద్, మార్చి 25 ప్రభాతవార్త:** విజయవాడలో సోమవారం నాడు అరెస్టయిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మహమ్మద్ రహమ తుల్లా, మీర్జా సోహైల్, మహమ్మద్ డానిష్‌లు ఖతర్నాక్‌గాళ్లుగా తేలింది. విజయవాడలో చిన్నపాటి ఉద్యోగం, వ్యాపారం చేసుకునే ఈ ముగ్గురు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థల ప్రతినిధులతో సోషల్ మీడియాలో సంబంధాలు ఏర్పాటు చేసుకుని, వాటి ద్వారా తమకు భారత్‌లో ఇదే వేదికలో పరిచయం అయి న వారితో భారత్‌లో ఉగ్రవాదం పెంపుపై రీల్స్ చేయిస్తున్నట్లు తేలింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో పాతబస్తీలో గల చంచల్‌గూడకు చెందిన స యిదా బేగం (29) అనే వితంతువుతో ఉగ్రవాదం విస్తరణపై రీల్స్ చేయించారు. ఈ మహి ళతో విజయవాడ ఉగ్రవాదులు ఇన్‌స్టాగ్రాంలో పరిచయం చేసుకుని ఆమెచేత రీల్స్ చేయించారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన సయిదా బేగం కుటుంబం 25 ఏళ్ల క్రితం చంచల్‌గూడకు వలస వచ్చి ంది. ఆమె తండ్రి స్థానిక ప్రైవేటు పాఠశాల వద్ద బడి పిల్లలకు పెన్నులు, తిను బండారాలు అమ్ముకుంటాడు. తల్లి క్యాన్సర్ రోగి. సయిదా బేగంకు మూడేళ్ల పాప వుంది. స్థాని కంగా ఇళ్లలో పాచీపనులు చేసుకుంటూ రీల్స్ చేస్తుం టుందని స్థానికులు చెబుతున్నారు. అయితే విజయవాడకు చెందిన ముగ్గురు ఉగ్రవా దులతో ఏర్పడ్డ పరిచయం ఆమెను ఉగ్రవాదం వైపు నడిపించింది. భారత్‌లో ఉగ్రవాదం విస్తర ణకు ఆమె రీల్స్ రూపొందించి దీనిని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఈ పోస్టులు వైరల్ కావడంతో విజయవాడ ఉగ్రవాదులతోపాటు అరెస్టయ్యింది. సయిదా బేగంను బుధవారం ఉదయం విజయవాడ పోలీసులు ఆమె ఇంటి వద్ద అరెస్టు చేసి తమ వెంట తీసుకునివెళ్లారు. ఆమెను విజయవాడలో రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. విజయవాడలో పట్టుబడ్డ ముగ్గురు ఉగ్రవాదులతో ఈమెకు వున్న సంబంధాల గురించి ఆరా తీస్తున్నారు. సయిదా బేగంకు హైదరాబాద్‌లో ఎవరైనా ఉగ్రవాదులతో సంబంధాలున్నాయా? గతంలో పాతబస్తీలో పట్టుబడ్డ ఉగ్రవాదులతో ఏమైనా సంబంధాలున్నాయా...? అనే కోణం లో హైదరాబాద్ పోలీసులు ఆరా తీస్తున్నారు. సయిదా బేగం తండ్రితో పాటు ఆమెతో సన్నిహితంగా వున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకు ని విచారిస్తున్నారు.

## సోనియాకు అస్వస్థత, గంగారామ్

# ఆసుపత్రిలో చేరిక



**న్యూఢిల్లీ, మార్చి 25:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను మంగళవారం సాయంత్రం ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వాతావరణ మార్పుల కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో పాటు ఛాతీలో అసౌకర్యంగా అనిపించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. సోనియా గాంధీ(79) వెంట ఆమె కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఉన్నారు. ప్రత్యేక వైద్య బృందం సోనియా ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఆమెకు వైద్యుల బృందం చికిత్స అందిస్తోందని, ఆందోళన చెందాల్సినంత తీవ్రమైన సమస్య ఏమీ లేదని సమాచారం. సోనియా గత కొంతకాలంగా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో కూడా ఆమె ఇదే సమస్యతో గంగారామ్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతానికి సోనియాను వైద్యులు అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వర్గాలు అధికారికంగా హెల్త్ బులెటిన్ విడుదల చేయాల్సి ఉంది.

# మందులకు సైతం లొంగని టైఫాయిడ్!

### దేశంలో అధికంగా పెరుగుతున్న కొత్త ఇన్ఫెక్షన్లు

**న్యూఢిల్లీ, మార్చి 25:** టైఫాయిడ్ జ్వరం ఇండియాలో సర్వసాధారణ వ్యాధిగా మారినా ఇపుడు యాంటీబయాటిక్ రెసిస్టెంట్ టైఫాయిడ్ ఇన్‌ఫెక్షన్లు మరింతగా పెరుగుతున్నాయి. వ్యాధికి కావాల్సిన మందులు వాడినా జ్వరం కేసులు తగ్గడం లేదు. టైఫాయిడ్ సోకిన 87 శాతం కేసుల్లో యాంటిబయాటిక్‌లు పనిచేయడం లేదని, దీని వల్ల ఆయా కుటుంబీకులపై పెను ఆర్థిక భారం పడుతున్నట్లు ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఏషియా తన నివేదికలో స్పష్టంచేసింది. 2023లో చేపట్టిన సర్వేకు చెందిన రిపోర్టును ఆ జర్నల్ రిలీజ్ చేసింది. ఆ నివేదిక ప్రకారం ఇండియాలో టైఫాయిడ్ చికిత్స కోసం సుమారు రూ.123 బిలియన్లు ఖర్చు చేసి ఉంటారని తెలుస్తోంది. అంటే సుమారు 12 వేల కోట్ల ఆర్థికభారం ఇండియన్లపై పడినట్లు భావిస్తున్నారు. పదేళ్ల లోపు చిన్నారులకు ఎక్కువగా టైఫాయిడ్ సోకుతోందని, ఆ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్నట్లు నివేదికలో ప్రస్తావించా. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్, క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ఆఫ్ వెల్లోర్ పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించారు. టైఫాయిడ్ చికిత్సకు అయ్యే ఖర్చుల్లో 91 శాతం ఇంటిసభ్యులే భరిస్తున్నారని, సుమారు 70 వేల కుటుంబాలు హెచ్చు స్థాయిలో ఖర్చు చేసినట్లు తేల్చారు. మహారాష్ట్ర, యూపీ, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాల్లో సుమారు 51 శాతం ఖర్చు చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. కలుషిత ఆహారం, నీటి వల్ల సాధారణంగా టైఫాయిడ్ సోకుతుంది. జ్వరం, బలహీనత, తలనొప్పి, కడుపునొప్పి లాంటి లక్షణాలు వారిలో ఉంటాయి. టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్(టీసీవీ) ఇవ్వాలని పరిశోధకులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. టైఫాయిడ్ జ్వరం సోకిన కేసుల వల్ల భారతీయులపై ఆర్థిక భారం పడుతున్నట్లు స్టడీలో తేల్చారు. ఫ్లోరోక్వినోలిన్ రెసిస్టెన్స్ వల్ల ఆయా కేసుల్లో తీవ్రత పెరుగుతుందని పరిశోధకులు చెప్పారు. ఫ్లోరోక్వినోలిన్ మందులు వాడినా ఆ వ్యాధి తగ్గడం లేదని, ఆ డ్రగ్ రెసిస్టెంట్ ఇన్‌ఫెక్షన్లు 87 శాతం ఉన్నట్లు స్టడీ తెలిపింది. నిజానికి ఫ్లోర్లోక్వినోలిన్ డ్రగ్ వాడితే నాలుగు రోజుల్లో తీవ్రమైన టైఫాయిడ్ జ్వరం కూడా తగ్గుతుంది. ఆ మందు వాడినా ఇప్పుడు వ్యాధి త్వరగా తగ్గడం లేదని గుర్తించారు. దీంతో ఆర్థికభారం పెరుగుతోందని అధ్యయనంలో గుర్తించారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదు

### వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు: పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రోల్‌తో పాటు డీజిల్, వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని ఈ విషయంలో వస్తున్న వద ంతులను నమ్మవద్దని పోలీసు శాఖ కోరింది. ఈ మేరకు డిజిపి శివధర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గా ్యస్ కొరతపై ఎవరైనా వదంతులు వ్యాప్తి చేస్తే వారిపై కఠిన చర్య లు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా ఈ విషయంలో ఎలా ంటి ఆందోళనకు గురికావద్దని డిజిపి కోరారు. రాష్ట్ర అవసరాలకు తగినంత పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ వుందని, అదనం గా 22 శాతం సరుకు వుందని పౌర సరఫరాల కమిషనర్ స్టీపెన్ రవీంద్ర తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరతపై పుకార్లు వ్యాపింపచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిటీ కొత్వాల్ సజ్జనర్ తెలిపారు.

## జీవన్ రెడ్డి పార్టీ వీడిపోవడం

# చాలా బాధాకరం

### టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎంపి మల్లు రవి

**హైదారబాద్,మార్చి 25,ప్రభాతవార్త:** జీవన్ రెడ్డి పార్టీ విడిపోవడం చాలా బాధాక రమనీ టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ ఎంపి మల్లు రవి ఒక ప్రకటనలో నిర్వేదం వ్యక్తంచేశారు. కొన్ని రాజకీయ సమీకరణాలతో అందరికి పదవులు రావడం లేదుపార్టీలో ఉండి అడగాల్సి ఉండాల్సి ంది అంటూ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ గొప్ప సిద్ధాంతాలు ఉన్న పార్టీ అలాంటి పార్టీ దేశంలో ఇంకొకటి లేదనీ ఆయన అభిప్రాయపడ్డారు. ఇంత గొప్ప సిద్ధాంతాలు ఉన్న పార్టీ లో పని చేయడం గొప్ప విషయమని అన్నారు. జీవన్ రెడ్డి క్రమశిక్షణతో పని చేసారు. ఆయన పార్టీలోనే ఉంటే బాగుండేదనీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా, తెలంగాణ ప్రజల అవసరాలకు అనుగుణంగా సిఎం రేవంత్ రెడ్డి అద్భుతమైన పాలన చేస్తున్నారనీ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మంచి ప్రజాదరణ ఉన్న నాయకులు, గొప్ప వ్యూహకర్త అని కొనియాడారు. కులగణన, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలు అమలు లాంటి కార్యక్రమాలు విజయవంతంగా చేస్తున్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై రాజకీయాలు చేసిన నాయకులు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లాంటి అవకాశాలు ఇచ్చినప్పుడు ఆయన బాగా పని చేసారని కొనియాడారు. ప్రభుత్వం పటిష్టమైన పాలన చేయాలంటే కొంత సర్దుకుపోవాల్సి ఉండాల్సి ంది అని అభిప్రాయపడ్డారు. నాకు కూడా అవకాశాలు చాలా మిస్స య్యాయి. నేను పార్టీ లోనే ఉండి పోరాటం చేసాను అని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మనసు మార్చుకొని పార్టీలో కొనసాగాలని హితవు చెప్పారు. పరిస్థితు లను బట్టి నాయకులకు అవకాశాలు వస్తాయి వేచి చూడాలనీ ఉచితసలహా ఇచ్చారు. మంచి నాయకులకు మంచి అవకాశాలు తప్పకుండా వస్తాయనీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా సుదీర్ఘ కాలం పాటు రాజకీయాలు చేసిన అనుభవం ఉందనీ తెలిపారు. ఆయన లాంటి వారు ఓపికగా రాజకీ యాలు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు అండ గా ప్రజాపాలనకు సహకారిగా ఉంటే బాగుండనీ పేర్కొన్నారు.

**అప్పుల వసూలు యంత్రంలా మార్చకండి**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ కోడ్ సవరణలపై నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిపాదించిన మార్పులు భారత దివాలా పరిష్కార వ్యవస్థ పునాదులనే బలహీనపరిచే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ సవరణ దివాళా పరిష్కారం ప్రక్రియలోని సంస్థాగత బలాన్ని తగ్గిస్తాయని ఎంపి మల్లు రవి పేర్కొన్నారు. ఆస్తుల విలువను కాపాడటం, వాటాదారులందరికీ న్యాయం చేయడం అనే ప్రధాన లక్ష్యం నుంచి ఐబీసీ దూరం అవుతుందని స్పష్టంగా చెప్పారు. గతంలో లిక్విడేటర్లకు ఉన్న పాక్షిక న్యాయాధికారాలను తగ్గించి, వాటిని కమిటీ ఆఫ్ క్రెడిటర్స్‌కి అప్పగించడం వల్ల తటస్థత లోపిస్తుంది. ఇది కేవలం ఆర్థిక రుణదాతల చేతుల్లోనే అధికారాన్ని కేంద్రీకృతం చేస్తుందని ఎంపీ మల్లు రవి అభిప్రాయపడ్డారు. ప్రతిపాదిత కొత్త విధానం వల్ల ఆస్తుల విలువ పూర్తిగా పడిపోయిన తర్వాతే దివాలా ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
ఫారం-VII
(Declaration) రూఢీ ప్రకటన
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ), నాగర్‌కర్నూల్ జిల్లా
భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(I) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము
సంఖ్య : Gaz. No. 50/2026
సంఖ్య : G2/929/2025 తేది: 18.02.2026
నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామము వద్ద ప్యాకేజి నెం. 29 డిస్ట్రిబ్యూటరి-82 యొక్క మైనర్ 6బిఇ MJR 38 కెనాల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.5.32 గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి-82 యొక్క మైనర్ 6బిఇ MJR 38 కెనాల్ నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున ఎ.లు 5.32 గుం. భూమి డిస్ట్రిబ్యూటరి-82 యొక్క మైనర్ 6బిఇ MJR 38 కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించవలసిన నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.
గ్రామము : అజిలాపూర్ మండలం : వెల్దండ జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్.డి.పి. | పట్టా/ ఇనాం etc. | భూమి రకం | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | తూ | ప | ఉ | ద | చెట్లు | చెట్ల సంఖ్య | నిర్మాణము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 121 | పట్టా | మెట్ట | 0.03 | [illegible] | 94 | 120 | 122 | 95 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 122 | పట్టా | మెట్ట | 0.22 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 120 | పట్టా | మెట్ట | 0.18 | [illegible] | 121 | 119 | 98 | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 119 | పట్టా | మెట్ట | 0.09 | [illegible] | 120 | 118 | 118 | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 118 | పట్టా | మెట్ట | 0.20 | [illegible] | 122 | 117 | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 117 | పట్టా | మెట్ట | 1.04 | [illegible] | 118 | 114 | 123 | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 114 | పట్టా | మెట్ట | 0.07 | [illegible] | 117 | 113 | 178 | 115 | లేవు | లేవు | లేవు | 1 |
| 8 | 115 | పట్టా | మెట్ట | 1.04 | [illegible] | 116 | 113 | 114 | 98 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 113 | పట్టా | మెట్ట | 0.37 | [illegible] | 115 | 112 | [illegible] | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 10 | 112 | పట్టా | మెట్ట | [illegible] | [illegible] | 113 | 106 | [illegible] | [illegible] | లేవు | లేవు | బోరు | 1 |
| | | | మొత్తం | 5.32 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.
భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.
సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ వల్ల ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరావాస మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.
సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్
సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్
DIPR RO.NO: 1334/LA/PP/Advt/Pub/2025-26


వార్త

నీ తోటి మనుషులతో నీవే ఎక్కువ తెలివైనవాడిగా, ఎక్కువ చదువుకున్నవాడిగా ఎప్పుడూ వ్యవహరించకు.

- రోజర్


# యుద్ధం తెచ్చిన కష్టాలు

పశ్చిమాసియాలో ముప్పిరిగొన్న యుద్ధ పరిణామాలు యావత్ భారత్‌దేశాన్నీ సంక్షోభంలోకి నెట్టివేశాయి. ఏదో పెట్రోలియం, గ్యాస్ ఉత్పత్తుల కొరత వలనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయంటే ఏలిన వారు అంగీకరించడం లేదు. అదృష్టం కొద్దీ హార్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సౌహార్ద్ర సహాయంతో ఎల్పీజీ నౌకలు 'జగ్‌వసంత్' 'ఫైన్ గ్యాస్' ఎల్పీజీ నౌకలు బయలు దేరాయి. మొన్నటికిమొన్న ఒక ఎల్పీజీ మంగుళూరు పోర్టుకు వచ్చిందన్న సమాచారం కేంద్రప్రభుత్వంవెల్లడించగానే భారత్‌లో ఏ రకమైన గ్యాస్ ఉత్పత్తుల కొరత ఉండబోదని జనులంతా ఎగిరి గంతేశారు. తాత్కాలికంగా అమెరికా యుద్ధ విరమణ సంకేతాలు పంపడంతో మరింత కేరింతలు కొట్టారు. నేడోరేపో రోడ్డు పక్క హోటళ్లు తెరుస్తారని, ఇకపై 'గ్యాస్' సిలిండర్ అదనపు వసూళ్లు నిలిచిపోతాయని సంబరపడిన వారికీ చేదు అనుభవం ఎదురైంది. ఎక్కడ్నించి ఏవిధమైన నౌకలు ఏ రకమైన పెట్రోలియం ఉత్పత్తులు తెచ్చినా భారత్‌లోని వంటగ్యాస్ సంక్షోభం ముగిసిపోయినట్లన్న నమ్మకం కుదరడం లేదు. మొన్న ఫిబ్రవరి 28 కన్నా ముందు పరిస్థితులు చూడగలమన్న ఆశ కూడా లేదు. యుద్ధం ప్రారంభం కాగానే ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్ల ధర పెంచేసింది. ఆతర్వాత క్రూడాయిల్ ధరలను ఇరాన్ పెంచేసింది. పైగా ఇప్పుడు 'హార్మూజ్' పన్నులు కూడా జతయితే తడిసి మోపెడవుతాయి. ట్రంప్ చెప్పారని రష్యా వద్ద చమురు కొనుగోలు ఆపేసిన భారతదేశం మళ్లీ ఆయన అనుమతితోనేచమురు ఉత్పత్తులను రష్యా నుంచి కొనుగోలు చేస్తోంది. ఒకసారి తమ ఉత్పత్తులు కాదని వెళ్లిపోయి మళ్లీ ఆశ్రయించిన భారత్‌కు చమురు ధరలో రాయితీ లేకుండాపోయింది. దేశంలో ఇంధనకొరత లేదని ఎవరెన్ని చెప్పినా మంగళవారం రాజ్యసభలో మోడీప్రసంగం విన్న ప్రజలు పెట్రోలియం ఉత్పత్తుల కొరత రానున్నదనే భయంతోపెట్రోలు బంకులను చుట్టుముట్టేశారు. ఆరేళ్ల నాటి కోవిడ్‌ప్రస్తావనలు, లాక్ డౌన్ లాంటి పరిస్థితులను ఏకరువు పెట్టడంతో ప్రజల్లో ముఖ్యంగా వాహనదారుల్లో భయాందోళనలు రేకెత్తాయి. ముందు జాగ్రత్తగా పెట్రోల్ కోసం దేశవ్యాప్తంగా విని యోగదారులు పెట్రోలు బంకులకు చేరిపోయారు. మంగళవారం రాత్రి నుంచి పెట్రోలుబంకుల్లో వాహనాల బారులే బారులు. ట్యాంక్ నిండుగా పెట్రోల్, డీసెల్ కొట్టించుకుంటున్నారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షల నిర్ణయం సామాన్య ప్రజానీకానికి అందే ఆహార పదార్థాలపై క్యాంటీన్, హాస్టల్ యాజమానులు గ్యాస్ పన్ను చార్జీలు వేసే పరిస్థితి తెచ్చిపెట్టింది. కేవలం ప్రధాని నోటి వెంటవచ్చిన ఒక మాటతో జనం పెట్రోలు బంకుల్లోకి వాహనాలతో వెళ్లిబారులు తీరారంటే కాస్త ఇబ్బంది గానే ఉంది. వాస్తవాల నెవరూ కాదనలేని పరిస్థితి ఉంది. పెట్రోలియం ఉత్ప త్తుల నియంత్రణ విషయం లో కేంద్రం తత్తరపడుతోంది. 'లాక్‌డౌన్'మాట విన్నంతనే వినియోగదారుల ఆలోచనల్లోఎంతోమార్పు. అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. ఎక్కడో ఏదో సమాచారం అంతరం ఉందన్న మాట. ఏమీలేకుంటే గ్యాస్ సిలిండర్ బుకింగ్ రూల్స్‌ను ఆయిల్ కంపెనీలు తరచు ఎందుకు మార్చేస్తున్నట్లు? జనంలో ఇదే సందేహం వెల్లువెత్తుతోంది. వంటగ్యాస్ సిలిండర్ రీఫిల్ బుకింగ్ అంతరాలలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకపక్కన పెట్రోలు, గ్యాస్‌కు కొరత లేదంటూనే ఓపక్క హెచ్చరికలు, మరో పక్క సముదాయింపులు వింటున్నాం. సరఫరా సజావుగా సాగాల్సి న సమయంలో ఎలాంటిప్రయోగాలు సమ్మ తం కావు. కొత్తగా డబుల్ సిలిండర్ ఉన్న వారికి 35 రోజుల తర్వాతనే రీఫిల్ బుకింగ్, ఉజ్వల కనెక్షన్ ఉన్న వారికి 45 రోజుల తర్వాత బుకింగ్, సింగిల్ సిలిండర్ ఉన్న వారికి మాత్రమే 25రోజులకే బుకింగ్. ఈ గడువు తేదీలు తప్పనిసరిగా పాటించేందుకు ప్రభుత్వ సలహాతో ఆయిల్ కంపెనీలు వినియోగదారుని నెత్తిన 'బండ' లేస్తున్నారు. పెట్రోల్ బంకులకు ఇన్నాళ్లూ పెట్రోల్, డిజెల్‌ల ముందస్తు సప్లయి చేసే చమురు కంపెనీలు తాజాగా సరుకును 'క్యాస్ అండ్ క్యారీ'పద్ధతిన తీసుకోవాలని ఆయిల్ కంపెనీలు చెప్పడంతో కొన్ని పెట్రోలు బంకులు సరకు తెప్పించకుండా 'నోస్టాక్' బోర్డులు పెడ్తు న్నాయన్న ఆరోపణలు న్నాయి. ఇలాంటి అవకత వకల విధానాలను, వ్యాపార సరళిని సరిచేయాల్సి న బాధ్యత కేంద్రంపై ఉంది. కాగా సంక్షోభ సమయంలో సంక్లిష్ట నిర్ణయాలు తీసుకోవడం జనంలో గందరగళ పరిస్థితులు ఏర్పడతాయని ప్రభుత్వాలు గుర్తించాలి. కానీ జరగాల్సి న నష్టం జరిగిపోయింది. వాస్తవాలు ఎలాఉన్నా వదంతులు, పుకార్లు నమ్మవద్దంటూ జనంలో మానసిక స్థైర్యం కలిగించేందుకు దేశీయ ఆయిల్ కంపెనీలు ధైర్యవచనాలు పలుకుతున్నాయి. క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులతో పోలిస్తే పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో ఏదో తెలియని గందరగోళంమొదలైంది. ఎన్నో పొదుపు చర్యలు ప్రత్యామ్నాయ కార్యాచరణలు తీసుకుంటున్నామన్న కేంద్ర ప్రకటనల్లో స్పష్టత కొరవడిందేమోనన్న అభిప్రాయం కలుగుతోంది. ఇరాన్ సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం ఉండగలదని ప్రధాని అంచనా వేస్తూనే ప్రజల్ని ముందు చూపుతో భవిష్యత్ ఇంధన వినియోగ పొదుపు పాటించాలని అప్రమత్తం చేయడం స్వాగతించదగినదే. గ్యాస్‌సహా ఇతర పెట్రోలియం ఉత్పత్తుల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై, అన్నిటికీ ప్రత్యామ్నాయ కనుగొన్నట్లు కేంద్రం చెబుతు న్నా ఎక్కడా సాధారణ పరిస్థితులకు చేరుకోలేకపోవడం విచారకరమే. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల ఎదురయ్యే ఇంధన సంక్షోభాన్ని తట్టుకునేందుకు ధీటుగా ఉండాలన్నదే ప్రధాని ఉవాచ.



తమ తప్పులను కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నించే వారే ఇతరులలో తప్పులను ఎత్తి చూపుతారు.

ఒవిడ్



దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.

హెచ్.లాంగ్‌ఫెలో

# అహింసే మానవాళికి శ్రీరామరక్ష

***ప్రపంచ శాంతి కోసం ఆయుధ పోటీని తగ్గించి, పిల్లలకు శాంతి, అహింస విలువల గొప్ప తనాన్ని నేర్పాలి. అంతర్జాతీయ దేశాలు కలిసి మెలసి సమస్యలను పరిష్కరించుకోవాలి. భవిష్యత్తులో గాంధీయ వాదం పునరుజ్జీవనం సాగించి, ప్రపంచం మళ్లీ గాంధీ మార్గాన్ని అనుసరించాలి. అందులో భారతదేశం (నాయకత్వం) విశ్వగురు"గా ఎదగాలంటే గాంధీయవాదాన్ని అమలు చేయాలి. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో ప్రపంచం ఒక కీలక మలుపులో ఉంది. ఈ దశలో హింస, అణు ఆయుధాల పోటీలు మానవాళిని నాశనం దిశగా తీసుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో గాంధీయవాదం మాత్రమే శాశ్వత పరిష్కారం కాగలదు. మహాత్మాగాంధీ చెప్పినట్లు 'అహింసే మానవాళిని రక్షించగల ఏకైక మార్గం'అనే సత్యాన్ని భారతదేశం తన చరిత్రను గుర్తుచేసుకుని గాంధీ మార్గంలో నడిస్తే ప్రపంచానికి శాంతి దూతగా మారగలదు.***



డా. ఎ. భాగ్యరాజ్

ప్రపంచం ప్రస్తుతం తీవ్రమైన అశాంతి దశలో ఉంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్, అమెరికా – ఇరాన్ యుద్ధం, ఇజ్రాయిల్ పాలస్తీనా మధ్య ఘర్షణలు, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఇవన్నీమూడో ప్రపంచయుద్ధం ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాంతి, సహజీవనం, మానవతా విలువలు మరింత ముఖ్యంగా మారాయి. ఇలాంటి సమయంలో మనకు మార్గదర్శి ఎవరు అని ప్రశ్నవేసుకుంటే సమాధానం స్పష్టంగా ఉంది అదే మహాత్మా గాంధీ. గాంధీయవాదం అంటే కేవలం ఒక సిద్ధాంతం కాదు, అది ఒక జీవన విధానం, శాంతి మార్గం, మానవ సమాజానికి మార్గదర్శకం. 'అహింసా పరమో ధర్మః' అనే భావనను ప్రపంచానికి పరిచయం చేసిన గాంధీ యుద్ధాలకు ప్రత్యామ్నాయంగా అహింసను నిలబెట్టాడు. ప్రస్తుత ప్రపంచ రాజకీయాలు మూడు ప్రధాన సమూహ దేశాల చుట్టూ అశాంతి దిశగా తిరుగుతున్నాయి. ఒకటి అమెరికా ఆధ్వర్యంలోని పాశ్చాత్య దేశాలు, రెండు రష్యా చైనా బ్లాక్, మూడు అభివృద్ధి చెందుతున్న దేశాలు. ఈ విభజన వల్ల ప్రపంచం మళ్లీ శీతల యుద్ధ వాతావరణంలోకి వెళ్లినట్లు కనిపిస్తోంది. రష్యా ఉక్రెయిన్, ఇజ్రాయెల్ పాలస్తీనా, చైనా, తైవాన్ ఉద్రిక్తత, ఆఫ్రికాలో అంతర్గత యుద్ధాలు మొదలైనవి. ఈ పరిస్థితులలో ఇవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ఆహార భద్రతను, శక్తి ప్రకృతి వనరులను తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇందులో ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ప్రధానమైనవి పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలు. వీటివలన దేశంలో వస్తువుల ధరలకు రెక్కలు పెరిగాయి. యుద్ధ ప్రభావం వలన లక్షలాది మంది నిరాశ్రయులు, ప్రపంచంలో ఆర్థిక మాంద్యం, పేదరికం పెరుగుదల, అణు యుద్ధ భయం పెరిగాయి. ప్రస్తుత ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుద్ధాలను మరింత ప్రమాదకరంగా మార్చుతోంది. టెక్నాలజీతో పాటు నైతిక విలువలు అవసరం. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రధాన సంఘర్షణలను ఆపడంలో ఐక్యరాజ్యసమితి విఫలమవుతోందనే భావన బలంగా వుంది. ఐక్యరాజ్యసమితి అత్యవసర మానవతా సహాయాన్ని అందిస్తున్నప్పటికీ, దాని ప్రధాన రాజకీయ, భద్రతా మండలి ప్రధాన ప్రపంచ శక్తుల ప్రయోజనాల వల్ల తరచుగా స్తంభించిపోతున్నాయి. ప్రస్తుత ప్రధాన సంఘర్షణలలో కీలక వైఫల్యాలలో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన రష్యా దండయాత్రను ఖండిస్తూ లేదా జోక్యాన్ని ఆమోదిస్తూ చేసే ఏతీర్మానాలనైనా అడ్డుకోవడానికి తనవీటో అధికారాన్ని ఉపయోగిస్తున్నందున, ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వం వహించడంలో లేదా నేరుగా జోక్యం చేసుకోవడంలోవిఫలమైంది. ఇజ్రాయెల్ గాజా సంఘర్షణ, ఇజ్రాయిల్, అమెరికా ఇరాన్ యుద్ధం వలన తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిస్తూ సర్వసభ్య సమావేశం పలు తీర్మానాలు చేసినప్పటికీ, ఐక్యరాజ్యసమితిలో తరచుగా ప్రతిష్టంభనను ఎదుర్కొంది. ఇజ్రాయెల్‌ను రక్షించడానికి అమెరికా తన వీటోను పలు



మార్లు ఉపయోగించుతున్నాయి. శాంతి ప్రయత్నాలలో లోపం, చిత్తశుద్ధి లేకుండాపోతోంది. మోడీ ట్రంప్కు అనుగుణంగా ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా గ్లోబల్ సౌత్ నాయకత్వాన్ని, భారతదేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని, విదేశాంగ విధానాన్ని కోల్పోయారు. భారతదేశ విధానాలను మోడీ ట్రంప్‌కి తనఖా పెట్టి బానిసగా మార్చేశారు. మనదేశం అమెరికా అనుమతిస్తినే ముప్పై రోజులకు రష్యా దగ్గర ఇంధనం కొనుగోలుచేసే పరిస్థితి ఉందంటే మన విదేశాంగ విధానం మన ప్రభుత్వ విధానం ఎలా వుందో తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో మధ్యవర్తిత్వంవహించే గౌరవం కోల్పోయింది. పెట్రోల్, గ్యాస్ రాబోవు కాలంలో కొరత రాబోతోందని మోడీ మాటల్లోనే తెలుస్తోంది. కరోనా కాలం నాటి లాక్‌డౌన్‌ను ఎదుర్కోబోతున్నామని మన ప్రధానే పార్లమెంట్లో చెబుతున్నారంటే ఎక్కడో జరిగే యుద్ధ ప్రభావం ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూడబోతున్నాం. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన అహింస, సత్యం, సత్యాగ్రహం, స్వదేశీ, బాధ్యతవహించడం మొదలైన సూత్రాలు ప్రధానమైనవి. అహింస అంటే బలహీనత కాదు, అది అత్యంత శక్తివంతమైన ఆయుధం. గాంధీ ఆచరించి చూపించిన విధంగా అహింస ద్వారా కూడా పెద్ద మార్పులు సాధించవచ్చు. సత్యాగ్రహం అంటే నిజం కోసం శాంతియుతంగా పోరాడటం. ఇది యుద్ధాలకు పూర్తి విరుద్ధమైన మార్గం. గాంధీయవాదం ప్రస్తుత ప్రపంచానికి అవసరం. ఎందుకంటే ప్రస్తుతం అణు ఆయుధాలు ప్రపంచాన్ని నాశనం చేసే స్థాయికి చేరుకున్నాయి. ఒక చిన్న పొరపాటు కూడా మానవ జాతిని ప్రమాదంలో పడేస్తుంది. ప్రపంచ దేశాలు సమస్యలను చర్చల ద్వారా కాకుండా యుద్ధాల ద్వారా పరిష్కరించుకోవాలని చూస్తున్నాయి. ఇది ఈ భూమండలానికే ప్రమాదకరం. గాంధీయవాదం పరిష్కారం అంటే శాంతి చర్చలు, మధ్యవర్తిత్వం, మానవతా దృక్పథం. జవహర్లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన అలీన విధానం ప్రపంచానికి ఒక నమూనా. అదే పంచశీల సిద్ధాంతం, పరస్పర గౌరవం, పరస్పర అహింస. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా ఉండడం వంటివి ప్రధానమైనవి. ఐక్యరాజ్యసమితిలో భారత్ శాంతి దళాలలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. భారత్ యుద్ధాలలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా, శాంతి చర్చలకు మధ్యవర్తి పాత్ర వహించే వేదికగా నిలవాలి. అంతర్జాతీయ వేదికలపై అహింసా సందేశాన్ని, శాంతి దౌత్యంను విస్తరించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత్ 'గ్లోబల్ సౌత్'కు నాయకత్వం వహించాలి. కొంతమంది గాంధీయవాదం ప్రస్తుత కాలానికి సరిపోదని పరిహాసం చేస్తుంటారు, కానీ వాస్తవంలో దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా, అమెరికా సివిల్ రైట్స్‌లో మార్టిన్ లూథర్ కింగ్ ఉద్యమాలు గాంధీ సిద్ధాంతాలనే అనుసరించి విజయం సాధించారు. ప్రపంచ శాంతి కోసం ఆయుధ పోటీని తగ్గించి, పిల్లలకు శాంతి, అహింస విలువల గొప్ప తనాన్ని నేర్పాలి. అంతర్జాతీయ దేశాలు కలిసి మెలసి సమ స్యలను పరిష్కరించుకోవాలి. భవిష్యత్తులో గాంధీయ వాదం పునరుజ్జీవనం సాగించి, ప్రపంచం మళ్లీ గాంధీ మార్గాన్ని అనుసరించాలి. అందులో భారతదేశం (నాయకత్వం) విశ్వగురుగా ఎదగాలంటే గాంధీయవాదాన్ని అమలు చేయాలి. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో ప్రపంచం ఒక కీలక మలుపులో ఉంది. ఈ దశలో హింస, అణు ఆయు ధాల పోటీలు మానవాళిని నాశనం దిశగా తీసుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో గాంధీయవాదం మాత్రమే శాశ్వత పరిష్కారం కాగలదు. మహాత్మాగాంధీ చెప్పినట్లు 'అహింసే మానవాళిని రక్షించగల ఏకైక మార్గం'అనే సత్యాన్ని భారతదేశం తన చరిత్ర ను గుర్తుచేసుకుని గాంధీ మార్గంలో నడిస్తే ప్రపంచానికి శాంతి దూతగా మారగలదు. ●

# యువత భవిష్యతుకు హుక్కా పొగల ముప్పు

ముద్దం నరసింహస్వామి

హైదరాబాద్ నగరంలో ఇటీవల హుక్కా సెంటర్లపై పోలీసులు వరుసగా నిర్వహిస్తున్న దాడులు ఒక ముఖ్యమైన సామాజిక సమస్యను మళ్లీ ముందుకు తీసుకొచ్చాయి. కేఫ్‌ల పేరుతో, వినోద కేంద్రాల పేరుతో యువతను ఆకర్షిస్తూ నడుస్తున్న ఈ అక్రమ హుక్కా కేంద్రాలు కేవలం చట్ట విరుద్ధ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, యువత ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థ, నగర సంస్కృతిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత వారం రోజులుగా హైదరాబాద్ నగరంలోని ఎల్బీనగర్, నాగోల్ ప్రాంతాల్లో జరిగిన వరుస దాడులు ఈ సమస్య ఎంత విస్తృతంగా ఉందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా కేఫ్ సంస్కృతి పేరుతో యువతను ఆకర్షిస్తూ హుక్కా వినియోగాన్ని సాధారణంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. హుక్కా అంటే కేవలం ఒక వినోద సాధనం అన్న భావనను వ్యాపింపజేస్తూ, ఆరోగ్యపరమైన ప్రమాదాలను దాచిపెడుతున్నారు. అయితే వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం హుక్కా పొగ తాగడం సాధారణ సిగరెట్ కంటే మరింత ప్రమాదకరమని ఇప్పటికే అనేక పరిశోధనలు వెల్లడించాయి. ఒక గంట పాటు హుక్కా తాగడం అంటే దాదాపు వంద సిగరెట్లు తాగినంత ప్రమాదం ఉందని కూడా చెబుతున్నారు. అయినప్పటికీ యువతలో దీనిపై సరైన అవగాహన లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇటీవల పోలీసులు నిర్వహించిన దాడుల్లో డజన్ల కొద్ది హుక్కా పాట్స్, ఫ్లేవర్డ్ టొబాకో, వాహనాలు, మొబైల్స్ స్వాధీనం చేసుకోవడం ఈ అక్రమ వ్యాపారం ఎంత పెద్ద స్థాయిలో నడుస్తోందో సూచిస్తోంది. ముఖ్యంగా విద్యార్థులు, యువ ఉద్యోగులు ఈ కేంద్రాలకు ఎక్కువగా ఆకర్షితులు కావడం సమాజానికి ఒక హెచ్చరికగా భావించాలి. ఒకవైపు చదువు, ఉద్యోగ భవిష్యత్తు ముందుకు సాగాల్సి న వయస్సులో ఇలాంటి అలవాట్లు వారి జీవితాన్ని దారి తప్పించే ప్రమాదం ఉంది. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే చట్టాలను ఉల్లంఘిస్తూ ఇలాంటి కేంద్రాలు నగరంలో ఎలా కొనసాగుతున్నాయన్న ప్రశ్న. హుక్కా సెంటర్లు నడపడానికి అనుమతులు



లేకపోయినా, కొన్ని కేఫ్‌లు పేరుకు మాత్రమే కాఫీ షాపులుగా నమోదు చేసుకుని లోపల అక్రమంగా హుక్కా సేవలను అందించడం గమనించదగ్గ విషయం. ఇది కేవలం యజమానుల బాధ్యత మాత్రమే కాదు, స్థానిక పర్యవేక్షణ వ్యవస్థల లోపాన్ని కూడా సూచిస్తుంది. ఒకసారి దాడి చేసి మూసివేయడం మాత్రమే సరిపోదు. దీర్ఘకాలిక పర్యవేక్షణ అవసరం. అలాగే ఈ సమస్యను కేవలం పోలీస్ చర్యలతో మాత్రమే నియంత్రించడం సాధ్యంకాదు. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజ సంస్థలు కలిసి పనిచేయాల్సి న అవసరం ఉంది. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై మరింత శ్రద్ధ చూపాలి. వారు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో కలుస్తున్నారు? అనే విషయాల్లో కనీస అవగాహన ఉండాలి. అదే సమయంలో విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇంకా ఒక ముఖ్యమైన అంశం. సోషల్ మీడియా ప్రభావం. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, సోషల్ మీడియా రీల్స్‌లో హుక్కా వినియోగాన్ని ఒక ఫ్యాషన్‌గా చూపించడం యువతను ప్రభావితం చేస్తోంది. ఇది ఒక స్టేటస్ సింబల్ అన్న భావన పెంచుతోంది. ఈ భావనను మార్చడానికి ప్రభుత్వ సంస్థలు అవగాహన ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ఆరోగ్యపరమైన ప్రమాదాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలి. ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సి న అవసరంఉంది. అక్రమహుక్కా కేంద్రాలపై కేవలం అప్పుడప్పుడు దాడులు చేయడం కాకుండా, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలి. అనుమతి లేకుండా హుక్కా సేవలు అందిస్తున్న కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే ఫ్లేవర్డ్ టొబాకో విక్రయాలపై నియంత్రణను మరింత కట్టుదిట్టం చేయాలి. ఇటీవల జరిగిన దాడుల్లో 80 మందికి పైగా అరెస్టులు జరగడం ఒక సానుకూల సంకేతమే అయినప్పటికీ, ఇది సమస్య పరిమాణాన్ని కూడా తెలియజేస్తోంది. ఒక్క ప్రాంతంలోనే ఇంత పెద్ద సంఖ్యలో యువత హుక్కా కేంద్రాల్లో పట్టుబడటం సమాజం ఆలోచించాల్సి న అంశం. ఇది కేవలం ఒక చట్టపరమైన సమస్య కాదు. ఒక సామాజిక హెచ్చరిక. మొత్తానికి, హుక్కా సంస్కృతి పెరగుదల నగర జీవనశైలిలో ఒక ప్రమాదకర మార్పుకు సంకేతం. ఈ పరిస్థితిని నియంత్రించడానికి పోలీసులు, ప్రభుత్వం, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, మీడియా కలిసి పనిచేయాలి. యువత ఆరోగ్యాన్ని కాపాడటం అంటే భవిష్యత్ సమాజాన్ని కాపాడటమే. కాబట్టి హుక్కా కేంద్రాలపై కఠిన చర్యలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు కూడా సమాంతరంగా కొనసాగితేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ●

# జనంలో వనజీవుల సమస్యకు పరిష్కారమేది?

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

తెలుగు రాష్ట్రాల్లో గత కొంతకాలంగా కోతుల బెడద కేవలం గ్రామీణ అసౌకర్యం స్థాయిని దాటి, ప్రాణాపాయం కలిగించే సామాజిక సంక్షోభంగా రూపాంతరం చెందుతోంది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో 20కి పైగా కోతులు గుంపుగా దాడి చేసి 68ఏళ్ల వృద్ధురాలిని బలితీసుకున్న ఘటన నాగరిక సమాజాన్ని కలవరపరచడమే కాదు, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించాల్సి న అత్యవసర పరిస్థితిని గుర్తుచేసింది. అడవుల్లో ఉండాల్సి న వన్యప్రాణులు గ్రామాల్లో, పట్టణాల్లో స్వైరవిహారం చేస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించడం పర్యావరణ సమతుల్యత ఎంతగా దెబ్బతిన్నదో తెలియజేస్తోంది. ఇప్పటికే అనేక గ్రామాల్లో కోతుల దాడులు రోజువారీ జీవితంలో భాగమైపోయాయి. పాదచారులపై వెంబడించడం, పిల్లలపై దాడి చేయడం, వృద్ధులను లక్ష్యంగా చేసుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. చిన్నపిల్లలు స్కూల్‌కు వెళ్లడానికే భయపడే పరిస్థితి ఏర్పడింది. మహిళలు ఇంటి బయటకు రావడానికి కూడా సంకోచిస్తున్నారు. గాయపడినవారు రాబిస్ వ్యాక్సి న్లు వేయించుకోవాల్సి న పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో కోతులతో పాటు కుక్కల దాడులు కూడా పెరగడం గ్రామీణ భద్రతపై మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం అసౌకర్యం కాదు, ప్రజల ప్రాణ భద్రతను నేరుగా ప్రభావితం చేస్తున్న అత్యవసర ప్రజా సమస్యగా మారింది. కోతుల బెడద వల్ల అత్యంత తీవ్రంగా నష్టపోతున్న వర్గం రైతాంగమే. కూరగాయలు, వేరుశెనగ, మొక్కజొన్న, పండ్ల తోటలు వంటి పంటలు భారీగా నాశనం అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి తప్ప ఇతర పంటలు వేయడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. దీని వల్ల పంటల వైవిధ్యం తగ్గిపోవడమే కాకుండా ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతోంది. వ్యవసాయం లాభదాయకం కాకపోవడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. ఈ పరిస్థితి కొనసాగితే రైతుల జీవనోపాధి మాత్రమే కాదు, దేశ ఆహారభద్రతకూ దీర్ఘకాలిక ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ఈ సమస్య తీవ్రత ఎంతగా పెరిగిందంటే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా కోతుల బెడద ప్రధాన అజెండాగా మారింది. కోతుల సమస్యను పరిష్కరిస్తాం అనే హామీ ఇచ్చిన అభ్యర్థులను ప్రజలు గెలిపించడం పరిస్థితి ఎంత దారుణంగా మారిందో తెలియజేస్తోంది. ఒకప్పుడు రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సమస్యలు ఎన్నికల చర్చల్లో ప్రధానంగా ఉండేవి. ఇప్పుడు కోతుల బెడద వాటిని మించిపోయి ప్రజల ఓటు నిర్ణయాన్ని ప్రభావితం చేసే అంశంగా మారడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. కోతులు ఊళ్లపైకి రావడానికి ప్రధాన కారణం మనమే



సృష్టించిన పర్యావరణ అసమతుల్యత. అడవుల విస్తీర్ణం తగ్గడం, పోడు వ్యవసాయం పేరుతో అటవీ నరికి వేయడం, సహజ ఆహార వనరులు తగ్గిపోవడం వల్ల కోతులు జనావాసాల వైపు రావాల్సి వస్తోంది. అడవిలో ఆహారం కోసం గంటల తరబడి తిరగాల్సి వస్తే, గ్రామాల్లో మాత్రం తక్కువ సమయంలోనే ఆహారం లభించడం వాటిని ఇక్కడే స్థిరపడేలా చేస్తోంది. దీనికి తోడు సంప్రదాయ విశ్వాసాల కారణంగా కోతులను హాని చేయకపోవడం కూడా వాటి జనాభా పెరుగుదలకు దోహదపడుతోంది. ఇప్పటి వరకు కోతులను పట్టుకొని అడవుల్లో వదిలేయడం వంటి చర్యలు చేపట్టినా అవి శాశ్వత పరిష్కారం కాలేకపోయాయి. వదిలిన ప్రాంతాల నుంచి అవి మళ్లీ గ్రామాలకే తిరిగి వస్తున్నాయి. కొన్నిసార్లు సమస్యను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మాత్రమే మార్చినట్లవుతోంది. అందువల్ల శాస్త్రీయంగా జనాభా నియంత్రణ చర్యలు చేపట్టడం అత్యవసరం. హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న స్టెరిలైజేషన్ విధానాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలను తెలుగు రాష్ట్రాల్లో కూడా అమలు చేయాల్సి న అవసరం ఉంది. అయితే సమస్య పరిష్కారంలో ప్రధాన అడ్డంకిగా నిలుస్తున్నది అధికార యంత్రాంగంలోని సమన్వయ లోపమే. కోతుల సమస్య ఎదురైనప్పుడు అటవీ శాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్ శాఖలు ఒకరిపై ఒకరు బాధ్యతలను నెట్టుకోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. కోతులు వన్యప్రాణుల జాబితాలో స్పష్టంగా నిర్వచించబడకపోవడం వల్ల వాటి నియంత్రణకు అవసరమైన నిధులు కేటాయించడంలో కూడా జాప్యం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు పార్లమెంటులో గళమెత్తినా, క్షేత్రస్థాయిలో అమలు కావాల్సి న చర్యలు ఇంకాపూర్తిగా ప్రారంభం కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఉంది. ప్రభావిత మండలాల్లో కోతుల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం, పశు వైద్యుల పర్యవేక్షణలో భారీఎత్తున స్టెరిలైజేషన్ కార్యక్రమాలు చేపట్టడం, ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి వ్యవసాయ, అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించడం అత్యవసరం. కోతుల దాడిలో గాయపడిన వారికి, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడం కూడా ప్రభుత్వ బాధ్యతగా భావించాలి. గ్రామీణ సమాజం భయాందోళనల మధ్య జీవించాల్సి న పరిస్థితి ఏర్పడటం అభివృద్ధి చెందుతున్న సమాజానికి తగినది కాదు. కోతుల బెడదను తక్షణమే నియంత్రించకపోతే రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమైన సామాజిక, ఆర్థిక సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణ భద్రత, రైతుల జీవనోపాధి, గ్రామీణ ఆర్థిక స్థిరత్వం ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సమగ్ర, శాస్త్రీయ, దీర్ఘకాలిక కార్యాచరణతో ముందుకు రావాల్సి న అత్యవసర సమయం ఇదే. ●

# ప్రజావాక్కు



### మూగజీవాలపట్ల దయ చూపండి

వేసవికాలం ప్రారంభం కావడంతోనే సూర్యుడు తీవ్రంగా మండిపోతున్నాడు. ఇంకా ముందున్న మూడు నెలలు మరింత తీవ్రమైన ఎండలతో ఉండబోతున్నాయి. ఈ మండుతున్న వేసవిలో మనుషులకు ఆకలి వేస్తే ఆహారం తింటారు, దాహంవేస్తే నీళ్లతాగి దప్పిక తీర్చుకుంటారు. కానీ మనతోపాటుఈభూమిపై జీవిస్తున్న మూగజీవాలకు మాత్రం అలాంటి సౌకర్యాలుండవు. వేసవికాలంలో పక్షులు, మిగతా ఎన్నో మూగజీవాలు ఆహారం కోసం, చుక్క నీటి కోసం ఎండలో ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటాయి. మనకు చిన్న సహాయం అనిపించినది వాటి ప్రాణాలను కాపాడే గొప్ప సహాయం అవుతుంది. ప్రతి ఒక్కరూ కొద్దిగా సహృదయంతో ఆలోచిస్తే చాలా సులభంగా వాటికి సహాయం చేయవచ్చు. మీఇంటి డాబాపై అయినా, బాల్కనీలో అయినా, ఇంటి కాంపౌండ్‌గోడపైన, మీ కాంపౌండ్ బయట అయినా, లేదా మీ కాలనీలోని ఫుట్‌పాత్‌లపైనా ఒక చిన్న పాత్రలో నీళ్ల ఉంచండి.

- వై. సంజీవ కుమార్, హైదరాబాద్

### పాజిటివ్‌గా ఆలోచించాలి

విద్యార్థి పరీక్షల్లో పాస్ అయినా వ్యాపారికి వ్యాపారంలో లాభంవచ్చినా నిరుద్యోగికి మంచిఉద్యోగం దొరికినా ఎన్నికల్లో ఏదైనా రాజకీయ పార్టీ గెలిచినా ఎంతో ఆనందిస్తారు. స్నేహితులని, చుట్టాలని ఇరుగుపొరుగు వారిని కలిసి వీరితో తమఆనందాన్ని పంచుకుంటారు. వ్యతిరేకంగాజరిగితే తీవ్రనిరాశకు గురవుతారు. సర్వం కోల్పోయినట్లు బాధపడుతుంటారు. అలాగే ఆటలో క్రీడాకారులు విజేతగా నిలిచినా ఇలానే ఉంటుంది. కొందరు బాధను తట్టుకోలేక కళ్లనీళ్లు పెట్టేసుకుంటారు. మైదానంలోనే వలవల ఏడ్చేస్తారు. అయితే ఇలా ఎవరూ ప్రవర్తించకూడదు. మనిషి జీవితం అంటేనే సుఖదుఃఖాలు.

- కె.వి. రమణ, హైదరాబాద్

### పండ్ల సాగును పెంచాలి

రైతుబంధు లేదా భరోసాతో తెలంగాణలోని వేలాది ఎకరాల బీడు భూమి సాగులోకి వచ్చింది. అయితే కేంద్రం తెస్తున్న వీబీజీరాంజీ స్కీంలో ఆస్తుల సృష్టికి అత్యధిక ప్రాధాన్యంఇస్తున్నారు. తెలంగాణ లాంటి రాష్ట్రాలు ఏ పనుల వైపు ఎక్కువ దృష్టి పెట్టాలి అంటే పండ్ల సాగు వైపు దృష్టి పెట్టాలి. దీంతోఉపాధి స్థిరీకరణ జరుతుంది.

- భారత అవినాష్, జనగామ

### మంచినీరే ఔషధం

శుభ్రమైన త్రాగునీరు వాడకం మన ఆరోగ్య పరిరక్షణకు ఒక ఆయుధం వంటిది. చక్కటి శరీర సౌష్టవానికి, మన శరీరం జబ్బులు దరిచేరకుండా ఉండటానికిఉచితమైన మెడిసిన్ ఏదైనా ఉందంటే అది ఒక్క శుద్ధిచేసిన నీరు మాత్రమే. వేకువ జామున రెండుమూడుగ్లాసుల గోరువెచ్చని నీరు సేవించామంటే చాలు మనలో అంతవరకు ఆవహించి వున్న నిసత్తువ తొలిగిపోయి రోజంతా మన శరీరంఎనలేని ఉత్సహాన్ని సంతరించుకుంటుంది అనే మాట సత్యదూరం కాదు. ముఖ్యంగా రాబోతున్నమండువేసవిలో తగినంతసముపాళ్లలో స్వచ్ఛమైన నీరు సేవించడం మూలాన మన బాడీ డీహైడ్రేషన్ బారిన పడకుండా అత్యంత సురక్షి తంగా ఉంటుంది. అందుకనే ప్రజ లందరూ స్వచ్ఛమైన నీరును సేవిస్తూ మంచి ఆరోగ్యవంతు లుగా జీవించాలనే ఏకైక లక్ష్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం వారు అనేక ప్రాంతాల్లో, పట్టణాల్లో, పల్లెల్లో ఉచిత బోర్లు వేస్తూ ప్రజలందరిలో జల కళ తీసుకువచ్చేలా అవిరళ కృషి సల్పుతున్నది.

- బగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### రాజకీయ రిజర్వేషన్లు

ప్రజాస్వామ్య భారత దేశంలో పార్లమెంట్ స్థానాలు, అసెంబ్లీ స్థానాల సంఖ్య 2029 ఎన్నికల వరకు పెంచే అవకాశం వుంది. కనుక ఎస్సి, ఎస్టీ,బిసి, నియోజకవర్గం రిజర్వేషన్‌తో పాటుగా వికలాంగులకు కూడా ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు అయ్యే అవకాశం కలిపించాలి. అందుకోసం రాష్ట్రంలో ఓటు హక్కు కలిగిన వికలాంగుల వివరాలు సేకరించి పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కలిపించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలి

వేసవికాలం ప్రారంభమౌతున్న నేపథ్యంలో భవిష్యత్తు కాలంలో ఎండల తీవ్రత ఉండే అవకాశం ఉంది. కావునా ప్రతి చుక్కనీటి బొట్టును చూసి వాడుకోవాలి. లేదంటే గతంలో నీటి ఎద్దడికి ఎంత ఇబ్బంది పడ్డామో మన అందరం చూసి అనుభవించిన సమస్యనే. సాధారణంగా ఈ సంవత్సరం వర్షాలు, చల్లి, ఎక్కువగానే ఉన్నందున ఎండలు కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. జీవరాసులన్నింటికీ జలం అవసరమే కావునా ప్రభుత్వాలు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్న ప్రతి ఇంటికి మాత్రం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూలు జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం



32 సవరణలకూ గ్రీన్‌సిగ్నల్

సహకార డివిడెండ్ ఆదాయంపై మూడేళ్లు పన్ను మినహాయింపు: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ఏప్రిల్ 1 నుంచి 'కొత్త ఐటి చట్టం 2025' అమల్లోకి

**న్యూఢిల్లీ, మార్చి 25:** లోక్‌సభ 32 ప్రభుత్వ సవరణలతో కూడిన ఆర్థిక బిల్లు 2026ను బుధవారం ఆమోదించింది. ఆర్థిక బిల్లు 2026 ఆమోదంతో, బడ్జెట్ ఆమోద ప్రక్రియలో తన వంతు బాధ్యతను లోక్‌సభ పూర్తి చేసింది. ఇక ఇప్పుడు ఎగువ సభ అయిన రాజ్యసభ ఈ బిల్లును పరిశీలిస్తుంది. రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించిన తర్వాత, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రక్రియ పూర్తిగా ముగుస్తుంది. దేశ ఆర్థిక విధానాలు, పన్నుల రూపకల్పనలో ఈ బిల్లు ఆమోదం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర బడ్జెట్ 202627 ప్రకారం, మొత్తం వ్యయం రూ.53.47లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. ఇది మార్చి31తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 7.7శాతం అధికం. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన మొత్తం మూలధన వ్యయం రూ.12.2 లక్షల కోట్లుగా ఉంది. ఈ బడ్జెట్ ద్వారా స్థూల పన్ను ఆదాయ వసూళ్ల రూ.44.04 లక్షల కోట్లుగానూ, స్థూల రుణ సేకరణ రూ.17.2 లక్షల కోట్లుగానూ ఉండవచ్చని ప్రతిపాదించారు. 2027 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య లోటు జిడిపిలో 4.3శాతంగా ఉంటుందని అంచనా వేశారు. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న 4.4శాతం కంటే తక్కువ. చిన్న సభ్యులకు ప్రయోజనం సమకూర్చడం, సహకార రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా జాతీయ సహకార సమాఖ్యల డివిడెండ్ ఆదాయంపై మూడేళ్ల పన్ను మినహాయింపును ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లు చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, ఈ పన్ను మినహాయింపు చిన్న సహకార సభ్యుల ఆదాయాలను పెంచడానికి, ఈ రంగంలో మరింత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుందని వివరించారు. దేశంలో ఉద్యోగాల కల్పన, ఆర్థిక వృద్ధికి తోడ్పడటంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ ఎంఇ), రైతులతోపాటు సహకార సంఘాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధిఎంఎస్ఎంఇలు, రైతులు, సహకార సంఘాలను బలోపేతం చేయడం అత్యవసరమన్నారు. ఈ రంగాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు వెన్నెముకగా నిలుస్తాయి. ఇవి వివిధ పరిశ్రమలు, ప్రాంతాలలో ఉపాధికల్పనకు సహాయపడతాయి అని పేర్కొన్నారు. ఫైనాన్స్ బిల్లులో డేటా సెంటర్ సేవలకు సంబంధించిన ఒక కొత్త నిబంధనను కూడా ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సేఫ్ హార్బర్ నిబంధన ప్రకారం, సంబంధిత విదేశీ సంస్థలకు ఇటువంటి సేవలను అందించే భారతీయ నివాస కంపెనీలకు ఖర్చులపై 15శాతం మార్జిన్‌ను అనుమతిస్తారు. "దీని వల్ల భారతదేశంలోని కార్యకలాపాలు నిజమైనవిగా, లాభదాయకంగా ఉండేలా చూడటంతోపాటు, నిజమైన వ్యాపారా కార్యకలాపాలు లేని డొల్ల సంస్థల ఏర్పాటును నిరుత్సాహపరుస్తుంది అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్థికవ్యవహారాలపై ఉన్న ఆందోళనలను ఉద్దేశించి మాట్లాడుతూ, కొన్ని సందర్భాలలో కేంద్రం సెస్సులు, సర్‌చార్జీల ద్వారా వసూలు చేసిన దానికంటే ఎక్కువగా ఖర్చుచేసిందని, ఇది నిధులు ప్రజా సంక్షేమం వైపు మళ్లించబడుతున్నాయని సూచిస్తోందన్నారు. సాంకేతిక లోపాలపై విధించే జరిమానాలను ఇకపై స్థిరరుసుములుగా మార్చనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 'ఈ చర్యవ్యాపారాలకు అనిశ్చితిని తగ్గించి, నిబంధనల పాటింపును సులభతరం చేస్తుందని భావిస్తున్నాము" అని పేర్కొన్నారు. మరో చర్యగా, విమానాశ్రయాల్లో వివాదాలను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయాణికుల అలవెన్సులను హేతుబద్ధీకరించింది. ఈ చర్యలు కీలక రంగాలను బలోపేతం చేయడం, వ్యాపారం చేసే సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ఆర్థిక వృద్ధి సమాజంలోని విస్తృత వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా చూడటం లక్ష్యంగా పెట్టుకున్నాయని ఆర్థిక మంత్రి వివరించారు.

**ఏప్రిల్ 1 నుంచి 'కొత్త ఐటీ చట్టం 2025' అమల్లోకి**

భారత్‌లో కొత్తఆదాయపు పన్ను చట్టం-2025ను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. దశాబ్దాల నాటి 1961 చట్టం స్థానంలో ఈ కొత్త చట్టం ఏప్రిల్ 1నుంచి అమల్లోకి రానుంది. అయితే, ఈ మార్పు కారణంగా ప్రస్తుత పన్ను రిటర్నుల ఫైలింగ్‌పై చెల్లింపుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఫైలింగ్ ప్రక్రియ మొత్తం ప్రస్తుతం అమల్లో ఉన్న 1961 చట్టం ప్రకారమే కొనసాగుతుందని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కొత్త చట్టం అమలుపై నిపుణులు కీలక వివరణ ఇచ్చారు.



## ఐఆర్‌సిటిసి పోర్టల్‌లో 3కోట్లు పైగా నకిలీ ఖాతాలు తొలగింపు

ఈ యేడాదిలో 75వేలకు పైగా ప్రత్యేక రైళ్లు నడిపాం: లోక్‌సభలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌వెల్లడి

**న్యూఢిల్లీ, మార్చి 25:** రైలు టిక్కెట్లను విక్రయించే దళారులతో వ్యవహరించే ప్రయత్నాల్లో భాగంగా ఐఆర్‌సిటిసి పోర్టల్ నుంచి మూడు కోట్లకు పైగా నకిలీ ఖాతాలను తొలగించామని, రైళ్లలో దాదాపు 78 శాతం సీట్లు నాన్-ఎసి కేటగిరీకి చెందినవేనని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన, సరసమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నొక్కిచెబుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 75,000కు పైగా ప్రత్యేక రైళ్లను నడిపినట్లు కూడా మంత్రి తెలిపారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో సుదూర రైళ్లలో రద్దీకి సంబంధించిన అనుబంధ ప్రశ్నలకు వైష్ణవ్ సమాధానమిచ్చారు. రైలు టిక్కెట్లను దళారులు అమ్ముతున్న సమస్యను అరికట్టడానికి చర్యలు తీసుకున్నామని, ఐఆర్‌సిటిసి పోర్టల్ నుంచి మూడు కోట్లకు పైగా నకిలీ ఖాతాలను తొలగించామని ఆయన తెలిపారు. నిజమైన ప్రయాణికులకు రైలు టిక్కెట్లు అందుతున్నాయని ఆయన పునరుద్ఘాటించారు. రైళ్లలోని కోచ్‌లలో సుమారు 70 శాతం జనరల్, స్లీపర్ కోచ్‌లు కాగా, 78 శాతం సీట్లు నాన్‌ఏసీ కేటగిరీకి చెందినవి. రద్దీఎక్కువగా ఉండే సీజన్లలో మరిన్ని రైళ్లను నడపడం గురించి ఆయన మాట్లాడుతూ, యుపిఏ ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఎక్కువ సంఖ్యలో ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టిందని చెప్పారు. రైల్వే భద్రతపై దృష్టి పెట్టడం వల్ల తత్ఫలితంగా జరిగే ప్రమాదాలు 90 శాతం తగ్గాయని కూడా మంత్రి తెలిపారు. అంతకుముందు, ఈ నెలలో కన్ను మూసిన మాజీ సభ్యులు విష్ణు మోడీ, దత్తా మేఘేలకు కూడా సభనివాళి అర్పించింది. దివంగత ఆత్మలకు గౌరవ సూచకంగా, సభ్యులు, స్పీకర్ ఓం బిర్లా కూడా కొద్దిసేపు మౌనం పాటించారు.




## గ్యాస్ సంక్షోభంపై విపక్ష ఎంపీల నిరసన

**న్యూఢిల్లీ, మార్చి 25:** పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పెరుగుతున్న ప్రపంచ ఆందోళనలు, ఎల్‌పిజి సరఫరా కొరతపై ప్రతిపక్ష ఎంపీలు బుధవారం పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ అధినేత మల్లికార్జున్ ఖర్గే, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, సిపిఐ ఎంఎల్‌కు చెందిన సుదామా ప్రసాద్, డిఎంకెకు చెందిన టి.సుమతి, జెఎంఎంకు చెందిన మహువా మాజీతో సహా సీనియర్ ఎంపీలు తమ నిరసనను తెలియజేయడానికి మకర ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. "ఖాళీ సిలిండర్లు, వట్టి వాగ్దానాలు" అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్‌ను పట్టుకుని, తగినంత గ్యాస్ సిలిండర్‌లు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ ఎంపీలు నినాదాలు చేశారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్‌పిజి కొరతఏర్పడిన విషయం తెలిసిందే. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలతో ఇంధన సరఫరా గతిశీలతను ప్రభావితంచేశాయి. దీంతోఎల్‌పిజి, సిఎన్‌జి, పైపుల ద్వారా సరఫరా చేసే వంటగ్యాస్ కోసం దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజ వాయువు వినియోగానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి, ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.

## కాంగ్రెస్ ఆఫీసు ఖాళీ చేయాలని నోటీసులు

**న్యూఢిల్లీ, మార్చి 25:** ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి చిరునామాగా ఉన్న రాజధానిలోని అక్బర్ రోడ్ కార్యాలయం ఖాళీచేయాలని ఢిల్లీ ఎస్టేట్స్ శాఖ నోటీసులు ఇచ్చింది. ఈనెల 28లోగా ఆ భవనాన్ని ఖాళీ చేయాలని స్పష్టం చేసింది. 1978 నుంచి అంటే గత 48 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యకలాపాలకు 24, అక్బర్ రోడ్ భవనం కేంద్రంగా ఉంది. ఈ కార్యాలయంతో పాటు, 5 రైసినా రోడ్‌లో ఉన్న ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ను కూడా ఖాళీ చేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఢిల్లీలోని కోట్లా మార్గ్‌లో ఇందిరా



భవన్ పేరుతో కొత్త జాతీయ కార్యాలయాన్ని నిర్మించుకుంది. గత ఏడాదే సోనియా గాంధీ దీనిని ప్రారంభించారు. నిబంధనల ప్రకారం, రాజకీయ పార్టీకి సొంత భవనం సమకూరిన తర్వాత ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుంది. అయితే అక్బర్ రోడ్‌తో ఉన్న చారిత్రక అనుబంధం వల్ల పార్టీ కార్యకలాపాలు ఇంకా అక్కడి నుంచే కొనసాగుతున్నాయి. తాజా ప్రభుత్వ నోటీసులపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపిస్తోంది. భవనాన్ని బలవంతంగా ఖాళీ చేయించకుండా నిరోధించేందుకు, మరికొంత సమయం పొందేందుకు న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తోంది. ఈ విషయంలో కోర్టును ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి.

## రోడ్డుప్రమాదంలో నటి మోడల్ హార్షల్ కాలియా దుర్మరణం

**జైపూర్, మార్చి 25:** ప్రముఖ నటి, మోడల్ హార్షిల్ కాలియా (30) ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమె ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో జైపూర్‌లోని షిప్రా పత్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, ఆమె నడుపుతున్న కారు ఒక మలుపు వద్ద అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కి బోల్తా పడింది. ఈ దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, కారును సరిచేసి హార్షిల్‌ను బయటకు తీశారు. వెంటనే ఆమెను సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె తలకు తీవ్ర గాయాలవడంతో చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు.

## ఈశాన్య సరిహద్దుల్లో 'బోర్డర్ బ్రూ కేఫ్'

**ఇటానగర్, మార్చి 25:** భారత సైన్యం అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల సరిహద్దు ప్రాంతంలో ఆపరేషన్ సద్భావనలో భాగంగా తవాంగ్ జిల్లా జెమితాంగ్ గ్రామంలో బోర్డర్ బ్రూ కేఫ్ పేరిట ఓ కాఫీ షాప్ ను ప్రారంభించింది. స్థానిక గిరిజన సమాజ అభివృద్ధి, పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఈ కేఫ్ ద్వారా స్థానిక మోన్పా గిరిజన తెగ వారికి సాధికారత కల్పించడం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలు సృష్టించడం ముఖ్య ఉద్దేశం. ఈ కేఫ్ నిర్మాణంలోనే ఒక ప్రత్యేకత ఉంది. జెమితాంగ్ లోయ గుండా ప్రవహించే న్యామ్జంగ్ చు నదిపై, వాడకంలో లేని పాత బ్రైలీ వంతెన మీద దీనిని నిర్మించారు. ఒక వారసత్వ కట్టడాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చి వినియోగించడం ఈశాన్య రాష్ట్రాల్లోనే ఇది మొదటిసారని రక్షణ శాఖ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ తెలిపారు. ఈ కేఫ్ ఈ సుందరమైన సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు ఒక ఐకానిక్ గమ్యస్థానంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయవచ్చని వివరించారు. భారత సైన్యం కేవలం 31 రోజుల రికార్డు సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం విశేషం. ఇది సైన్యం యొక్క అద్భుతమైన ప్రణాళిక, సమన్వయం, కార్యనిర్వహణను ప్రతిబింబిస్తుంది. ఆపరేషన్




సద్భావన యొక్క ముఖ్య ఉద్దేశమైన పౌరసైనిక సంబంధాలను బలోపేతం చేయడానికి, సరిహద్దు కమ్యూనిటీల సామాజికఆర్థికాభివృద్ధికి దోహదపడటానికి ఈ చొరవ ఎంతగానో ఉపయోగపడుతుంది.

## మంటల్లో పశ్చిమాసియా

### శాంతిచర్చలతో ఎలాంటి సంబంధంలేదు: ఇజ్రాయెల్

**టెల్ అవీవ్, మార్చి 25:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా చేస్తున్న శాంతి ప్రయత్నాలకు ఇజ్రాయెల్ గట్టి షాకిచ్చింది. ఇరాన్‌తో అమెరికా జరుపుతున్న చర్చలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ దేశంపై తమ సైనిక దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. తమ దేశ భద్రతకు ఇరాన్, దాని అనుబంధ సంస్థల నుంచి ముప్పు పొంచి ఉన్నంత కాలం ఈ వైఖరి మారదని తేల్చి చెప్పింది. ఇటీవల ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ శాంతి దిశగా మొగ్గు చూపుతున్నారనే వార్తలు వస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్ తాజా నిర్ణయంతో పశ్చిమాసియాలో శాంతి ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### కాల్పుల విరమణ చర్చలకు ఇరాన్ షరతులు



**టెహ్రాన్, మార్చి 25:** కాల్పుల విరమణ చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ అత్యంత కఠినమైన షరతులను అమెరికా ముందు ఉంచింది. గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ పూర్తిగా మూసి వేస్తేనే చర్చలకు సిద్ధమని స్పష్టం చేసింది. ఇరాన్‌లో ఇటీవల బలపడిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఈ చర్చల వైఖరిని నిర్దేశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ కేవలం సైనిక స్థావరాల మూసివేతతోనే సరిపెట్టలేదు. తమపై అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడుల వల్ల జరిగిన నష్టానికి పూర్తి పరిహారం చెల్లించాలని కూడా డిమాండ్ చేస్తోంది. వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య ప్రస్తుతం ప్రత్యక్ష చర్చలు జరగడం లేదు. పశ్చిమాసియాలోని మధ్యవర్తుల ద్వారా ఇరు దేశాలు పరోక్షంగా తమ సందేశాలను ఇచ్చిపుచ్చుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ తన డిమాండ్ల జాబితాను పంపింది. ఇరాన్ పెడుతున్న ఈ షరతులు హాస్యాస్పదంగా, అవాస్తవికంగా ఉన్నాయని అమెరికా అధికారులు కొట్టిపారేసినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. ఇరాన్ ఇంత కఠిన వైఖరితో ఉండటంతో ఇరు దేశాల మధ్య సయోధ్య కుదరడం గతంలో కంటే మరింత కష్టతరం కావచ్చని అరబ్, అమెరికా అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఇరాన్ డిమాండ్లతో చర్చలకు దిగుతుండటంతో దౌత్యపరమైన మార్గాలు మరింత సంక్లిష్టంగా మారాయి.

### వైఫల్యాలు కప్పిపుచ్చుకుంటున్న అమెరికా

ఇరాన్ సైనికదళాల చీఫ్ ఎద్దేవా

**టెహ్రాన్; మార్చి 25:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, అమెరికాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌ఇజ్రాయెల్ ఘర్షణలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఇరాన్ సైనిక దళాల చీఫ్ ఆరోపించారు. ఓటమిని ఒక దౌత్యపరమైన ముందడుగుగా చిత్రీకరించే ప్రయత్నాలను మానుకోవాలని ట్రంప్ కు హితవు పలికారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను నిలువరించడంలో అమెరికా విఫలమైందని, ఆ నిస్సహాయతను ఇప్పుడు ప్రపంచం ముందు ఒక విజయంగా ప్రచారం చేసుకోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, శత్రువుల ఎత్తుగడలను తిప్పికొట్టే పూర్తి సైనిక సామర్థ్యం తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడానికి అమెరికా జోక్యమే కారణమని ఇరాన్ ఆరోపించింది. ఇజ్రాయెల్‌కు అందిస్తున్న సైనిక సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఒకవైపు శాంతి చర్చల గురించి మాట్లాడుతూ, మరోవైపు క్షేత్రస్థాయిలో ఇజ్రాయెల్‌ను ప్రోత్సహించే ద్వంద్వ వైఖరిని అమెరికా వీడాలని సూచించింది. ఈ అబద్ధపు ప్రచారాలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సైనిక ప్రతినిధి హెచ్చరించారు.

### జెడీవాన్స్ బృందంతో చర్చలకే ఇరాన్ ఆసక్తి

**టెహ్రాన్; మార్చి 25:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు తెరవెనుక జరుగుతున్న చర్చల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బృందం కంటే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో చర్చలు జరపడానికే ఇరాన్ ఎక్కువ ఆసక్తి చూపుతోంది. ట్రంప్ ప్రధాన సలహాదారులు, అల్లుడు అయిన జేర్డ్ కుష్నర్‌తో పాటు స్టీవ్ విట్‌కాఫ్‌లను పక్కనపెట్టి వాన్స్‌తో సంప్రదింపులకు టెహ్రాన్ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. జారెడ్ కుష్నర్ పట్ల ఇరాన్‌కు తీవ్ర అపనమ్మకం ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఇజ్రాయెల్‌తో కుష్నర్‌కు ఉన్న సన్నిహిత సంబంధాల వల్ల, ఆయన చర్చల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించరని ఇరాన్ భావిస్తోంది.

### అనుమతిలేకుండా హార్ముజ్‌లోని పాక్‌నౌకను వెనక్కిరప్పించిన ఇరాన్

**టెహ్రాన్; మార్చి 25:** హార్మ్యూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంతో పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ నౌకను ఇరాన్ వెనక్కి రప్పించింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇరాన్ సరిహద్దుల్లోని హార్మ్యూజ్ జలసంధిలో నౌకాయానానికి సంబంధించి ఆ దేశం నిబంధనలు విధించింది. ఈ జలసంధి మీదుగా వెళ్లడానికి అనుమతులను తప్పనిసరి చేసింది. ఈ క్రమంలో హార్మ్యూజ్ మీదుగా పాకిస్థాన్‌కు చెందిన కంటైనర్ కరాచీ వెళుతోంది. అనుమతులు లేకుండా ప్రయాణించడంతో ఆ నౌకను వెనక్కి రప్పించినట్లు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ (ఐఆర్జీసీ) వెల్లడించింది.



## అజిత్‌పవార్ విమాన ప్రమాదం ఓ కుట్ర

బెంగళూరులో జీరో ఎఫ్ఐఆర్‌కు ఫిర్యాదు చేసిన రోహిత్ పవార్

**బెంగళూరు, మార్చి 25:** మమహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాద మృతి కేసు కీలక మలుపు తీసుకుంది. ఇది ప్రమాదం కాదని, ఓ పెద్ద క్రిమినల్ కుట్ర అని ఆరోపిస్తూ ఆయన మేనల్లుడు, ఎన్సీపీ(ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ బెంగళూరులో జీరో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేయడంలో విఫలమవడంతోనే తాను ఇక్కడ ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. జనవరి 28న బారామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్‌తో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై విచారణ జరపాలని కోరుతూ ఫిబ్రవరిలో మహారాష్ట్రలోని పలు పోలీస్ స్టేషన్లను ఆశ్రయించినా ఫలితం లేకపోయిందని రోహిత్ పవార్ తెలిపారు. పోలీసులు కేవలం ప్రమాద మృతి నివేదిక మాత్రమే పరిశీలిస్తున్నారని చెప్పడంతో, ఆయన బెంగళూరులోని హై గ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రమాదానికి గురైన విమానాన్ని నడిపిన వీఎస్ఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై రోహిత్ పవార్ తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలుచేశారు. ఆ విమానం ప్రయాణానికి ఏమాత్రం యోగ్యం కాదని, దాని నిర్వహణ రికార్డులను తారుమారు చేశారని పేర్కొన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు మెయిల్ ద్వారా బెదరింపులు

16 కిలోల ఆర్డీఎక్స్ ఐఇడిలు అమర్చాం..

**న్యూఢిల్లీ, మార్చి 25:** ఢిల్లీఅసెంబ్లీకి మరోసారి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఢిల్లీ అసెంబ్లీలో 16 కిలోల ఆర్డీఎక్స్ ఐఈడీలు అమర్చామని, వాటిని మధ్యాహ్నం 01.40 గంటలకు పేల్చేస్తామని ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు బుధవారం మెయిల్ వచ్చింది. ఈ విషయాన్ని పోలీసులకు, ఉన్నతాధికారులకు స్పీకర్ ఓఎస్‌డీ తెలిపారు. అతడి ఫిర్యాదుతో పోలీసులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఢిల్లీ పోలీసులు, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్, డిస్పోజబుల్ టీమ్స్ సహా భద్రతా సిబ్బంది అసెంబ్లీ ప్రాంగణం చేరుకుని గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ప్రాంగణమంతా తనిఖీలు చేశారు. ప్రతి మూలలో, మొక్కలు, చిన్న కుండలు సహా ప్రతి చోటా వెతుకుతున్నారు. అసెంబ్లీకి వచ్చే ప్రజాప్రతినిధులు, మీడియా, సందర్శకుల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. 16 కిలోల ఆర్డీఎక్స్ ఉందని పేర్కొన్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉన్నారు. అయితే, ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపు రావడం ఇదే మొదటిసారి కాదు. మంగళవారం కూడా ఇదే తరహా బెదిరింపు మెయిల్ వచ్చింది. అది కూడా ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకే. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సహా ప్రముఖుల్ని చంపుతామని బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో ముందురోజు కూడా తనిఖీలు చేసి, గట్టి భద్రత ఏర్పాటు చేశారు. వరుస బెదిరింపుల నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. బెదిరింపు మెయిల్స్ వస్తున్నప్పటికీ సమావేశాలు మాత్రం నిరంతరాయంగా కొనసాగుతుండటం విశేషం.

## వందేమాతరం గీతాలాపన తప్పని సరికాదు: పిటిషన్ తిరస్కరించిన సుప్రీం


**న్యూఢిల్లీ, మార్చి 25:** ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం వందేమాతరం పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు అని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉందని ఆయన నివేదించారు. పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది.

## రష్యా నుంచి 60 మిలియన్ బ్యారళ్ల చమురు

**న్యూఢిల్లీ, మార్చి 25:** భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో డెలివరీ కానున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది.

## హోంల్యాండ్ సెక్యూరిటీ కొత్తకార్యదర్శిగా మార్క్‌వేన్ ముల్లిన్

**వాషింగ్టన్, మార్చి 25:** అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) కొత్త కార్యదర్శిగా సెనేటర్ మార్క్‌వేన్ ముల్లిన్‌తో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముల్లిన్‌ను గొప్ప అమెరికా దేశభక్తుడని అభివర్ణించిన ట్రంప్ అక్రమ వలసలు, సరిహద్దు భద్రతపై మరింత కఠినమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నియామకంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని ట్రంప్ అన్నారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ సరిహద్దు భద్రత, వలసదారుల నేరాలను అరికట్టడంలో ముల్లిన్



తన ప్రభుత్వానికి కీలక భాగస్వామిగా ఉన్నారని కొనియాడారు. ఒక్లహామా నుంచి 13 ఏళ్లుగా కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ముల్లిన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది.

## ద్రవ్యోల్బణంలో బంగ్లాదేశ్ 'రెడ్' కేటగిరీ

**ఢాకా, మార్చి 25:** పొరుగు దేశం బంగ్లాదేశ్‌ను తీవ్రమైన ఆహార ద్రవ్యోల్బణం పట్టి పీడిస్తోంది. మూడేళ్లుగా ఆ దేశం, ఆహార ద్రవ్యోల్బణ ప్రమాదం అధికంగా ఉన్న దేశాల రెడ్ కేటగిరీ నుంచి బయటపడలేకపోతోంది. ప్రభుత్వం మధ్యంతరంగా కొన్ని చర్యలు తీసుకోవడంతో మొత్తం ద్రవ్యోల్బణం కాస్త తగ్గినా, గత ఐదు నెలలుగా ఆహార వస్తువుల ధరలు మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోందని బంగ్లాదేశ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో కూడా బంగ్లాదేశ్ రెడ్ కేటగిరిలోనే ఉంది.

## చైనాతో అమెరికా పోటీ

**వాషింగ్టన్, మార్చి 25:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ రంగాల్లో చైనాతో వ్యూహాత్మక పోటీని ట్రంప్ యంత్రాంగం మరింత తీవ్రతరం చేసింది. ఇది కేవలం సాంకేతిక పోటీ మాత్రమే కాదని, ప్రపంచ శక్తిగా నిలదొక్కుకోవడం, ఆర్థిక భద్రతను కాపాడుకోవడం కోసం చేస్తున్న నైతిక పోరాటమని అమెరికాకు చెందిన ఉన్నత స్థాయి చట్టసభ సభ్యులు స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన హిల్ అండ్ వ్యాలీ ఫోరమ్ సమావేశంలో అమెరికా చట్టసభల ప్రతినిధులు ఈ వ్యాఖ్యలు చేశారు. సెనేటర్ జిమ్ బ్యాంక్స్ మాట్లాడుతూ ఏఐ రంగంలో పోటీని రెండో ప్రచ్ఛన్న యుద్ధంగా అభివర్ణించారు. మనం చైనాను గెలవనివ్వకూడదన్నారు. అమెరికా నాయకత్వాన్ని నిలబెట్టుకోవడం చాలా ముఖ్యమని హౌస్ సెలెక్ట్ కమిటీ చైర్మన్ జాన్ మూలెనార్, సెనేటర్ టాడ్ యంగ్ పేర్కొన్నారు.

## సిరిసిల్ల నేతన్నల కష్టాలపై విన్నపం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మలను కలిసిన కేటీఆర్

**హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టు ముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు బుధవారం అసెంబ్లీ లాబీల్లో వారి చాంబర్లలో కలిశారు.

సిరిసిల్ల పవర్‌లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిల భారంపై సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పి. వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల పరిశ్రమ నిలదొక్కుకుంది, అయితే ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న బ్యాక్ బిల్లింగ్ భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని వివరించారు. 2016 నుండి 2024 వరకు ఉన్న కాలానికి సంబంధించి సుమారు 127 ఎస్.ఎస్.ఐ యూనిట్లపై అధికారులు రూ.19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ భారం మోపారని తెలిపారు. అది సర్‌చార్జిలతో కలిపి ఇప్పుడు రూ.38 కోట్లకు చేరింది. ఈ భారీ బకాయిలను చెల్లించలేక అనేక యూనిట్లు మూతపడటంతో పాటు, ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరం. ఈ బిల్లుల భారాన్ని మానవీయ కోణంలో రద్దు చేసి తెలంగాణ నేతన్నలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఇళ్లు కట్టండి.. బిల్లు తీసుకోండి

**● పల్లారాజేశ్వర్‌రెడ్డిపై డిప్యూటీ సిఎం ఆగ్రహం ● పేదల సంక్షేమం పట్టని ప్రతిపక్షం అసెంబ్లీ నుంచి పారిపోయిందని విమర్శ**

**హైదరాబాద్, మార్చి 25:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎన్ని కోట్లయినా ఇస్తాం వారం వారం బిల్లుల చెల్లించడానికి సర్కార్ సిద్ధం రాష్ట్రంలోని పేదల సంక్షేమం గురించి అసెంబ్లీలో వినడానికి ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యులకు మనసు లేదని, అందుకే బడ్జెట్ సమాధానం వినకుండా సభ నుంచి పారిపోయారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై పల్లారాజేశ్వర్‌రెడ్డి సభను బయట ప్రజలను తికమకపెట్టి తప్పుదోపట్టించేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటిచెప్పారు. "గత పాలకులు మాయ మాటలు చెప్పి, ప్రజల్లో భ్రమలు కల్పించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామని ఓట్లు వేయించుకున్నారు. కానీ, పదేళ్ల అధికారంలో ఏ ఒక్క పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వకుండా వారిని గాలికి వదిలేశారు" అని భట్టి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉన్నత లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అదే స్ఫూర్తితో నేడు తమ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. బడ్జెట్ ప్రతులను చింపి, చెవిలో పెట్టుకుని వెళ్లిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బడ్జెట్ కేటాయింపుల గురించి మాట్లాడే అర్హత లేదని భట్టి విక్రమార్క మండిపడ్డారు. "పేదలు ఇల్లు కట్టుకుని ఆత్మగౌరవంతో బతకడం విపక్షాలకు ఇష్టం లేదు. బడ్జెట్‌లో నిధులు తగ్గించామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏకంగా 22,500 కోట్లు కేటాయించాం" అని స్పష్టం చేశారు. హౌసింగ్ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని భట్టి తెలిపారు. పనులు వేగవంతం చేసేందుకు గతంలో లాగా నెలల తరబడి వేచి చూడకుండా, వారానికోసారి బిల్లులు చెల్లించేలా నిక్కచ్చిగా ఆదేశాలు జారీ చేశామన్నారు. "ఇల్లు కట్టండి.. బిల్లు తీసుకోండి" అనే నినాదంతో లబ్ధిదారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని, ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల కోసం వెనకడుగు వేయలేదన్నారు.



**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకానికి**

నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణం ఇంకా వేగవంతం కావాలని డిప్యూటీ సిఎం ఆకాంక్షించారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు 5,000 కోట్లు దాటలేదని, ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నిర్మాణాలు ఎంత వేగంగా జరిగితే, అంత త్వరగా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదన్న ఆశయంతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎన్ని కోట్లైనా వెచ్చించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

## సోలార్ విద్యుత్‌తో వ్యవసాయ పంపుసెట్లు అనుసంధానం

### 81 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక: భట్టి విక్రమార్క

**హైదరాబాద్ మార్చి25 ప్రభాతవార్త:** సోలార్ విద్యుత్‌తో 16708 బావులు అనుసంధానం చేశా మని అదే విధంగా 81 గ్రామాలలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిఅక్కడ సోలార్ వినియోగం లోకి తెచ్చామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో యెన్నం శ్రీని వాసరెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, బాలునాయక్, జయవీర్ వేసి ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సమాధానం ఇచ్చారు. గ్రీన్ ఎనర్జిని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయా లన్న ఆలోచనలు ప్రభుత్వం ఉందనీ తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాల న్న ఆలోచనను పరిశీలన చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం గృహ ఉపయోగ, వ్యవసాయ రంగానికి సంబంధించి 81 గ్రామాల్లో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద సోలార్ విద్యుత్ ప్రక్రియను చేపడు తుందని తెలిపారు. పిఎం స్యూఘర్ రూఫ్‌టాప్ సోలార్ పథకం కింద 2కెవి సామర్థ్యం కలిగిన 40349 గృహాలను చేయడం జరిగిందని తెలిపా రు. రూఫ్ టాప్ సోలార్ క్యాక్రమం ఒక సిస్టమ్‌కు రూ.60 వేలు ఆర్థిక సహాయం కేంద్రం అందిస్తోం దని పియం కుసుమ్ కాంపోనెంట్ సి పథకం ఖర్చులలో 30 శాతం ఎంఎన్ఆర్ఇసిఎఫ్ఎ అందిస్తోందని ఎంపిక చేసి గ్రామాలలో రెండు పథకాలకు నిధులు మొత్తం రాష్ట్రం భరిస్తోందని వివరించారు.



## ఆయిల్‌పాంతో అత్యధిక లాభాలు

### వీణవంక, జమ్మికుంట వడగండ్ల నష్టం అంచనా దశలో ఉంది: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మార్చి 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంటల మార్పిడి చేసేందుకు రైతులను ఎమ్మెల్యేలు చైతన్య పరచాలని లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు 20లక్షల ఎకరాలలో సాగుచేయించే దిశగా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో బాలునాయక్‌చ సేనావత్, డా.కవ్వంపల్లి సత్యనారాయణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, జయవీర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ కోతులు,పందులు, నష్టపరచని పంటలవైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో 500 కోట్లతో ఐదు లక్షల మె.ట సామర్థ్యం కలిగిన గోదాములు వ్యూహాత్మకంగా అనువై ప్రాంతాల్లో నిర్మించామని తెలిపారు. స్ప్రింక్లర్,తుంపసేద్యం కోసం మౌళిక వసుతులు కల్పించడానికి కూడా శ్రద్ధ తీసుకొంటున్నామని చెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, వీణవంకలో వడగండ్ల వానకు నష్ఠపోయిన పంట విలువను క్షేత్రస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయం, ఉద్యానవనంశాఖల అధికారుల బృందం కలిసి మదింపుచేస్తున్నారని నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. జహీరాబాద్‌లో మాణిక్‌రావు కోల్డ్‌సోరేజి కావాలని అడిగారని వాటిని మంజూరు చేస్తామని తెలిపారు.

## 26 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో ప్రపంచ శాంతి - అంతర్జాతీయ బౌద్ధ మహాసభలు

**హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** ప్రపంచానికి శాంతి సందేశాన్ని చాటిన గౌతమ బుద్ధుని ఆలోచనలను విస్తరింపజేసే దిశగా హైదరాబాద్, నాగార్జున సాగర్ బుద్ధవనం అంతర్జాతీయ వేదికగా నిలవనున్నాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అనుబంధ విభాగం బుద్ధవనం ఆధ్వర్యంలో, వియత్నాం బౌద్ధ సంఘం సంయుక్తంగా మార్చి 26 నుంచి 29 వరకు ప్రపంచ శాంతి–అంతర్జాతీయ బౌద్ధ మహాసభలు–2026ను హైదరాబాద్, నాగార్జునసాగర్ వేదికలుగా నిర్వహించనున్నారు. 22 దేశాల నుంచి ప్రతినిధులుఈ మహాసభలకు అర్జెంటీనా, బెల్జియం, కంబోడియా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, మలేషియా, మయన్మార్, దక్షిణ కొరియా, స్పెయిన్, శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం తదితర దేశాల నుంచి సుమారు 150 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. బౌద్ధ ధర్మం, ప్రపంచ శాంతి అంశాలపై తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. శుక్రవారం (మార్చి 27) ఉదయం 10 గంటలకు బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో మహాసభలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శ్రీలంక బౌద్ధ శాసన, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ప్రొఫెసర్ హినిదుమ సునీల్ సేనవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారు. అతిథులుగా వియత్నాం బౌద్ధ సంఘం ఉపాధ్యక్షులు మోస్ట్ వెన్. డా.థిచ్‌నాట్ తు, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, బుద్ధవనం మెంటార్ సి. ఆంజనేయ రెడ్డి తదితరులు పాల్గొననున్నారు. బుద్ధవనంకు అంతర్జాతీయ గుర్తింపు లక్ష్యం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ థీమ్ పార్క్‌గా ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ మహాసభల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. వివిధ దేశాల బౌద్ధ సంఘాలు ఇక్కడ మఠాలు, విద్యాసంస్థలు స్థాపించేలా ప్రోత్సహించడం ద్వారా పర్యాటక రాకలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఫీజుల బకాయిలు, హాస్టళ్ల బిల్లులు వెంటనే విడుదల చేయండి

### డిప్యూటి సిఎం భట్టితో ఎంపి ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్,మార్చి 25,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీ కాలేజీ హాస్టళ్లు, ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించిన మెస్ బిల్లులు, అద్దె భవనాల బిల్లులు, కరెంట్ బిల్లులు సహా ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపి ఆర్.కృష్ణయ్య డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కను కోరారు. ఈమేరకు బుధవారం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంతో కలిసి డిప్యూటీసిఎంను కలిశారు. ఈసందర్భంగా బీసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలోని బీసీ కాలేజీ హాస్టళ్లు, ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించిన మెస్ బిల్లులు గత ఆరు నెలలుగా చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూరగాయలు, మాంసం, గుడ్లు, పప్పులు, నూనెలు వంటి నిత్యావసర వస్తువుల సరఫరాదారులకు గత ఐదు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నారని దీంతో కొన్ని హాస్టళ్లలో కార్యకలాపాలు నిలిచిపోవచ్చనే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా బీసీ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, అయితే దాదాపు ఎనిమిది నెలలుగా అద్దె బిల్లులు చెల్లించకపోవడంతో భవన యజమానులు హాస్టళ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. అలాగే గత సంవత్సరం నుంచి హాస్టళ్లకు సంబంధించిన కరెంట్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.



### ఎయిడ్స్‌ను పూర్తిగా నియంత్రించడమే లక్ష్యంగా

## మిషన్ ఎయిడ్స్ సురక్ష కింద తెలంగాణపై న్యాకో ప్రత్యేక దృష్టి

### కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేష్ గుప్తా

### హైదరాబాద్‌లో న్యాకో సురక్ష సంకల్ప్ వర్క్‌షాప్

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా స్థాయిలో మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని న్యాకో డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేష్ గుప్తా పిలుపునిచ్చారు. జిల్లా స్థాయిలో ప్రణాళిక, పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. తెలంగాణలోని వయోజనుల్లో హెచ్ఐవీ ప్రాబల్యం 0.41 ఉందని, రాష్ట్రంలో సుమారు 1,56,961 మంది హెచ్ఐవీతో జీవిస్తున్న నేపథ్యంలో జాతీయ హెచ్ఐవీ నివారణ కార్యక్రమం అమలు రాష్ట్రంలో కీలకమన్నారు. రాష్ట్రంలో విస్తృతంగా మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమ అమలు, పర్యవేక్షణ కోసం 19 జిల్లాలను ప్రాధాన్యత కలిగిన జిల్లాలుగా గుర్తించామని చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(న్యాకో) బుధవారం హైదరాబాద్‌లో సురక్ష సంకల్ప్ కార్యశాలను నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ గుప్తా మాట్లాడుతూ.. భారతదేశ హెచ్ఐవీ నివారణ చర్యలకు ప్రాధాన్య జిల్లాలు కేంద్రబిందువుగా ఉన్నాయన్నారు. హెచ్ఐవీ నివారణ దిశగా ఫలితాలను మెరుగుపరచడానికి, జాతీయ లక్ష్యాల దిశగా పురోగతిని వేగవంతం చేయడానికి క్షేత్రస్థాయిలో కేంద్రీకృత, డేటా ఆధారిత కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్య జిల్లాలుగా గుర్తించిన హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, సిద్దిపేట, మెదక్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, సూర్యాపేట, పెద్దపల్లి, జనగాం, వికారాబాద్, కామారెడ్డి, హన్మకొండ, సంగారెడ్డి, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ కార్యశాల సందర్భంగా జిల్లా బృందాలు మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమ పురోగతిపై నివేదికను సమర్పించాయి. కార్యాచరణ, క్షేత్రస్థాయి సవాళ్లను చర్చించాయి. జిల్లావారీగా డేటా ఆధారిత కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడానికి నిర్మాణాత్మక చర్చలు జరిపాయి. హెచ్ఐవీ నివారణ వ్యూహాలను బలోపేతం చేయడం, నిర్ధారణ పరీక్ష సేవలను విస్తరించడం, యాంటీరెట్రోవైరల్ థెరపీ(ఏఆర్టీ) అనుసంధానం, చికిత్స కొనసాగింపును మెరుగుపరచడం, వైరల్ లోడ్ అణచివేతను పెంచడం, ముప్పు అధికంగా ఉన్న జనాభాలో లక్షిత కార్యక్రమాలను పెంచడం వంటి ప్రధాన అంశంగా చర్చలు జరిగాయి. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను ఒకచోటకు ఈ వర్క్‌షాప్ చేర్చింది. తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ(టీఎస్ఏసీఎస్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సంగీతసత్యనారాయణ, రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్ ప్రోగ్రామ్ అధికారులు, అదనపు జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యారోగ్య అధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఇప్పపువ్వు ఉత్పత్తులతో

# ఆదివాసీ జీవితాల్లో వెలుగులు

**● ఇప్పపువ్వు మద్యంతో 100 యేళ్ల ఆయుష్షు ● ఒడిశా, మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ ప్రోత్సాహంతో తయారి ● తెలంగాణలో ఇప్పపువ్వు లిక్కర్ ఉత్పత్తికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి ● శాసనసభలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 25 ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో విరివిగా లభించే ఇప్ప చెట్టుకు 5 వేల ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని, దాని ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్ప పువ్వు వినియోగం, దాని ద్వారా గిరిజనులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలపై బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో విక్రయిస్తున్న చీప్ లిక్కర్ వల్ల ప్రజల ఆరోగ్యం పాడవుతోందని, 60 ఏళ్లు కూడా బతకలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని తాండాల ప్రజలు గతంలో ఇప్ప పూల సారా తాగి 100 ఏళ్ల వరకు ఆరోగ్యంగా జీవించారని గుర్తుచేశారు. ఇప్ప పువ్వును టీలో కలిపి తీసుకోవడం వల్ల దయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని ఆయన వెల్లడించారు. ఇప్ప పువ్వుతో కేవలం సారా మాత్రమే కాకుండా ఐస్‌క్రీమ్, కేక్, లడ్డూలు, బిస్కెట్లు వంటి రకరకాల ఆహార పదార్థాలను తయారు చేయవచ్చన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 1.6 లక్షల మంది ఇప్ప పూల సేకరణ ద్వారా ఉపాధి పొందుతున్నారని, మధ్యప్రదేశ్‌లో మాండ్ అనే మద్యాన్ని బాటిల్ రూ. 800 చొప్పున విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారని వివరించారు. అక్కడ ప్రభుత్వమే శిక్షణతోపాటు యంత్రాలను కూడా అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో బ్రిటిష్ పాలనలో ఇప్పపువ్వ సారా వినియోగం విరివిగా ఉండేదని, అయితే తాము తయారు చేసిన విస్కి అమ్మకాలు పడిపోతాయన్న భయంతో బ్రిటిష్ ప్రభుత్వం 1892లో ఇప్పపువ్వ సారాని నిషేదించిందన్నారు. ఒడిశా, చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇప్పపువ్వ సారా వినియోగం ఉందన్నారు. భారత్ నుంచి ఇప్పపువ్వును దిగుమతి చేసుకుంటున్న ఫ్రాన్స్, ఇంగ్లండ్ అక్కడ మద్యం ఉత్పత్తులను తయారుచేసి విక్రయిస్తున్నాయని గుర్తు చేశారు. మెక్సికొ తదితర దేశాల్లో అక్కడి వృక్షాల ఉత్పత్తులతో ప్రత్యేక మద్యాన్ని తయారు చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని ఆదివాసీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇప్ప పువ్వు సారా తయారీకి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుందని, ఆదివాసీలకు మెరుగైన ఉపాధి లభిస్తుందన్నారు. బ్రిటిష్ కాలంలో విధించిన పాత నిబంధనలను పక్కన పెట్టి, ఆధునిక పద్ధతుల్లో ఇప్ప ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.







## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తా

### తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

**ధర్నాచౌక్, మార్చి 25 ప్రభాతవార్త:** దివ్యాంగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేందుకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో కాంగ్రెస్ ఎలక్షన్ మానిఫెస్టో అమలు సాధన సమితి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మానిఫెస్టో అమలుతో పాటు దివ్యాంగుల సమస్యల పరిష్కారానికై నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమంకు ముఖ్యఅతిధిగా హాజరై కోదండరాం మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని, దివ్యాంగులు ఎవరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తెలంగాణ జనసమితి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంఘాల నాయకులు భారతి వరప్రసాద్, ఎండి మున్నా, నాగభూషణం, కొల్లి నాగేశ్వరరావు, వంశీరాజ్ రామచంద్రలు మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్లు 6 వేలకు, సామాజిక పెన్షన్లు 4వేలకు, తీవ్ర వైకల్యం ఉన్న వారికి 15 వేలకు పెంచాలని, పెంచిన పెన్షన్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని శాఖలలో దివ్యాంగుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, దివ్యాంగులకు అన్ని ఆర్టీసీ బస్సులలో, రైళ్లలో ఉచిత రవాణా కల్పించాలని, వార్డు మెంబర్ నుంచి చట్టసభల వరకు దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల భవనం రాష్ట్ర స్థాయిలో నగర నడిబొడ్డున అన్ని వసతులతో నిర్మాణం చేయాలని, దివ్యాంగులకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, దివ్యాంగులైన కళాకారులకు, క్రీడాకారులకు, జాతీయ స్థాయిలో రాణించిన వారికి 25 లక్షల నగదు పారితోషికం, ప్రభుత్వ స్థలం, ప్రభుత్వ ఉద్యోగం అందించాలని డిమాండ్ చేశారు.



### నూతన అడ్వర్టైజ్‌మెంట్ పాలసీని

# ప్రభుత్వం విరమించుకోవాలి

**అసెంబ్లీ ముట్టడికి ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ యత్నం**

**అడ్డుకున్న పోలీసులు..అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలింపు**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ బుధవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించింది. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 84 కొత్త ఔట్‌డోర్ ప్రకటన విధానానికి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఈనిరసనలో వందలాది ఔట్‌డోర్ మీడియా యజమానులు, కార్మికులు, పరిశ్రమకు చెందిన ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఔట్‌డోర్ ప్రకటన రంగం మనుగడను ప్రమాదంలోకి నెట్టే పరిశ్రమ వ్యతిరేక" విధానాన్ని ప్రభుత్వం విరమించుకుని దాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర చర్చలు జరపాలని మార్గదర్శ కాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత విధానంలో వేలాది వ్యాపారాలకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తెచ్చే అవకాశం ఉందని, ఔట్‌డోర్ ప్రకటన రంగంపై ఆధారపడి జీవిస్తున్న దాదాపు లక్ష కుటుంబాల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జి.ఓ. నెం. 84 అమలు విషయంలో ప్రభుత్వ ఏక పక్ష నిర్ణయం మొత్తం ఔట్‌డోర్ మీడియా పరిశ్రమను ప్రమాదంలోకి నెట్టిందన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కావున సిఎం రేవంత్ రెడ్డి తక్షణం జోక్యం చేసుకుని, జి.ఓ. నెం. 84 అమలును నిలిపివేసి, పరిశ్రమల ప్రతినిధులతో చర్చలు జరిపి సమతుల్యమైన, స్థిరమైన విధానాన్ని రూపొందించాలని కోరారు.

## లోక్ భవన్ అధ్వర్యంలో నేడు చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు

**హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త ప్రధానప్రతినిధి:** శ్రీరామ నవమి పురస్కరించుకుని గురువారం లోక్‌భవన్ చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు నిర్వహించనుంది. సాయంత్రం 5.00 గంటల నుండి 6.30 గంటల వరకు ఈ కార్యక్రమం సంస్కృతి లోక్ భవన్ కమ్యూనిటి హాల్ లో జరుగనుంది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల్లో ఆహ్వానిత అతిథులు పాల్గొననున్నారు.

### మాంసాహారులకు బిగ్ షాక్

## ఏప్రిల్ 1 నుంచి చికెన్‌షాపులు బంద్

### పిలుపు నిచ్చిన తెలంగాణ చికెన్‌షాప్‌ల యాజమానుల అసోసియేషన్

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మాంసం ప్రియులకు తెలంగాణ చికెన్ షాపు యజమానుల అసోసియేషన్ బిగ్ షాక్ ఇచ్చింది. పౌల్ట్రీ కంపెనీలు కమీషన్, మార్జిన్‌ను భారీగా తగ్గించడాన్ని నిరసిస్తూ ఏప్రిల్ 1నుండి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపుల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నిర్ణయానికి సంబంధించి ఇప్పటికే హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పోస్టర్లు వెలిశాయి. పౌల్ట్రీ కంపెనీల ఏకపక్ష నిర్ణయాల వల్ల చిరు వ్యాపారులమంతా తీవ్రంగా నష్టపోతున్నామని, మార్జిన్ పెంచే వరకు తమ పోరాటం ఆపేది లేదని అసోసియేషన్ స్పష్టం చేసింది. ప్రస్తుతం చికెన్ ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, విక్రయదారులకు వచ్చే లాభం మాత్రం గణనీయంగా తగ్గిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలం, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని, అయితే ఆ భారం అంతా తమపైనే పడుతోందని చికెన్ షాప్ యజమానులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు వెంటనే స్పందించి మార్జిన్ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరసనను నిరవధికంగా కొనసాగిస్తామని అసోసియేషన్ హెచ్చరించింది.


# రాష్ట్ర వ్యాప్తంగా 1,06,598 ఫైళ్లు క్లియర్

**శానిటేషన్ డ్రైవ్‌లో 455.14 టన్నుల ఘన వ్యర్థాల తొలగింపు ● రాష్ట్రంలో 1,85,648 ఆఫీసు గదులు, భవనాలు శుభ్రం ● 20 రోజులుగా రాష్ట్రమంతటా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక**

**హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** ఇరవై రోజులుగా రాష్ట్రమంతటా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ విజయవంతంగా సాగుతోంది. తొలి పది రోజుల్లోనే (మార్చి 6 నుంచి మార్చి 15 వరకు) రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాల్లో దాదాపు 1,06,598 ఫైళ్లను క్లియర్ చేశారు. శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా 455.14 టన్నుల ఘన వ్యర్థాలను తొలగించారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రామ స్థాయిలో కొత్తగా ఎన్నికైన వార్డు మెంబర్లు, సర్పంచుల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రుల వరకు రోజుకు సగటున 1,70,000 మంది ఈ డ్రైవ్ లో పాల్గొన్నారు. మొత్తం పది రోజుల్లో 21,02,960 మంది భాగస్వాములయ్యారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో సెక్రెటేరియట్ వరకు పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ డ్రైవ్‌ను అన్ని స్థాయిల్లో అధికారులు ప్రాధాన్యతగా నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు గ్రామపంచాయతీ భవనాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు 1,85,648 ఆఫీసు గదులు, భవనాలను శుభ్రం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సిఎం రేవంత్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్లో అభివృద్ధి పనులతో ఘనంగా ప్రారంభించారు. తొలి రోజునే కొత్వాలగూడలో ఎకో హిల్ పార్క్ ప్రారంభంతో పాటు బుద్వేల్ లే అవుట్‌తో కలిపే రేడియల్ రోడ్-2 ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 19 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు రైతు ఉత్సవాలు నిర్వహించారు. 22 వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా నిధులు జమ చేశారు. ప్రతి ఎకరానికి రూ.6 వేల పెట్టుబడి సాయం విడుదల చేశారు. ఒకేరోజున రూ.3,500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ వివిధ స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేసింది. మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహించారు. అందులో భాగంగా, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. అదే రోజున రూ.300 కోట్లతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించారు. సిద్దిపేట మున్సిపాలిటీలో నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఎన్సాన్‌పల్లిలో జిల్లా జైలు భవనం, 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రి, ఎన్సాన్‌పల్లిలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ప్రారంభించారు. నంగునూరు మండలం గట్లమల్యాలలో పీహెచ్‌సీ భవనం ప్రారంభించారు. సిద్దిపేట మున్సిపాలిటీలోని అంబేద్కర్ నగర్‌లో యూపీహెచ్‌సీ భవనం ప్రారంభించారు. రూ.200 కోట్లతో గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. మర్కూక్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ అదనపు మౌలిక సదుపాయాలకు శంకుస్థాపన చేశారు. మర్కూక్, జగదేవ్‌పూర్‌లో సమీకృత మండల కార్యాలయాల సముదాయాలను ప్రారంభించారు. పరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం, ప్రభుత్వ పథకాలు, వివిధ కార్యక్రమాలు, లబ్ధిదారులతో అధికారులు నేరుగా మమేకమయ్యేందుకు వీలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమం రూపకల్పన చేశారు. మొదటగా మార్చి 6 నుండి మార్చి 15 వరకు చేపట్టిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ఈ డ్రైవ్‌లో భాగంగా పలు జిల్లాల్లో స్వయం సహాయక బృందాల విస్తృత భాగస్వామ్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లను (ఓహెచ్ఎస్ఆర్‌లను) శుభ్రపరిచి, తాగునీటి భద్రతపై కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాధుల వ్యాప్తి నియంత్రణ, పశు జనన నియంత్రణ, ఈవ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించి ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సామాజిక భాగస్వామ్యం, పారిశుధ్య కార్మికుల సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు హ్యాపీ సండే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,760 గ్రామ పంచాయతీలు, 135 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీలు), ఎన్జీవోలు, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు ఇందులో ఉత్సాహవంతంగా పాల్గొన్నారు. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిష్కరించడం, సంక్షేమ పథకాల అమలు వేగవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నాటికి అన్ని జిల్లాల్లో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయాలని, ఇప్పటికే పూర్తయినవి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో క్యాబినెట్ సబ్‌కమిటీ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుంది. 99 రోజుల కార్యాచరణ పర్యవేక్షణకు సీఎస్ రామకృష్ణారావు ప్రత్యేక డ్యాష్ బోర్డు రూపొందించారు. మంత్రులందరూ తమ జిల్లాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. కరీంనగర్ జిల్లాలో మంత్రి పొన్నం ప్రభాకర్ మెగా క్లీన్‌లినెస్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మంచిర్యాల జిల్లా ఇందారంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ములుగులో మంత్రి సీతక్క కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని వారికి సలహాలు, సూచనలు అందజేశారు. మంత్రి కోమటిరెడ్డి శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాల్లో పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ లాంటి నాయకుడు లేకపోవడం వల్లే యుద్ధాలు

**కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్**



**హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధికారంలో లేకపోవడం, రాజీవ్ గాంధీ వంటి సమర్థులు లేకపోవడం వల్లే యుద్ధం వచ్చిందని మాజీ కేంద్ర మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ "యుద్ధం విషయం గుర్తొస్తే చనిపోయిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ గుర్తొస్తారు. ఫిబ్రవరి, 1991 ఇరాన్, కువైట్ మధ్య అమెరికా ప్రోత్సాహంతో యుద్ధం జరిగింది. అప్పుడు రాజీవ్ గాంధీ ప్రతిపక్షనేతగా ఉన్నారు. ఆయన ఢిల్లీ నుంచి మాస్కోకు వెళ్లి, గార్బచేవ్‌తో యుద్ధ విరమణ విషయమై మాట్లాడారు. అక్కడి నుంచి టెహ్రాన్‌కు వెళ్లి, ప్రపంచ అందరి నేతలతోమాట్లాడి, తర్వాత ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌తో కూడా మాట్లాడి యుద్ధ విరమణ చేయించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ . .ఆతర్వాత దుబాయ్ మీదుగా, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చినప్పుడు. మేమందరం సాదరంగా గౌరవించడం జరిగింది. ప్రధాని మోడీ లాగా, రాజీవ్ గాంధీ ఢిల్లీలో కూర్చోలేదు. ధైర్యంగా ముందడుగు వేశారు. యుద్ధాన్ని ఆపారు. మోడీ బలహీనమై విదేశాంగ విధానాన్ని చూసి ప్రపంచం అంతా నవ్వు కుంటున్నారు. అమెరికాకు తొత్తుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ మారలేదు. ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన విషయాన్ని నేను సమర్థిస్తున్నాను. ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు పెంచడంలో ఎలాంటి లాజిక్ లేదు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇప్పుడు ఆ అంశాన్ని తెరపైకి తెచ్చారు. గ్యాస్ దొరకడం లేదు. రేట్లు పెరిగాయి. పెట్రోల్ బంకులు దగ్గర హైదరాబాద్ లో ఆటోలు భారీ క్యూలు కనిపిస్తోంది. ఒక్క ఉత్తరప్రదేశ్ లోనే 160 ఎంపీ స్థానాలు, దక్షిణ భారతదేశం అంతా కలిపి 200 సీట్లు లేకపోవడం చాలా దారుణం. బీహార్, ఉత్తరప్రదేశ్ రెండు రాష్ట్రాలు ఒక్కరి చేతిలోకి పోతే, దేశం ఏమైపోతదో? భవిష్యత్తులో దేశంలో రెండు ముక్కలైనా నాకైతే ఆశ్చర్యం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలే కేంద్రానికి 70 పన్నులు కడుతోంది. అనాలోచిత ప్రతిపాదిత నియోజకవర్గ సీట్లు పెంపు ఆలోచన వెనక్కి తీసుకోవాలి"అని చింతా మోహన్ పేర్కొన్నారు.

## పెట్రోల్ బంకుల ముందు బారులు

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానందగౌడ్**

నగరంలోని అన్ని పెట్రోల్ బంకుల ముందు ప్రజలు బారులు తీరి ఉన్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానందగౌడ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ డీజిల్, పెట్రోల్, గ్యాస్ అవసరాలకు అనుగుణంగా అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిపాలన వదిలేసి ముఖ్యమంత్రి గాలికి తిరుగుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నింద వేసుకోకుండా ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలి. ప్రజలకు సరైన రీతిలో భరోసా ఇవ్వడం లేదు. అ కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం లేకనే ఈ సమస్య. యుద్ధం ఉన్న దేశాల్లో కొరత లేదు. యుద్ధం లేని మన దేశంలో మాత్రం ఈ కొరత. సరైన నిలువలను ఉంచుకోవాల్సిన అవసరం ఉంది.

## దేశంలోని పరిస్థితులు.. కరోనాతో పోలిక

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

ప్రధాని ఈ పరిస్థితిలలో ప్రజలకు ధైర్యం ఇవ్వకుండా దేశంలో పరిస్థితులను కరోనాతో పోలుస్తున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ "సిఎం ఢిల్లీకి వెళ్లి గ్యాస్, పెట్రోల్, డీజిల్ తెస్తారని ఆశిస్తే ఒట్టి చేతులతో తిరిగి వచ్చారు. ఎంత పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిలువలు ఉన్నాయో చెప్పే ధైర్యం మోదీకి, ఇక్కడ సిఎంకి లేదు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ధైర్యం చెప్పాలి అని పేర్కొన్నారు.

## ఎన్టీపీసీలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం

**56 మెగావాట్ల యూనిట్ త్వరలో ప్రారంభం**

**అతి పెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుగా గుర్తింపు**

**ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ చందన్**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రామగుండం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)లో మరో కొత్త ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తికి సిద్ధ మవుతోంది. ఈ మేరకు దీనికి సంబంధించిన వివరాలను ఆ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా థర్మల్ పవర్ ప్రాజెక్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పక్కన ఉన్న స్థలంలో 176 మెగావాట్ల సామర్థ్యం గల కంబైన్డ్ (ఫ్లోటింగ్, సర్ఫేస్) సోలార్‌ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని వివరించారు. రిజర్వాయర్ నీటిలో 56 మెగావాట్లు ఫ్లోటింగ్ సోలార్, పక్కనే స్థలంలో 120 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నెలకొల్పామన్నారు. ఇప్పటికే రిజర్వాయర్‌లో 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు పని చేస్తోందని చెప్పారు. అలాగే 56 మెగావాట్ల విస్తరణ యూనిట్ ప్రారంభమైతే 156 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో దక్షిణాదిలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుగా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. పవర్ గ్రిడ్ నుంచి క్లియరెన్సు వచ్చిన వెంటనే కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్ (సిఒడి) ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పవర్ పర్చేజ్ ఎగ్రిమెంట్ పీపీఏ) కుదిరిన వెంటనే తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. రెండో దశ నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతితోపాటు ఇతర క్లియరెన్సులు లభించాయని ఈడీ తెలిపారు. దీంతో 2400 మెగావాట్ల సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఫేజ్ 2 పీపీఏకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగతున్నాయని తెలిపారు. ఒప్పందం విషయం కొలిక్కి వస్తే ప్రాజెక్టు నిర్మాణం పనుల విషయంలో ముందడుగు పడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం 800 మెగావాట్లకు సంబంధించి మాత్రమే పీపీఏ చేసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేసిందన్నారు. మిగతా 2400 మెగావాట్లను కేటాయించాలని ఇతర రాష్ట్రాలు కోరుతున్నాయని ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ చందన్ తెలిపారు.

## రాష్ట్రంలో అరుదైన ఖనిజ సంపద

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అరుదైన ఖనిజ సంపద ఉన్నట్లు గనుల శాఖ గుర్తించింది. ప్రధానంగా సిరిసిల్ల, సిద్ధిపేట్ తదితర జిల్లాలో కొత్తగా వేస్తున కొత్తపల్లి, మనోహరరాబాద్ రైలు మార్గం తవ్వకాల్లో అరుదైన ఖనిజ సంపద బయపడడ్డాయి. సిరిసిల్ల, సిద్దిపేట్ జిల్లాలో ఖనిజ సంపద ఉన్నట్లు వెలుగు చూసింది. ఒక్క సిరిసిల జిల్లాలో ఈ ఖనిజ సంపద 562.50 చదరపు కిలోమీటర్లలోను, సిద్దిపేట్ జిల్లాలో మరికొంత భాగం ఉన్నట్లు గనుల శాఖ అధికారులు నివేదిక రూపొందించారు. అందులో 15 రకాల లాంఢజనైడ్స్ ఉండా, స్కాండియం, వైట్రియం ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. కిలో 312 వేల రూపాయలకు పైబా విలువ చేసే వైట్రియం ఈ ఖనిజాల్లో ప్రధానమైది కావడంతో మరింత లోతైన పరిశోధనలు చేసేందుకు గనుల శాఖ అధికారులు నిర్ణయించారు. సిద్దిపేట్ జిల్లా వితలాపురం, సిరిసిల్లా జిల్లా తంగళ్లపల్లి మండలంలోని పెద్దలింగాపూర్, బస్వాపూర్, లక్ష్మీపూర్ గట్టల్లోనూ పరిశోధనలు చేస్తే మరింత అరుదైన ఖనిజ సంపద బయటపడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేపట్టేందుకు కేంద్రం అనుమతి కోరింది.

## సింగరేణి కార్మికుల పట్ల మానవత్వం చూపండి

**సంస్థ యాజమాన్యానికి హైకోర్టు సూచన**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** సింగరేణి కార్మికుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని హైకోర్టు సూచించింది. ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న బొగ్గగని కార్మికుల విషయంలో ఔదార్యం చూపాలని సింగరేణి యాజమాన్యానికి ధర్మాసనం విజ్ఞప్తి చేసింది. భౌతిక వైకల్యం ఉన్న వారితో పోలిస్తే సాధారణ శారీరక బలహీనత ఉన్నవారి పట్ల వివక్ష చూపిస్తున్నారని పేర్కొంటూ హైకోర్టులో దాదాపు 80 పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం కేవలం భౌతికంగా శారీరక వైకల్యం ఉన్న వారికే కాకుండా సాధారణ శారీరక బలహీనత అంటే గుండె జబ్బులు, దీర్ఘకాలిక రోగాలు ఉన్న కార్మికులకు సైతం ఒకేలా ప్రయోజనాలు కల్పించాలని పేర్కొంది. కార్మికుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా అందరికీ ఒకేలా ప్రయోజనాలు కల్పించాలని పేర్కొంటూ తుది తీర్పు ప్రకటించింది.

## దమ్ముంటే సిద్ధిపేటలో నాపై రేవంత్‌రెడ్డి పోటీ చేయాలి

**అసెంబ్లీ సమావేశాలను మరో వారం పొడిగించాలి: హరీశ్‌రావు**

**హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** తల్లకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని, రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అసెంబ్లీలో బిఆర్ఎస్ పక్ష ఉపనేత టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలంటూ రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. బుధవారం అసెంబ్లీ లాబీలో హరీష్ రావు చిట్‌చాట్‌లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల బీఆర్ఎస్‌కు మేలు జరుగుతుందని, మహిళా రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ నష్టం జరుగుతుందని కూడా ఆయన పేర్కొన్నారు. ఇక ఉద్యోగాల అంశంపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని వ్యాఖ్యనించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, మొత్తం 16 నోటిఫికేషన్లు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. సంక్షేమ బోర్డుల పరిస్థితిపై కూడా హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 33 సంక్షేమ బోర్డులు ఉన్నప్పటికీ, వాటిలో 16కి మాత్రమే కార్యాలయాలు ఉన్నాయని, మిగిలిన 17 బోర్డులకు కార్యాలయాలు కూడా లేవని తెలిపారు. కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో 99 శాతం లాప్స్ అవుతున్నాయని, కేవలం 2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ నిర్వహణపై కూడా ఆయన విమర్శలు చేశారు. సభను సమయానికి ప్రారంభించడం లేదని, టీ బ్రేక్ పేరుతో గంటల తరబడి వాయిదాలు వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రావడం, మంత్రుల సిద్ధత వంటి కారణాలతో సభను తరచుగా వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష గొంతును నొక్కుతున్నారని ఆరోపించిన హరీష్, అసెంబ్లీని మరో వారం రోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

## జాతీయ గీతాన్ని అవమానించిన ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**గవర్నర్‌కు వినతి పత్రం అందించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, మార్చి 25 ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభలో జాతీయగీతం వందేమాతరం ఆలాపన జరుగుతుండగా వాకౌట్ చేసిన ఎంఐఎం ఎమ్మెల్యేల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం రాంచందర్‌రావు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసారు. అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిగా నిలిచిన వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్నప్పుడు ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడం అంటే దేశాన్ని, జాతీయ గీతాన్ని, రాజ్యాంగాన్ని అవమానించడమే అని అన్నారు. మజ్లిస్ నాయకులకు భారత్ మాతా కీ జై అనడం రాదు, జై హింద్ అనడం రాదు అన్నారు. కానీ జై పాలస్తీనా అంటారని ఎద్దేవా చేశారు. వందేమాతర గీతం ఆలపించే సమయంలో వాకౌట్ చేయడం అంటే కేవలం సభా నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు, జాతీయ గీతానికి, దేశానికి జరిగిన తీరని అవమానంగా భావించాలని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి, జాతీయ చిహ్నాల పట్ల కనీస గౌరవం లేని ఎంఐఎం సభ్యుల తీరును తప్పుబట్టారు. ఇది వారి సంకుచిత మనస్తత్వాన్ని బయటపెట్టిందని విమర్శించారు. సభ గౌరవాన్ని, జాతీయ గీత ప్రతిష్టను దిగజార్చిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ గౌరవం కంటే ఏ రాజకీయ పార్టీ లేదా మతం ముఖ్యం కాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే ఏకైక మార్గమని రాంచందర్ రావు అన్నారు గవర్నర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతం రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కాసం వెంకటేశ్వర్లు, జయశ్రీ, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, పలువురు రాష్ట్ర అధికార ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు.

## ఓటిఆర్ గడువు మరోసారి పొడిగింపు

**హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త ప్రధానప్రతినిధి:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(ఓటిఆర్) అప్‌డేట్, ఎడిట్ ఆప్షన్ గడువును టిజిపిఎస్‌సి ఎప్రిల్ 10 వరకు పొడిగించింది. ఇప్పటికే ఒకసారి పెంచగా బుధవారం ఆ డెడ్‌లైన్ ముగియాల్సి ఉంది. ఈ క్రమంలో మరోసారి పెంచింది. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు ఫామ్‌లో నింపే సమాచారానికి ఓటిఆర్ డేటానే ప్రాథమిక ఆధారం అవుతుంది.

## రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత లేదు అందుబాటులో సరిపడ నిల్వలు

**రాష్ట్ర పౌరసరఫరాలకమిషనర్ స్టిఫెన్ రవీంద్ర**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ప్రజలు ఎటువంటి వదంతులు నమ్మవద్దని సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. వాహనదారులు అనవసరంగా ఆందోళన చెంది భారీగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ బంకులకు 1500 పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం 20 వేల కిలో లీటర్ల పెట్రోల్ అందుబాటులో ఉందని, రోజువారీ అవసరాలకు సరిపడా నిల్వాలు ఆయిల్ కంపెనీల వద్ద ఉన్నాయని భరోసా ఇచ్చారు. పానిక్ (ఆందోళనకు గురై) చేస్తున్న కొనుగోళ్ల కారణంగా బంకుల వద్ద రద్దీ పెరుగుతోందని, స్టాక్ విషయంలో ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన పేర్కొన్నారు.

## అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ జట్టు ఓటమి

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలో ప్రారంభమైన అఖిల భారత 74వ బిఎన్ మల్లిక్ పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ జట్టు మొదటి పోటీలో ఛండీఘడ్ జట్టు చేతిలో ఓడి పోయింది. బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో ఛండీఘడ్ జట్టు ఒకటి సున్నా తేడాతో తెలంగాణ పోలీసు జట్టును ఓడించింది. చివరి నిమిషంలో వచ్చిన పెనాల్టీతో ఛండీఘడ్ జట్టు విజయం అందుకుంది.



**ఖైరతాబాదు:** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యకులు రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బారి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎల్పిజి సిలిండర్ ధరల పెరుగుదలపై కేంద్ర భ్రుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ప్లకార్డులతో లోక్ భవన్ ఎదురుగా నిరసన పాటించారు.

## 23 మందితో అన్నాడిఎంకె తొలిజాబితా



**చెన్నై, మార్చి 25:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 23 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను అన్నాడీఎంకే బుధవారంనాడు విడుదల చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి కె.పళనిస్వామి మరోసారి తన సొంత నియోజకవర్గమైన సేలం జిల్లాలోని ఎడప్పాడి నుంచి పోటీలో ఉన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రధాన విపక్షంగా ఉండటంతో పాటు ఎన్డీయే కూటమికి సారథ్యం వహిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిగా అభ్యర్థులను ప్రకటించిన ప్రధాన పార్టీ కూడా అన్నాడీఎంకేనే కావడం విశేషం. పార్టీ అభ్యర్థులుగా అన్నాడీఎంకే ప్రకటించిన ప్రముఖుల్లో వెప్పనహళ్లి నుంచి కెపీ మునుస్వామి, దిండిగల్ నుంచి దిండిగల్ సి శ్రీనివాసన్, నాథమ్ నుంచి నాథమ్ ఆర్ విశ్వనాథన్, తొండముత్తూరు నుంచి ఎస్‌పీ వేలుమణి, రాయపురం నుంచి డి.జయకుమార్ పోటీలో ఉన్నారు. తొలి జాబితాలో పలువురు సీనియర్ పేర్లు చోటుచేసుకున్నాయి. కృష్ణగిరి నుంచి పి.బాలకృష్ణన్, రాయకొట్టయ్ నుంచి డి.జయకుమార్, హోసూరు నుంచి సీవీ షణ్ముగం, ముదురాంతకం నుంచి ఎస్‌కే రేజేంద్రన్, పలాకోడ్ నుంచి కేపీ అన్బళగన్, పెన్నాగరమ్ నుంచి ఆర్‌కే నాగరాజ్, వేలూరు నుంచి ఓఎస్ మణియన్ పోటీ చేస్తున్నారు. ఎన్డీయే సీట్ల కేటాయింపులో భాగంగా 170కి పైగా స్థానాల్లో అన్నాడీఎంకే పోటీ చేయనుండగా, కూటమి భాగస్వామి బీజేపీకి 27 సీట్లు కేటాయించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి. తమిళనాడు ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి మే 10వ తేదీతో ముగియనుంది.

## పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ ప్రారంభం

**క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు దోహదం చేస్తాయి.. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా వెల్లడి**



**హైదరాబాద్, మార్చి 25 ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో బుధవారం నాడు 74వ బిఎన్ మల్లిక్ అఖిల భారత పోలీసు ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ అట్టహాసంగా మొదలయ్యింది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు, పారా మిలటరీ బలగాలు పాల్గొన్న ఈ క్రీడా వేడుకను గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు దోహదం చేస్తాయని తెలిపారు. ముఖ్యంగా పోలీసులకు ఇది మరింతగా ఉపయోగపడతాయని ఆయన అన్నారు. తనకు క్రీడలంటే అభిమానమని, గతంలో తనకు యుపిలో క్రీడల మంత్రిగా పనిచేసిన అనుభవం వుందని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తం గా అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలతో పాటు పారా మిలటరీ బలగాలు తమ యూనీఫాంను పక్కన పెట్టి కేవలం క్రీడల యూనీఫాం ధరించడం, ఆరోగ్యకరమైన పోటీలో పాల్గొనడం మంచి సంప్రదాయమని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో మహిళా క్రీడాకారులు కూడా పాల్గొనడం శుభ సూచకమని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మహిళలు మరింత ఎక్కువగా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. పోలీసులు నిరంతరం డ్యూటీలకే పరి మితం కాకుండా క్రీడల్లోనూ పాల్గొనాలని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు వుంటాయని ఆయన తెలిపారు. తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటవుతుండడం వల్ల జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు రాష్ట్రం నుంచి వచ్చే అవకాశం వుందని ఆయన అన్నారు. పోలీసు ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనాలని, పోటీలను ఆస్వాదించాలని ఆయన కోరారు. డిజిపి శివధర్ రెడ్డి మాట్లా డుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు హైదరాబాద్ వేదిక కావడం ఆనందంగా వుందని అన్నారు. ఒకప్పుడు రాష్ట్ర పోలీసు విభాగంలో దేశం గర్చించే ఫుట్‌బాల్ క్రీడాకారులు వుండేవారని, ఈ ఛాంపియన్ షిప్‌తో మరోసారి అటువంటి క్రీడాకారులు రావాలని డిజిపి ఆకాంక్షించారు. ఈ పోటీలు కేవలం పోటీలే కాకుండా అన్ని పోలీసు విభాగాల మధ్య సహకారం కూడా వుందని ఆయన తెలిపారు. పోలీసులు వేరు వేరు రాష్ట్రాలు, వే రు వేరు విభాగాల్లో పనిచేస్తున్నా అందరు భారతీయులేనని డిజిపి తెలిపారు. పోలీసులంతా చట్టం కోసం, న్యాయం కోసం పనిచేయడం, శాంతి భ ద్రతలను పరిరక్షించడమేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్, అదనపు డిజిలు సంజయ్ కుమార్ జైన్, అనిల్ కుమార్, పోలీసు క్రీడల విభాగం ఐజి డాక్టర్ గజారావు భూపాల్, సైబరాబాద్ కొత్వాల్ రమేష్, డిఐజి అభిషేక్ మొహంతి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీపై సిపిఐ పోరుబాట

**- ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో పాదయాత్రకు సన్నాహాలు**

అనంతపురం, మార్చి 25 (ప్రభాతవార్త బ్యూరో): కూలీలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎన్డీఏ ప్రభుత్వం మార్పులు చేసి కూలీలకు ఉపాధి దూరం చేసే చర్యలు చేపట్టిందని నిరసిస్తూ సిపిఐ పాదయాత్రకు సన్నాహాలు చేస్తోంది. ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో మూడు రోజులు పాటు పాదయాత్ర నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ భావిస్తోంది. సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని సిపిఐ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలతో పాదయాత్ర విజయవంతం గురించి చర్చించారు. పాదయాత్రను అనంతపురం శివారులోని సమత గ్రామం నుంచి బత్తలపల్లి మీదుగా నార్పల మండలం బండ్లపల్లి వరకు పాదయాత్ర చేపట్టాలని, రెండు జిల్లాలను భాగస్వాములను చేయాలని సిపిఐ నేతలు నిర్ణయానికి వచ్చారు. పాదయాత్ర ప్రారంభానికి, ముగింపుకు సిపిఐ అగ్రనేతలను ఆహ్వానించాలని తీర్మానించారు. ముగింపు రోజు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా తదితరులు హాజరయ్యేలా ఆహ్వానించనున్నారు. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ భారతదేశంలో పేదరిక నిర్మూలనకు, వలసల నివారణకు వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాలు, నిధుల కేటాయింపుల్లో మార్పుల వల్ల కూలీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీ నిష్పత్తిలో వచ్చిన మార్పులు క్షేత్రస్థాయిలో కూలీలకు శాపంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ప్రధాన ఉద్దేశం గ్రామాల నుంచి పట్టణాలకు వలసలను ఆపడం. కానీ, కొత్త విధానాలతో నిధుల కొరత వల్ల పని దొరకని పరిస్థితి ఏర్పడితే, కూలీలు మళ్లీ జీవనోపాధి కోసం నగరాలకు వలస వెళ్లక తప్పదని ఇది గ్రామీణ కుటుంబాల చిన్నాభిన్నానికి దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలక ముందే ప్రభుత్వం ఈ నిధుల నిష్పత్తిని పునఃసమీక్షించాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్, అనంతపురం జిల్లా సిపిఐ కార్యదర్శి పి నారాయణ స్వామి, సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి ఎం.వేమయ్య, అనంతపురం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, రాజారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఏ కాటమయ్య, జిల్లా సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీరాములు, కేశవరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సరకు రవాణా లోడింగ్‌లో ఎస్‌సిఆర్ నం.1

**● ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 144.244 మిలియన్ టన్నుల సరుకు రవాణా ● అధికారులను ప్రశంసించిన దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ**

విజయవాడ, మార్చి 25 ప్రభాతవార్త ప్రతినిధి: దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో 144.244 మిలియన్ టన్నుల (ఎమ్.టిలు) సరుకు రవాణా సాధించడం ద్వారా అత్యుత్తమ పనితీరును నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఒక వారం ముందుగానే ఈ మైలురాయిని చేరుకోగలిగింది. ఇది సరుకు రవాణా విభాగంలో దక్షిణ మధ్య రైల్వే ప్రదర్శించిన నిరంతర కృషిని, నిర్వహణ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ అత్యుత్తమ పనితీరు 2024-25 ఆర్థిక సంవత్సరంలో నమోదైన అత్యుత్తమ లోడింగ్ అయిన 144.14 మిలియన్ టన్నులను అధిగమించింది. దక్షిణ మధ్య రైల్వే ముఖ్యంగా తన పరిధిలోని సింగరేణి బొగ్గు గనులు మరియు సిమెంట్ కర్మాగారాల నుండి బొగ్గు, సిమెంట్ రవాణా రంగంలో పటిష్టంగా ఉంది. దీనికితోడు జోన్లలోని ప్రస్తుత సరుకు రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూనే, సరుకు రవాణా విభాగంలో కొత్త సరుకుల రవాణాను చేర్చడం ద్వారా నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టింది. రవాణా వ్యవస్థలో ప్రధాన వస్తువు అయిన బొగ్గు 66.878 మిలియన్ టన్నులు, సిమెంట్ 37.572 మిలియన్ టన్నులు, ఇనుప ఖనిజం 8.620 మిలియన్ టన్నులు, ఎరువులు 8.038 మిలియన్ టన్నులు, ఉక్కు కర్మాగారాలకు ముడి పదార్థాలు 4.810 మిలియన్ టన్నులు, ఆహార ధాన్యాలు 6.225 మిలియన్ టన్నులు, కంటైనర్లు 2.561 మిలియన్ టన్నులు, పెట్రోలియం ఉత్పత్తులు (పెట్రోలియం ఆయిల్) 1.223 మిలియన్ టన్నులు, ఇతర వస్తువులు 8.349 మిలియన్ టన్నులు, మొత్తంగా 144.244 మిలియన్ టన్నులు దక్షిణ మధ్య రైల్వే మొత్తం సరుకు రవాణా జరుగుతుంది. దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది అసాధారణ సమిష్టి కృషి, అన్ని విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఫలితంగా రికార్డు స్థాయి పనితీరు సాధ్యమైంది.



సరుకు రవాణా వినియోగదారులను ఆకర్షించడానికి మౌలిక సదుపాయాల మెరుగుదల, టెర్మినల్స్‌లో పని వాతావరణం, గూడ్స్ షెడ్ల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించబడింది. అదనంగా, వినియోగదారుల అవసరాలను సమాయనుసారం పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. సాంప్రదాయ సరుకులతో పాటు ఇతర సరుకులను కూడా గుర్తించి, పోర్ట్ లోడింగ్‌పై దృష్టి సారించడంలో జోన్ చేసిన నిరంతర ప్రయత్నాలు రికార్డు స్థాయి సరుకు రవాణాను సాధించడానికి దోహదపడ్డాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సరకు రవాణా రంగంలో స్థిరస్థాయిగా నిలిచిపోయే మైలురాయిని సాధించడంలో ఆపరేషన్స్, కమర్షియల్ బృందాల అంకితభావాన్ని ప్రశంసించారు. ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్స్ టెలికమ్యూనికేషన్ వంటి విభాగాల సమర్థవంతమైన సమన్వయం రికార్డు స్థాయి సరుకు రవాణా లోడింగ్ సాధనలో కీలక పాత్ర పోషించిందని ఆయన అభినందించారు. అధికారులు, సిబ్బంది చూపిన నిబద్ధత, సమిష్టి కృషి, సమన్వయపూర్వక దృక్పథాన్ని ఆయన ప్రత్యేకంగా గుర్తించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ, సరుకు రవాణా విభాగంలో మరింత వృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఆయన బృందాన్ని ప్రోత్సహించారు.

## యేడాదిలో 200 ఖనిజ బ్లాకుల వేలం

**123 మైనింగ్, 77 కాంపోజిట్ లైసెన్స్ బ్లాక్‌లు.. ఒకే ఏడాదిలో నమోదైన అత్యధిక వేలం ఇదే**

**ప్రధాన పాత్ర పోషించిన ఐదు రాష్ట్రాలు.. రికార్డు స్థాయి మైలురాయిని సాధించిన భారత్**

హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త: ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో 200 ఖనిజ బ్లాక్‌లను విజయవంతంగా వేలం వేయడం ద్వారా భారతదేశ ఖనిజ రంగం ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. ఒకే సంవత్సరంలో నమోదైన అత్యధిక వేలం ఇదే కావడం విశేషం. సహకార సమాఖ్య విధానం ద్వారా రికార్డు స్థాయి విజయాన్ని సాధించినట్లు కేంద్ర గనుల శాఖ నివేదించింది. ఈ విజయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య బలమైన సహకార ప్రయత్నాలను ప్రతిబింబిస్తుంది. అలాగే దేశం యొక్క వేలం ఆధారిత ఖనిజ కేటాయింపుల వ్యవస్థలో పెరుగుతున్న పరిపక్వతను హైలైట్ చేస్తుంది. ఈ బ్లాక్‌లను అందించడంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కర్ణాటక మరియు మహారాష్ట్రలు వరుసగా ఐదు, నాలుగు, నాలుగు, మూడు, రెండు బ్లాక్‌లను అందించి ప్రధాన పాత్ర పోషించాయి. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం వేలం వేసిన 200 బ్లాక్‌లలో 123 మైనింగ్ లీజు బ్లాక్‌లు మరియు 77 కాంపోజిట్ లైసెన్స్ బ్లాక్‌లు ఉండటం కార్యాచరణ మరియు అన్వేషణకేంద్రీకృత అవకాశాల సమతుల్య మిశ్రమాన్ని సూచిస్తుంది. దీనికి అదనంగా, 38 ఎమ్ఎల్ మరియు 32 సిఎల్‌ల తో కూడిన 70 మినరల్ బ్లాక్‌ల కోసం టెండర్ల ఆహ్వాన ప్రకటనలు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఇది ఈ ఆర్థిక సంవత్సరంలో విజయవంతమైన వేలంపాటల మొత్తం సంఖ్యను మరింత పెంచుతుందని భావిస్తున్నారు. ఈ విజయంలో వివిధ రాష్ట్రాలు పోషించిన కీలక పాత్రను గనుల మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఇందులో గుజరాత్ 32 బ్లాక్‌లతో అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాత రాజస్థాన్ 30 బ్లాక్‌లతో, తమిళనాడు 22 బ్లాక్‌లతో అగ్రగామిగా నిలిచాయి. బ్లాక్‌లను సకాలంలో సిద్ధం చేయడం, డేటా నిర్వహణ, మరియు విధానపరమైన సామర్థ్యంలో ఆయా రాష్ట్రాల కృషి జాతీయ వేలం వ్యవస్థను బలోపేతం చేసింది. ఈ వేలంపాటలలో విస్తృత శ్రేణి ఖనిజాలు ఉన్నాయి. సున్నపురాయి 76 బ్లాక్‌లతో వేలం వేయబడిన ఖనిజంగా నిలిచింది, దాని తర్వాత ఖనిజం 40 బ్లాక్‌లతో ఉంది. బాక్సైట్ 30 బ్లాక్‌లతో వేలం వేయబడింది, ఇది కీలక పారిశ్రామిక రంగాలకు దాని ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది.

# ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యం

**● ఆగిరిపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం: మంత్రి కొలుసు పార్థసారథి**

ఆగిరిపల్లి, మార్చి 25 ప్రభాతవార్త: నూజివీడు నియోజవర్గంలో సుమారు రూ.25 కోట్లతో అభివృద్ధి పనులను నూతనంగా చేపట్టినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఆగిరిపల్లిలో గురువారం పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్న మంత్రి అనంతరం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా నియోజవర్గంలో సుమారు.రూ.250 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గతంలో ఆర్థిక విధ్వంసం చేసిన గత ముఖ్యమంత్రి అభివృద్ధి పనులను చేపట్టలేదని ఒక్క తట్టమట్టి కూడా వేయలేదని రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ వచ్చిన 20నెలల్లోనే నూజివీడు నియోజకవర్గంలో సుమారు రూ.250 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రైతుకు అన్నదాత సుఖీభవ రూ.20 వేల ఆర్థిక సహాయం అందించమన్నారు. రైతులకు ఐదు సూత్రాల పథకంతో ప్రతి ఒక్క రైతుకు నీరందించాలనే దృఢ సంకల్పంతో అన్నదాత సుఖీభవ కింద రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, కృష్ణానది జలాలను డెల్టాప్రాంతం వాళ్లు వాడుకోగా మిగిలిన జలాలు త్రాగు, సాగునీరుకు అందించాలని ప్రభుత్వం ప్రతి ఒక్క నీటిబొట్టు ఒడిచిపెడుతుందని తెలిపారు.



రైతులకు 90శాతం రాయతీతో డ్రోన్లు, ట్రాక్టర్లు 50శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్లు ఇలా పలు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. వరి పంట కాకుండా వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని, పామాయిలు ఆర్టికల్చర్ మొక్కజొన్న వంటి లాభజాతి పంటలు వేయాలని రైతులకు సూచించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పన కల్పించిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి మంత్రి నారా లోకేష్ కృషి పట్టుదలతో ఈ ఉక్కు ప్లాంట్ ఆంధ్ర రాష్ట్రంలో నెలకొల్పారని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్లలో ఒబిసి మహిళలకు సబ్ కోటా కేటాయించాలి: కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, మార్చి25 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల నెరవేరే సమయం ఆసన్నమవుతున్న తరుణంలో సామాజిక న్యాయాన్ని కూడా పాటించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఆ రిజర్వేషన్లలో ఒబిసి మహిళల కోసం సబ్ కోటా ఉండటం అంతే ముఖ్యం అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లును ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లోనే ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో కవిత స్పందించారు. మహిళా బిల్లులో ఒబిసి మహిళలకు ఉప కోటా కల్పించకపోవడం అంటే మెజారిటీ ప్రజలను మోసం చేయటమే అని పేర్కొన్నారు. చట్టసభల్లో సామాజిక సమానత్వం రావాలంటే ఒబిసి మహిళల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాల్సిందేనని అన్నారు. రిజర్వేషన్లలో రిజర్వేషన్ ఉంటేనే సామాజిక న్యాయం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఒబిసి మహిళలకు ఉప కోటా లేకుండా ముందుకు వెళ్లాలని కేంద్రం భావిస్తే మరోసారి పోరాటం తప్పదని హెచ్చరించారు. దేశంలో అన్ని వర్గాలకు మేలు చేయటమే సామాజిక న్యాయమని వ్యాఖ్యానించారు. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న ఒబిసి వర్గాల మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించకపోతే వారికి ఎలా న్యాయం దక్కుతుందని ప్రశ్నించారు. ఎస్‌సి,ఎస్‌టి మహిళలకు రాజ్యాంగబద్ధ వాటా ఉందని...కానీ ఒబిసిల పరిస్థితి ఏంటనీ ప్రశ్నించారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

**- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**

విజయవాడ, మార్చి 25 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధి, వారి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ అవకాశాలను కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మద్దతుతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన "ఉద్యమి టు ఉన్నతి" ఎగ్జిబిషన్ 2026ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఎగ్జిబిషన్‌లోని వివిధ స్టాళ్లను సందర్శించి, ఉత్పత్తుల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అరకు ఆర్గానిక్ మిల్లెట్స్, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద హస్తకళలు, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు,ఈవీ ఛార్జింగ్ వంటి సాంకేతిక ఆధారిత స్టాళ్లను మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమలను పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, బి2బి, బి2సి మార్కెట్‌లతో అనుసంధానించడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం మేరకు ఆంధ్రప్రదేశ్‌లో "ప్రతి ఇంటికొక పారిశ్రామికవేత్త"ను తయారు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, ప్రతి కుటుంబంలో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన మరియు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి విజయగాథలను అడిగి తెలుసుకున్నారు. మెప్మా, డ్వాక్రా మహిళల భాగస్వామ్యం,టెక్నాలజీ వినియోగంపై మంత్రి దుర్గేష్ ప్రశంసలు కురిపించారు.



'ఉద్యమి టు ఉన్నతి" ఎగ్జిబిషన్ 2026లో మంత్రి కందుల దుర్గేష్‌కు జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

## శ్రీలలిత ఆలపించిన భక్తి గీతానికి అరుదైన గౌరవం

**- గాయనిని ప్రశంసిస్తూ ప్రధాని మోడీ ట్వీట్**

విజయవాడ, మార్చి 25 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ గాయని శ్రీలలిత ఆలపించిన ఓ భక్తి గీతానికి అరుదైన గౌరవం దక్కింది. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గాదేవిని స్తుతిస్తూ ఆమె పాడిన పాటను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. విజయవాడ గాయనికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. విజయవాడ సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన గాయని శ్రీలలిత దుర్గమ్మపై 'కనకదుర్గా మహ ప్రమావిత' అనే పాటను ఆలపించారు. ఈ పాట యూట్యూబ్ లింకును ప్రధాని మోడీ తాజాగా తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ "దుర్గాదేవిని ఆరాధించడం వల్ల మనసు అపారమైన శక్తిసామర్థ్యాలతో నిండిపోతుంది" అని పేర్కొన్నారు. ప్రధాని స్వయంగా ఒక తెలుగు భక్తిగీతాన్ని ప్రశంసించడంతో ఈ పాట ఒక్కసారిగా వైరల్ అయింది. ఈ పరిణామంపై విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పందించారు. ప్రధాని నరేంద్ర మోడీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ నగరానికి చెందిన ఓ మహిళ పాడిన పాటను ప్రధాని గుర్తించి, ప్రజలతో పంచుకోవడం విజయవాడ వాసులందరికీ గర్వకారణమని సుజనా చౌదరి అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రతిభకు ప్రధాని నుంచి ప్రోత్సాహం లభించడం ఎంతో సంతోషకరమని అన్నారు.

## జనసేన నేత బొలిశెట్టి రాజీనామా ఆమోదం

విజయవాడ, మార్చి 25 ప్రభాతవార్త ప్రతినిధి: జనసేన సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ రాజీనామాను ఆ పార్టీ అధిష్టానం ఆమోదించింది. ఇటీవలే వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బొలిశెట్టి సత్యనారాయణ ప్రకటించారు. దీనిపై జనసేన అధినేత, డి.సిఎం పవన్ కల్యాణ్ పార్టీ కీలక నేతలతో చర్చించారు. పార్టీ నేతలందరి ఏకాభిప్రాయానికి అనుగుణంగా బొలిశెట్టి రాజీనామాను పవన్ ఆమోదించారు. అయితే బొలిశెట్టి సత్యనారాయణ చేపట్టే కార్యక్రమాలకు పార్టీకి సంబంధం లేదని జనసేన పార్టీ ప్రకటన విడుదల చేసింది.

## దళిత క్రిస్టియన్‌లను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి**

విజయవాడ, మార్చి 25 ప్రభాతవార్త ప్రతినిధి: దళిత క్రిస్టియన్‌లను ఎస్సీలుగా పరిగణించరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సుప్రీం కోర్టులో అప్పీలు చేయాలని సిపిఎం కోరింది. సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పులో క్రైస్తవ మతంలో కులాలు ఉండవని, అందువల్ల దళిత క్రిస్టియన్‌లను ఎస్సీలుగా పరిగణించరాదని పేర్కొనడం దురదృష్టకరం. ఏ మతంలో ఉన్నా దళితులు అస్పృశ్యతకు, అంటరానితనానికి, వివక్షతకు గురవుతూనే ఉన్నారు. క్రైస్తవ మతంలోకి మారిన వారిని సైతం అగ్రకులాల వారు దళితులుగానే పరిగణించి చిన్నచూపు చూస్తున్నారు. వివిధ రూపాల్లో వివక్షతను ప్రదర్శిస్తున్నారు. కులవివక్షతో దాడులు జరుగుతున్నాయి. క్రైస్తవంలో సైతం వేర్వేరు కులాల వారు తమ ఉనికిని చాటుకుంటున్నారు. ఎస్సీ జాబితాలో ఉన్న వారందరూ కులవివక్షతకు, అంటరానితనానికి గురవుతున్న వారే. ఏ మతంలో ఉన్నా ఇది మాసిపోవడం లేదు. అందువల్ల దళిత క్రిస్టియన్‌లను కూడా ఎస్సీలుగా పరిగణిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరుతున్నది.

## మద్యం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, మార్చి 25 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపి మద్యం కేసులో నిందితులకు ఎసిబి కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. నిందితులు బెయిల్ కోసం ఎసిబి కోర్టును అభ్యర్థించగా తిరస్కరించింది. వారి రిమాండ్‌ను ఏప్రిల్ 8 వరకు విజయవాడ ఎసిబి కోర్టు పొడిగించింది. ఈ కేసులో నిందితుల రిమాండ్ గడువు బుధవారం ముగియడంతో సిట్ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. ఈ క్రమంలోనే సిట్ కస్టడీకి మద్యం కేసు నిందితులు వాసుదేవరెడ్డి, ప్రణయ్ ప్రకాష్‌లను ఎసిబి కోర్టు అనుమతించింది. రెండు రోజుల పాటు వారిని విచారించేందుకు అనుమతినిచ్చింది. దాంతో విజయవాడ సిట్ కార్యాలయంలో బుధవారం వారిని విచారించారు. ఈ ఇద్దరు నిందితులను గురువారం కూడా సిట్ విచారించనున్నది.

# ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవానికి శుభారంభం

**● వైభవంగా భక్తి వాతావరణంలో హరిద్రా ఘటనం ● సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన టిటిడి జెఇఓ**



సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాల తయారీ కోసం పసుపు దంచుతున్న మహిళలు

రాజంపేట, మార్చి 25 ప్రభాతవార్త: కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రసిద్ధ ప్రాచీన ఆలయం శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం పవిత్రమైన హరిద్ర ఘటనం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టిటిడి అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఉపయోగిస్తారు. అలాగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి కూడా దీనిని వినియోగిస్తారు. ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేశారు. శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారు. పసుపు నూరిన తరువాత సమర్పణ చేసి తాంబూలం అందజేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.నేడు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు.ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఆలయం పురాతన, చారిత్రక ప్రాశస్త్యం కలిగినది. ఒకే శిలపై శ్రీ సీతారామ లక్ష్మణుల విగ్రహాలు ప్రతిష్టితమై ఉండటంతో ఒంటిమిట్టను "ఏకశిలా నగరం"గా కూడా పిలుస్తారు. మార్చి 26 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1న సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారు కావడంతో టిటిడి జెఇఓ వి.వీరబ్రహ్మం అధికారులతో కలిసి ఏర్పాటలు పరిశీలించారు.

### ఒంటిమిట్ట ధ్వజారోహణానికి పవిత్ర విష్ణు దర్భ సమర్పణ

కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 27న నిర్వహించనున్న ధ్వజారోహణ కార్యక్రమానికి ఉపయోగించే పవిత్ర విష్ణు దర్భతో తయారు చేసిన దర్భ మత్తు, తాడును బుధవారం ఘనంగా ఆలయ అధికారులకు సమర్పించారు. టిటిడి అటవీశాఖ అధికారులు ఈ పవిత్ర దర్భను ఆలయ అధికారులకు అందజేశారు. టిటిడి అటవీశాఖ సిబ్బంది ప్రత్యేకంగా తయారు చేసిన సుమారు 22 అడుగుల పొడవు, 7.5 అడుగుల వెడల్పు కలిగిన దర్భ మత్తు (సుమారు 60 కిలోల బరువు)తో పాటు 225 మీటర్ల పొడవు గల దర్భ తాడును ప్రతి సంవత్సరం ధ్వజారోహణ కార్యక్రమంలో వినియోగిస్తారు. ఈ పవిత్ర విష్ణు దర్భను శుద్ధి చేసి ఎండబెట్టి ధ్వజస్తంభానికి చుట్టుతారు. ఈ తాడుతో గరుడ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని సూచిస్తారు. ఈ పవిత్ర గడ్డి శుద్ధి లక్షణాలతో పాటు సూక్ష్మజీవులను నిరోధించే గుణాలు కలిగి ఉందని విశ్వసిస్తారు. టిటిడి అటవీశాఖ సిబ్బంది ఏర్పేడు సమీపంలోని చెల్లూరు గ్రామ పరిసర ప్రాంతాల నుండి ఈ దర్భను సేకరిస్తారు. అనంతరం ఒక వారం రోజుల పాటు ఎండబెట్టి, సుమారు నెలరోజుల పాటు భక్తి శ్రద్ధలతో దర్భ మత్తు, తాడును తయారు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ ఎ.ప్రశాంతి, డిఇ (ఎలక్ట్రికల్) సరస్వతి, పిఆర్ఓ ఎఫ్ఏసీ కుమారి నీలిమ, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, టిటిడి ఇన్‌చార్జ్ డిఎఫ్ఓ డా. ఏ.వి.ఎన్. శివకుమార్, డిఎఫ్ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం

ఒంటిమిట్ట, మార్చి 25 ప్రభాతవార్త: కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రసిద్ధ ప్రాచీన ఆలయం శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం పవిత్రమైన హరిద్ర ఘటనం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టిటిడి అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

**ప్రాధాన్యం:** హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఉపయోగిస్తారు. అలాగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి కూడా దీనిని వినియోగిస్తారు.

**కార్యక్రమం విధానం:** ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేశారు. శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారు. పసుపు నూరిన తరువాత సమర్పణ చేసి తాంబూలం అందజేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ ఎ.ప్రశాంతి, డిఇ (ఎలక్ట్రికల్) సరస్వతి, పిఆర్ఓ ఎఫ్ఏసీ కుమారి నీలిమ, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లక్షల మందికి భోజనం..



వంట గ్యాస్ కొరతతో రెస్టరెంట్లు, హాస్టళ్లు... ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. కానీ బెంగళూరుకి చెందిన డా. తేజస్విని అనంత్‌కుమార్ సారథ్యంలోని 'అదమ్య చేతన' అనే ఎన్జీఓ నిర్వహిస్తున్న అన్నపూర్ణ సెంట్రల్ కిచెన్‌కి ఆ పరిస్థితి రాదు. ఇది గత పద్దెనిమిదేళ్లుగా సిలిండర్‌తో పనిలేకుండా దాదాపు రెండు లక్షల మంది స్కూలు పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తోంది.

నలుగురున్న ఇంట్లోనే వంటింటి వ్యర్థాలతో రోజూ డస్ట్‌బిన్ నిండిపోతుంది. ఇక వందలు, వేల మందికి వండే కిచెన్ల నుంచి ఎంత చెత్త వస్తుందనీ... దాన్ని తరలించడం మున్సిపాలిటీ సిబ్బందికీ భారమే. పైగా అదంతా వృథానే... ఇలాగే ఆలోచించారు తేజస్విని. తమ ఎన్జీవో ద్వారా ఏర్పాటుచేసిన అన్నపూర్ణ కిచెనన్ను పునరుత్పాదక ఇంధనంతో ఉన్నారు. దాదాపు పద్దెనిమిదేళ్లుగా ఈ కిచెన్ ద్వారా రెండు లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించారు. నిత్యం వేలమందికి అన్నదానం చేస్తున్నారు. దీనంతటికీ ఒక్క గ్యాస్ సిలిండర్ వాడకుండా బయోమాస్ అగ్రివేస్ట్‌ని వాడుతున్నారు. కిచెన్ వ్యర్థాలతో బయోమాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ధాన్యపుపొట్టు, గడ్డి, కొబ్బరిచిప్పలు... వంటి వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారైన బ్రికెట్లను వాడి టన్నుల కొద్దీ బియ్యాన్ని ఆవిరిమీద ఉడుకుతున్నారు. విద్యుతికి బదులు సౌరశక్తినే ఉపయోగించారు. వృథా నీటిని రీసైకిల్ చేసి మొక్కలకి వాడితే, శుభ్రం చేసిన నీటిని ఫిల్టర్ చేసి వాహనాలను కడుగుతున్నారట. దాంతో పదిహేనేళ్ల క్రితమే జీరో గార్బేజ్ యూనిట్గా పేరొందింది కిచెన్. అంతేకాదు, తమ సంస్థ 'అదమ్య చేతన' ద్వారా మహిళల సాధికారత కోసం వృత్తి శిక్షణ, ఆరోగ్యంపట్ల అవగామణ వంటి కార్యక్రమాల్నీ నిర్వహిస్తున్నారీమె. ప్లాస్టిక్‌ని తగ్గించేదుకు పదివేల స్టీలు ప్లేట్లు, గ్లాసులతో ప్లేట్ బ్యాంక్‌నీ ఏర్పాటు చేసి అవసరమైనవాళ్లకి ఉచితంగా ఇవ్వడంతోపాటు గ్రీన్ బెంగళూరుకోసం మొక్కల్నీ నాటుతున్నారు.

**ఎలా మొదలైంది?** దివంగత మాజీ కేంద్ర మంత్రి అనంత్ కుమార్ తన తల్లి జ్ఞాపకార్థం ఆహారం, అక్షరం, ఆరోగ్యం ప్రధానాంశాలుగా 1997లో అదమ్య చేతన' అనే ఎన్జీఓని కలిగి ఉంది. దీనికి సహ వ్యవస్థాపకులు, ఛైర్మన్‌గా ఉన్నారు తేజస్విని. తరవాత 2008లో ప్రారంభమైన అన్నపూర్ణ కిచెన్ కార్యకలాపాలను ఆమె స్వయంగా చూసు కుంటున్నారు. అన్నపూర్ణ కిచెన్కి బెంగళూరుతో సహా ఐదీ వంటశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో రోజూ 3 టన్నుల బ్రికెట్లను వాడుతున్నారట. ఇది 120 తేకాదు గ్యాస్ సిలిండర్లకు సమానమైన ఇంధనం. మొత్తంగా బయో ఇంధన వినియోగంతో ఏటా 12,500కి పైగా గ్యాస్ సిలిండర్లని ఆదా చేస్తున్నారన్న మాట.




ఇప్పటివరకూ మా కిచెన్ నుంచి ఒక్క వ్యర్థమూ బయటికి పోలేదు. మొదట్లో కొంచెం కష్టంగా ఉన్నా తరువాత చాలా ఆనందంగా అనిపిస్తోంది. దీని గురించి అవసరమైన వాళ్లకి శిక్షణ ఇస్తున్నాం అంటున్నారు తేజస్విని. ఏమైనా స్వీయ ఇంధనంతో స్వావలంబన సాధించిన వీళ్ల ఆలోచనను మెచ్చుకోవాల్సిందే!

## వ్యథ — స్వయం వరం అన్నింటికంటే శ్రేష్ఠం !

మేము ఐదుగురు స్నేహితులు. మెడిసిన్ పూర్తి చేసి పీజీ కోసం ప్రయత్నిస్తున్నాము. ఈ దశలో, మా మధ్య పెళ్లి గురించి చర్చ మొదలైంది. ఒక్కొక్కరి అభిప్రాయం ఒక్కోలా ఉంది. ప్రేమ పెళ్లి మంచిదని ఒకరు, పెద్దలు కుదిర్చిన పెళ్లే భద్రమని మరొకరు అంటున్నారు. స్వయం వరం (సరైన వ్యక్తిని స్వయంగా ఎంపిక చేసుకోవడం) ఉత్తమమని నా అభిప్రాయం. సహజీవనం స్వేచ్ఛ ఇస్తుందని ఒకరు, జాతకాలే నిర్ణయాత్మకమని మరో స్నేహితురాలు అంటోంది. ఈ సందిగ్ధంలో మా ప్రొఫెసర్‌ను అడిగితే, ముందు కెరీర్‌పై దృష్టి పెట్టండి" అన్న సలహా ఇచ్చారు. అసలు ఏ రకం పెళ్లి మంచిది అన్న విషయం స్పష్టంగా చెప్పండి.

- ఒక సోదరి తిరుపతి



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు



**జవాబు:** అమ్మా, నిజానికి, పెళ్లి అనే వ్యవస్థ ఒక విధానం మాత్రమే. దాని విజయాన్ని నిర్ణయించేది పద్ధతి కాదు, వ్యక్తుల పరస్పర అవగాహన. ప్రేమ, సహనం, సర్దుబాటు, బాధ్యత .ఇవే ఏ సంబంధానికైనా బలమైన పునాది అన్న విషయం గుర్తించండి. అయితే, సరైన ఎంపిక (స్వయం వరం) అత్యంత శ్రేష్ఠం అంటారు. ఎందుకంటే దాంపత్య జీవితం అనేది ఒప్పందంతో కాదు, అవగాహనతో సాగాలి. సంబంధం ప్రేమతో ప్రారంభమవుతుంది, కానీ బాధ్యతతో నిలబడుతుంది. భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం కంటే, దీర్ఘకాల దృక్పథంతో తీసుకున్న ఎంపిక స్థిరమైన సంబంధాన్ని ఇస్తుంది. రామాయణంలో సీత స్వయంగా శ్రీరాముడిని ఎంపిక చేసుకోవడం వల్ల తర్వాత వచ్చిన కష్టాలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ఇచ్చింది. ప్రేమ పెళ్లిలో ఆకర్షణ పాత్ర ఎక్కువగా ఉండొచ్చు. పెద్దల పెళ్లిలో కుటుంబ, సామాజిక అంశాలు ప్రభావితం చేయొచ్చు. సహజీవనం స్వేచ్ఛనిచ్చినా, స్థిరత్వం ప్రశ్నార్థకమవుతుంది. జాతకాలపై పూర్తిగా ఆధారపడటం శాస్త్రీయంగా సమర్థించబడదు. కాబట్టి, పెళ్లి ఎలా జరిగిందన్నది ముఖ్యం కాదు. ఎవరిని, ఎందుకు ఎంపిక చేసుకున్నాము అన్నదే ప్రధానం. కెరీర్ కూడా ముఖ్యమే, కానీ జీవితం మొత్తం కెరీర్ కాదు. అదే సమయంలో, సరైన సమయం, సరైన నిర్ణయం రెండూ సమతుల్యంగా ఉండాలి. మనసుతో తీసుకున్న నిర్ణయం, జీవితాన్ని నిలబెడుతుంది. ఎంచుకున్న లక్ష్యం కష్టాలు ఎదురైనా నిలబడుతుంది. పెళ్ళి, దాంపత్య జీవితం వారసత్వం, కుటుంబానికి పునాది. అందుకే సరైన ఎంపిక అన్నింటికంటే శ్రేష్ఠం. ◻

## సచ్చరిత్ర పారాయణ ఫలం



షిరిడీ ప్రవేశమే సర్వ దుఃఖ పరిహారాము అంటుంది ఏకాదశ సూత్రములలో మొదటిది. అమర్‌నాథ్ బరేరియా సాయిబాబా భక్తుడనని తెలుపుకోవటానికి కూడ అంగీకరించడు. సాయి దివ్యత్వాన్ని గ్రహించేది. అమర్‌నాథ్ బరేలియా లోగడ షిరిడీ యాత్ర చేసాడు. కేవలం అవన్నీ యాంత్రికంగానే అయినట్టు లెక్క. జూన్ 13, 1985లో ఆయన కష్ట నష్టములను అనుభవించాడు. అప్పుడు షిరిడీ చేరాడు. సాయిదర్శనం చేసుకున్నాడు. సమయం చాలా ఉన్నది. లైబ్రరీకి వెళ్ళాడు. అకనకడ ఒంక దక్షిణ భారత దేశస్థుడు రచించిన ఆంగ్ల సాయి సచ్చరిత్రను చదివాడు. కష్ట సాగరానునండి బయటపడవేసేది శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణ అని చదివాడు. అది ఆరం రోజులపాటు చేయాలని ఉన్నది. ఆ పారాయణ గ్రంథం కొందామని బజారుకు వెళ్ళాడు. హిందీ ప్రతి తక్కువ ధరలో ఉన్నది. ఆ సాయినాథుని సచ్చరిత్రను ఆర్తితో మూడంటే మూడు రోజులలో పారాయణ చేసాడు. ఏడు రోజులపాటు షిరిడీలో ఉండటానికి తన వద్ద అంత ధనము కూడా లేదు. మూడే మూడు రోజులలో పారాయణను సాయి బాబా చేయించుకున్నది. తనవద్ద ఉన్న డబ్బుతో ధునిమాతకు నారికేళము సమర్పించి, పటిక బెల్లం సాయికినివేదించి, తన ఊరికి బయలుదేరాడు. మనసు తేలికపడ్డది. సమస్యలు తీరకుండా అంత ప్రశాంతత ఎలా కలిగిందా అని ఆశ్చర్యపోయాడు. ఇది సాయి సచ్చరిత్ర పారాయణ మహిమ అని గ్రహించాడు. ఇక 18 తేదీన ఇంటికి రాగానే అమెరికా నుండి వచ్చిన తన మిత్రుడు తన ఇంటికి వచ్చి, తాను లేకుండ , ఫలానా హోటల్‌లో కలవమని చెప్పి వెళ్ళి పోయాడు. వెంటనే ఆ మిత్రుడుండే హోటల్‌కు వెళ్లాడు అమర్‌నాథ్. అతను అమర్‌నాథ్ కష్టాలను తెలుసుకొని బాధపడ్డాడు. అమర్‌నాథ్‌కు ఒక ఉద్యోగము చూపాడు. అప్పటి వరకు ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న అమర్‌నాథ్ వెంటనే ఉద్యోగంలో చేరాడు. కుటుంబం అంతా సుఖంగా జీవించసాగారు. అదంతా సాయి సచ్చరిత పారాయణ ప్రభావముగా గుర్తించాడు అమర్‌నాథ్.

- యం.పి.సాయినాథ్

## ఇంట్లోనే పార్లర్ నిగారింపు..

ఆన్‌లైన్‌లో ఎక్కువగా వెదికిన వాటిల్లో అందానికి ఇంటి చికిత్సలూ ఒకటి. ఎన్ని రకాల క్రీములున్నా.. సహజమైనవి చేసే మేలే ఎక్కువ మరి. మీరూ ఆ ప్రయోజనం పొందాలి అనుకుంటున్నారా? అయితే వీటిని ప్రయత్నించేయండి.



**అరటి-తేనె..** బాగా పండిన అరటి పండులో చిన్న ముక్క తీసుకొని గుజ్జులా చేయాలి. దానికి చెంచా తేనె, నాలుగైదు చుక్కలు నిమ్మరసం కలిపి, మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి, పావుగంటసేపు వదిలేయాలి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. అరటిలో పుష్కలంగా ఉండే ఎ,బి,ఇ విటమిన్లు చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు.. నల్ల మచ్చలనీ తగ్గిస్తాయి. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తేమగా ఉంచుతాయి.

**బేకింగ్ సోడా-యాపిల్ సిడార్ వెనిగర్..** చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించడంలో వంట సోడా బాగా పని చేస్తు ంది. చెంచా వంటసోడాలో రెండు చెంచాల యాపిల్ సిడార్ వెనిగర్ చేర్చి, పేస్టులా చేసుకోవాలి. ముకాన్ని కడిగి, తడి లేకుండా తుడిచాక ఈ మిశ్రమాన్ని పట్టించాలి. పది నిమిషాల తర్వాత గాఢత తక్కువ ఉండే ఫేస్‌వాష్‌తో కడిగేస్తే సరి. మెరిసే చర్మం మీ సొంతం. **నిమ్మ..** చర్మాన్ని మెరిపించడంలో నిమ్మదీ ప్రత్యేక పాత్రే. దీనిలోని విటమిన్ సి సహజ ఎక్స్‌ఫోలియేటర్‌గట్టు పనొ చేస్తు. ఒక నిమ్మచెక్కను సన్నటి చక్కెరలో ముంచి ముఖంపై మృదువుగా మర్దనా చేస్తే చాలు. అయిదు నిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మరంధ్రాలను లోతుగా శుభ్రం చేసి, చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అలర్జీలు, యాక్నే రాకుండానూ చూస్తుంది.

**నారింజ తొక్కలతో..** చెంచా నారింజ తొక్కల పొడికి, చెంచా తేనె, చిటికెడు పసుపు కలిపి మెత్తని చూర్ణంలా చేసు కోవాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసి, మాయిశ్చరైజర్‌ను రాస్తే సరి. దీనిలో ఉండే సి విటమిన్ ముఖంపై ముడతలు, గీతలను తగ్గించడంలో సాయపడుతుంది. ◻

## పనీర్ మంచిదేనా..



చాలా మందికి చాలా ఇష్టమైంది పనీర్. దీంతో చేసినకూరలు, స్నాక్స్.. ఏవైనా మహత్తరంగా ఉంటాయి. పనీర్ రుచే కాదు, బలం కూడా. అయితే మార్కెట్లో దొరుకుతున్న పనీర్ మంచిదో కాదో తప్పకుండా తెలుసుకోవాలి. ఎలాగంటారా? అందుకు ఐదు మార్గాలున్నాయి.


✦ అసలు పనీర్‌ను చూడగానే అర్థమైపోతుంది. అది మంచిదో కాదో. తాజా పనీర్ తెల్లగా లేదా క్రీమ్ రంగులో ఉంటుంది. ముదురు పసుపు రంగులో ఉన్నా లేదా మొత్తం ఒకే రంగులో కాకుండా..కొంత ఒక రంగులో, మరికొంత ఇంకో రంగులో ఉన్నా.. అది స్వచ్ఛమైంది కాదని గ్రహించాలి.

✦ ఓ చిన్న ముక్కను నలిపి చూస్తే కొద్ది మెత్తగా తగులుతుంది. నాణ్యమైంది మరీ మెత్తగా లేదా మరీ గట్టిగా ఉండదు.

✦ వాసన చూస్తే తెలిసీ తెలియనట్టుగా కొద్దిగా పాల మిఠాయి వాసన వస్తుంది. అలా కాకుండా గాఢమైన లేదా పుల్లటి వాసన వచ్చిందంటే స్వచ్ఛంగా లేదన్నమాట.

✦ పనీర్ ముక్కను నీళ్ల గ్లాసులో వేస్తే.. మంచిదైతే మునిగిపోయి, అడుగున చెక్కుచెదరకుండా ఉంటుంది. కల్తీది కరిగిపోతుంది లేదా విరిగిపోతుంది. పనీర్‌ను నూనె లేకుండా పెనం మీద వేడి చేయండి. మంచిదైతే ఆకారం మారదు. కొద్దిగా తేమ బయటికొస్తుంది. అదే కల్తీ పనీర్ అయితే కరిగిపోతుంది లేదా అందులోంచి చాలా నీరు వస్తుంది. ◻

## శ్రీ శివశంకర్ వరప్రసాద్‌తో వేగం పెంచిన మెగాస్టార్



వందేళ్ల తెలుగు సినిమారంగంలో ఎందరో హీరోలు వెండితెరను వెలిగించారు. అదే వేగంతో చరిత్రలోకి వెళ్లిపోయారు. కాని యింత కాలం చెక్కు చెదరక, ప్రతిభయే తన లక్షనయంతో సాగిన మెగాస్టార్ పద్మవిభూషణ్ చిరంజీవి అర్ధశతాబ్దపు అవిరళి కృషి సాగిస్తూ, 158 చిత్రాల నటనా ప్రతిభను నేటికీ ముందుకు సాగిపోతూ శరవేగాన ముందుకు సాగుతున్నారు. తాజాగా తన వేగం పెంచారు కళామ తల్లి ఆశీస్సుల అభిషేకం. 1983లో 'ఖైదీ' చిత్రం ఆనాటి తెలుగు సినిమా రూపురేఖలు మార్చినా, 2025 నాటి శ్రీ శివశంకరవరప్రసాద్ యీ నాటి భారతీయ సినిమా రంగం వులిక్కి పడేలా కలెక్షన్ల పూలవాన కురిపిసునతన్నది. వయస్సు మరచి, మనస్సే మధురంగా ఆయన చేసే తపస్సు, కృషికి పునాది, పువ్వులవానసపా, ఒక్క మాటలో చెపానపలంటే మెగాస్టార్ అలుపెరగని బాటపసారి. అవార్డులెన్నో ఆయనకు ఆగని సెలయేరులో వసునతన్నా, తాజాగా ఎన్.టి.ఆర్ అవార్డు ఆయన్ను వరించినా, అదేం చిత్రమో ఆయన వేగం తగ్గలేదు. 'శ్రీ శంకరవరప్రసాద్' తెలుగు వారి హృదయల్లోగూడుకట్టినా, ఆశ్లీలతలేని సంగీతానికి ఆయన స్వాగతం చెప్పారు

## తెర

## అమీషా పటేల్ వ్యాఖ్యలు హాట్ టాపిక్



బాలీవుడ్ సీనియర్ నటి అమీషా పటేల్ చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పోకడలపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నేటి కాలపు దర్శకులు నటీనటు లను ఎంచుకునే విధానంపై ఆమె వేసిన సెటైర్లు ఇండస్ట్రీలో చర్చకు దారి తీస్తున్నాయి. ప్రతిభ కంటే సోషల్ మీడియా ఫాలోయింగ్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ అమ్మడు చేసిన విమర్శలు నెటిజన్లను ఆలోచింపజేస్తున్నాయి. ప్రస్తుతం బాలీవుడ్‌లో కాస్టింగ్ అనేది కేవలం నటన ఆధారంగా కాకుండా ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్యపై ఆధారపడి జరుగుతోందని అమీషా అసహనం వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో చాలా మంది దర్శకులు కేవలం ఇన్‌స్టాగ్రామర్లనే సినిమాల్లోకి తీసుకుంటున లో మార్పు మొదలైందా? ఒక నటుడికి ఎన్ని మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారన్నదే ముఖ్యం తప్ప వారికి ఎంత నటన వచ్చు అనేది ఎవరూ చూడటం లేదు అంటూ ఆమె నేటి ట్రెండ్‌పై ఘాటు గా స్పందించారు. ఇదే క్రమంలో అమీషా ధురందర్ 2 దర్శకుడు ఆదిత్య ధర్ పై ప్రశంసల వర్షం కురిపించారు. మిగతా దర్శకులలా కాకుండా ఆదిత్య ధర్ కేవలం నటన సామర్థం ఉన్న నిజమైన నటులను మాత్రమే తన సినిమా కోసం ఎంచు కున్నారని కొనియాడారు. సోషల్ మీడియా పాపులారిటీకి పడిపోకుండా పాత్రకు ఎవరు న్యాయం చేస్తారనే కోణంలోనే ఆయన నటీనటుల ఎంపిక చేశారని అందుకే ధురందర్ 2 అంతటి ఘన విజయం సాధించిందని విశ్లేషించారు. వివరాలు త్వరలోనే! అమీషా చేసిన ఈ వ్యాఖ్యలు బాలీవుడ్‌లోని ఇన్‌ఫ్లుయెన్సర్ కల్చర్ పై నేరుగా దాడి చేసినట్లుగా ఉన్నాయి. ఆదిత్య ధర్ వంటి దర్శకులు పరిశ్రమకు మార్గదర్శకంగా నిలవాలని నటనను నమ్ముకున్న వారికే అవకాశాలు ఇవ్వాలని అమీషా కోరారు.

## 'దేత్తడి' గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో దిల్ రాజు



ఆశిష్, ఆదిత్య రావు గంగాసాని, దిల్ రాజు శిరీష్ కల్చరల్ డ్రామా 'దేత్తడి' ఘనీ భాయ్ మాస్‌అప్పీలింగ్ గ్లింప్స్ లాంచ్ రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి' ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఈ గ్లింప్స్ హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పండుగలు, వేడుకలకు ఉత్సాహాన్ని నింపే పాపులర్ డ్రమ్మర్ ఘన్ను భాయ్ వరల్డ్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఘన్ను భాయ్, అతని టీం దాదాపు ఏడు కిలోల డ్రమ్ములను మోస్తూ, గంటల తరబడి విరామం లేకుండా ప్రదర్శన ఇస్తూ ప్రశంసలు అందుకున్నారుఆశిష్ నటన అద్భుతంగా వుంది. అతని రఫ్ మేకోవర్ ఆ పాత్రకు చక్కగా సరిపోయింది. ఆ పాత్రలో ఎంత సహజంగా జీవించారు. అతని హావభావాలు, నేచురల్ ప్రజెన్స్, డ్రింక్ చేసే విధానం, అలవోకగా పలికే హైదరాబాద్ యాస ఈ పాత్రకు బలమైన మాస్ ఫ్లేవర్‌ను జోడించాయి. ఫస్ట్ టైం డైరెక్టర్ గా ఆదిత్య రావు గంగాసాని కథనాన్ని అద్భుతమైన పట్టుతో నడిపించారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, దిల్ రాజు ప్రొడక్షన్ భారీ స్థాయిలో నిర్మించారు. 'ది గ్లింప్స్' అత్యద్భుతంగా లాంచ్ చేశారు. 500 మందికి పైగా స్ట్రీట్ డ్రమ్మర్లు ఏకతాటిపై హోరెత్తిస్తూ, వాతావరణాన్ని ఎనర్జీని నింపేశారు. వారి ఉత్సాహభరితమైన పెర్ఫార్మెన్స్ ఈవెంట్ స్థాయిని పెంచడమే కాకుండా, సినిమాపై అంచనాలను మరింత పెంచింది

## 'గరివిడి లక్ష్మి'లో అదిరిపోయే జానపదం



ఆనంది, T.G. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ గరివిడి లక్ష్మి నుంచి అదిరిపోయే జానపదం కోసింది కొయగూర సాంగ్ రిలీజ్ భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసు కొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న "గరివిడి లక్ష్మి ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అద్భుతమైన జానపదం కోసింది కొయగూర సాంగ్ ని రిలీజ్ చేశారు మేకర్స్. చరణ్ అర్జున్ ఈ జానపదాన్ని రాఎనర్జీ వుండే డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. అనన్య భట్, షకలక శంకర్, గౌరీ నాయుడు జమ్ము వోకల్స్ మరింత వైబ్ ని యాడ్ చేశాయి. ఉత్తరాంధ్ర జనపదం మూలం నుంచి స్వరపరిచిన ఈ పాటకు గంటేడ గౌరు నాయుడు, గౌరీ నాయుడు జమ్ము రాసిన అదనపు సాహిత్యం మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ సాంగ్ లో ఆనంది పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. రాగ్ మయూర్ ప్రజెన్స్ డ్యాన్స్ మూమెంట్స్ మరింత జోష్ ని తీసుకొచ్చింది.

## 'బ్యాండ్ మేళం' సినిమా పెద్ద హిట్ కావాలి



"బ్యాండ్ మేళం' సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు కోర్ట్‌తో బ్లాక్ బస్టర్ పెయిర్‌గా నిలిచిన హర్ష్ రోషన్, శ్రీదేవీ జంట మళ్లీ "బ్యాండ్ మేళం అంటూ ఆడియెన్స్ ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబోతోన్నారు. ..కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు మాట్లాడుతూ.. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. .."కోన వెంకట్ గారి సినిమా అంటే అది మా సినిమానే. ఆయనకు కథల పట్ల మంచి అభిరుచి ఉంటుంది. కోన గారు ఈ మూవీ కోసం విపరీతంగా ప్రమోషన్స్ చేశారు. ప్రముఖ నిర్మాత సురేష్ బాబు మాట్లాడుతూ.. కోనగారు నాకు ఈ మూవీని చూపించారు. సతీష్ ఈ సినిమాని అద్భుతంగా రూపొందించారు. రోషన్, శ్రీదేవీ చక్కగా నటించారు.

## 'యూత్' తమిళం, తెలుగులో ఘన విజయం



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ "యూత్". ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 27న "యూత్" మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోందిహీరోయిన్ మీనాక్షి దినేష్ మాట్లాడుతూ "యూత్" మూవీ తమిళంలో మంచి విజయం సాధించింది. తెలుగు ప్రేక్షకులు కూడా హిట్ చేస్తారనే నమ్మకం ఉంది. హీరోయిన్ ప్రియాన్షి యాదవ్ మాట్లాడుతూ మీ అందరి సమక్షంలో మా మూవీ ఈవెంట్ సెలబ్రేట్ చేసుకోవడం సంతోషంగా ఉంది. హీరోయిన్ అనిష్మ అనిల్ కుమార్ మాట్లాడుతూ నేను కేరళ నుంచి వచ్చాను. మా దగ్గర తెలుగు మూవీస్ ను బాగా ఇష్టపడతారు. కేరళలో అల్లు అర్జున్ కు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ జై క్రిష్ మాట్లాడుతూ "యూత్" సినిమాలో నేను ఒక పాట పాడాను. జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ లో నేనూ పార్ట్ కావడం సంతోషంగా ఉంది. డైరెక్టర్ వినయ్ రత్నం మాట్లాడుతూ మనం చూసిన ఎన్నో సక్సెస్ ఫుల్ సినిమాల వెనక వినీత్, సందీప్ ఉన్నారు, వారి ప్రమోషనల్ యాక్టివిటీస్ ఉన్నాయి. యూత్ సినిమాతో వీళ్లకు ప్రొడ్యూసర్స్ గా మంచి సక్సెస్ రావాలి.

## మయామి ఓపెన్‌లో..

# సెమీ ఫైనల్స్‌కు కరోలినా

**న్యూఢిల్లీ:** మయామి ఓపెన్-2026లో కరోలినా ముచోవా అద్భుతమైన ప్రదర్శన చేసి సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో కరోలినా కెనడాకు చెందిన యువ క్రీడాకారిణి విక్టోరియా మ్బోకోను 7-5, 7-6(5) తేడాతో ఓడించింది. తద్వారా తన మొదటి మయామి ఓపెన్ సెమీస్‌లో స్థానం సంపాదించింది. ఒక గంట 47 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో, 29 ఏళ్ల చెక్ క్రీడాకారిణి తన ఐదవ డబ్ల్యూటిఎ 1000కు చేరుకుంది. మొదటి సెట్ హోరాహోరీగా సాగింది. 5-4 స్కోరు వరకు ఇరు జట్ల సర్వ్‌లు నిలకడగా ఉన్నాయి. ఆ సమయంలో 0-30తో వెనుకబడిన ముచోవా, ఆ తర్వాత వరుసగా నాలుగు పాయింట్లు సాధించి సెట్‌ను ఐదు గేమ్‌ల చొప్పున సమం చేసింది. తదుపరి ప్రపంచ 9వ ర్యాంకర్ అయిన మ్బోకో యొక్క తడబాటుతో కూడిన సర్వీస్ గేమ్‌ను సద్వినియోగం చేసుకుని



ఆమె ఆధిక్యంలోకి దూసుకెళ్లింది, చివరకు తన మూడవ సెట్ పాయింట్‌ను గెలుచుకుని తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. రెండవ సెట్ కూడా ఇద్దరు క్రీడాకారులు టైబ్రేక్ వరకు తమ సర్వ్‌లను నిలబెట్టుకున్నారు. ఆరంభంలోనే ఒక మినీబ్రేక్‌తో ముచోవా ఆధిక్యం సాధించి, తన సంయమనాన్ని కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించింది. ఈ విజయంతో ముచోవా అద్భుతమైన పరంపర కొనసాగింది. ఈ నెల 26న జరిగే సెమీఫైనల్‌లో, స్విట్జర్లాండ్‌కు చెందిన బెలిండా బెన్సిచ్‌పై మూడు సెట్ల పోరులో 63 16 63 తేడాతో విజయం సాధించిన అమెరికన్ క్రీడాకారిణి కోకో గాఫ్‌తో ముచోవా తలపడనుంది.



# ఐపిఎల్‌లో.. భారత్ కెప్టెన్లతోనే బరిలో ఫ్రాంచైజీలు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు రంగం సిద్ధమైంది. మరో 6 రోజుల్లో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. మార్చి 28 న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే 10 ఫ్రాంచైజీలు సన్నాహకాలు మొదలు పెట్టాయి. టైటిలే లక్ష్యంగా వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఈసారి ఎన్నడూ లేని విధంగా 10 ఫ్రాంచైజీలు భారత కెప్టెన్లతోనే బరిలోకి దిగుతున్నాయి. ఐపీఎల్ 2026 టోర్నమెంట్ చరిత్రలో తొలిసారిగా 10 ఫ్రాంచైజీలకు భారతీయ కెప్టెన్లను నియమించి చరిత్ర సృష్టించింది. ఇలా భారత సారథులతో ఒక సీజన్ ప్రారంభం కావడం 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఇదే తొలిసారి. పేరుకు ఇండియన్ ప్రిమియర్ లీగ్ అయినా, విదేశీ ఆటగాళ్ల ఆధిపత్యం ఎంతగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తుది జట్టులో ఆడేది నలుగురే అయినా విదేశీ ఆటగాళ్ల ప్రభావం ఈ లీగ్‌పై ఎక్కువగానే ఉంటుంది. పలువురు విదేశీ ఆటగాళ్లు కెప్టెన్లుగా కూడా వ్యవహరించారు. కానీ గత 18 సీజన్ నుంచి ఉన్న ఒరవడికి ఈసారి మాత్రం తెరపడింది. తొలిసారి భారత ఆటగాళ్ల సారథ్యంలో 10 ఫ్రాంచైజీలు బరిలోకి దిగుతున్నాయి. పలువురు విదేశీ కెప్టెన్లు గాయపడటంతో ఇది సాధ్యమైంది. సన్‌రైజర్స్



హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మోకాలి గాయంతో ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దాంతో ఇషాన్ కిషన్‌ను తాత్కాలిక సారథిగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నియమించింది. మిగతా 9 జట్లకు భారత ఆటగాళ్లే సారథులుగా ఉండటంతో ఈ సీజన్‌లో విదేశీ ఆటగాడు కెప్టెన్‌గా లేకుండా పోయాడు. ఫ్రాంచైజీల వారీగా కెప్టెన్ల వివరాలు చూస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)కు ఇషాన్ కిషన్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి)కు రజత్ పటీదార్, కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు అజింక్యా రహానే, ముంబై ఇండియన్స్ (ఎమ్ఐ)కు హార్దిక్ పాండ్యా, లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జి)కు రిషబ్ పంత్, గుజరాత్ టైటాన్స్ (జిటి) శుభ్‌మన్ గిల్, ఢిల్లీ క్యాపిటల్స్ (డిసి)కు అక్షర్ పటేల్, పంజాబ్ కింగ్స్ (పిబికెఎస్)కు శ్రేయస్ అయ్యర్, రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)కు రియాన్ పరాగ్, చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె)కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌లుగా వ్యవహరిస్తున్నారు.

ఆట

## మహిళల పోల్ వాల్ట్‌లో బరానికాకు

# స్వర్ణం

**న్యూఢిల్లీ:** మొట్టమొదటి జాతీయ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో బరానికా ఎలాంగోవన్ మహిళల పోల్ వాల్ట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచింది. దీంతో స్వర్ణ పతకంతో పాటు, ఆమె కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. బరానికా 4.22 మీటర్ల ఎత్తును అధిగమించి, రోసీ మీనా నెలకొల్పిన 4.21 మీటర్ల మునుపటి జాతీయ రికార్డును దాటింది. ఆమె బ్యాట్‌ను 4.25 మీటర్లకు ఎత్తడానికి ప్రయత్నించినా అది సఫలం కాలేదు. కాగా పురుషుల లాంగ్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్, శరుణ్ పాయసింగ్‌ల మధ్య ఉత్కంఠభరితమైన పోరు జరిగింది. 25 ఏళ్ల పాయసింగ్ 7.80 మీటర్ల దూరంతో తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

మరోవైపు, మహమ్మద్ అఫ్జల్ పురుషుల 800 మీటర్ల పరుగులో 1:47.86 సెకన్ల సమయంతో కొత్త ఇండోర్ జాతీయ రికార్డును నెలకొల్పాడు. పురుషుల 800 మీటర్లలో మహ్మద్ అఫ్జల్ (ఎయిర్ ఫోర్స్) 1:47.86 సెకన్లు, కళ్యాణ్ జేఆర్ (కర్ణాటక) 1:53.98 సెకన్లు, సయాన్ కర్మాకర్ (పశ్చిమ బెంగాల్) 1:56.98 సెకన్లు. పురుషుల అండర్ 20, 800 మీటర్లలో లోకేష్ మగెంధిరన్ (తమిళనాడు) 1:53.92 సెకన్లు, రాజ్‌దీప్ పాల్ (పశ్చిమ బెంగాల్) 2:02.34 సెకన్లు. పురుషుల 3,000 మీటర్లలో శివాజీ పరశురామ్ (రిలయన్స్) 8:09.88 సెకన్లు, వినోద్ సింగ్ (మధ్యప్రదేశ్) 8:16.93 సెకన్లు, రాహుల్ కుమార్ వర్మ (ఛత్తీస్‌గఢ్) 8:18.21 సెకన్లలో అధిగమించారు.



## దక్షిణాఫ్రికాదే

# టి20 సిరీస్

**న్యూఢిల్లీ:** సొంత గడ్డపై న్యూజిలాండ్ కు పరాభవం ఎదురైంది. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న దక్షిణాఫ్రికా జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇవాళ జరిగిన నిర్ణయాత్మకమైన ఐదో టీ20లో 33 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తు చేసి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2 తో కైవసం చేసుకుంది. న్యూజిలాండ్ గడ్డపై దక్షిణాఫ్రికాకు ఇది మొట్ట మొదటి టీ20 సిరీస్ విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగులు సాధించింది. సఫారీ బ్యాటర్లలో కానర్ ఎస్టర్ హుయిజెన్ (75; 33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసకర హాఫ్ సెంచరీ చేశాడు. రూబిన్ హెర్మాన్ (39), వియాన్ ముల్డర్ (31), దయాన్ ఫోరెస్టర్ (21 నాటౌట్) రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో బెన్ సియర్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. జాకరీ ఫౌల్క్స్, జోష్ క్లార్క్సన్ చెరో వికెట్ సాధించాడు. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్ జట్టు దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి తడబడింది. న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులకే పరిమితమైంది. కివీస్ బ్యాటర్లలో బెవాన్ జాకబ్స్ మినహా మిగిలిన వారు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. బెవోన్ జాకబ్స్ (36; 19 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. జేమ్స్ నీషమ్ (24),డేన్ క్లీవర్ (24) లు పర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఒట్నీల్ బార్ట్‌మాన్, గెరాల్డ్ కోట్జీ, వియాన్ ముల్డర్ లు తలా రెండు వికెట్లు సాధించారు. కేశవ్ మహారాజ్ ఓ వికెట్ పడగొట్టారు.



## ఆసియా కప్ క్వాలిఫైలో..

# భారత్ ఆర్చర్లకు 2 కాంస్యాలు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ప్రపంచ ర్యాంకింగ్ టోర్నమెంట్ మొదటి దశ రెండవ రోజున భారత ఆర్చర్లు మిశ్రమంగా, ప్రోత్సాహక రంగా ప్రదర్శన కనబరిచి, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకోవడంతో పాటు రెండు టీమ్ ఫైనల్స్‌కు కూడా చేరుకున్నారు. బ్యాంకాక్‌లో బుధవారం జరిగిన పోటీల్లో చికిత్సా తానిపర్తి, రాజ్ కౌర్, తేజల్ సాల్వేలతో కూడిన మహిళల కాంపౌండ్ జట్టు, హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్‌లో ఆతిథ్య థాయ్‌లాం డ్‌ను 229-226 తేడాతో ఓడించి ఫైనల్‌లో స్థానం సంపాదించింది. ఒత్తిడిలోనూ సంయమనం ప్రదర్శించి ఫేవరెట్ జట్టుగా ఉన్న థాయ్ లాండ్‌ను అధిగమించిన ఈ భారత త్రయం, ఇప్పుడు స్వర్ణపతకంకోసం కజకిస్థాన్‌తో తలపడనుంది. దీనికి విరుద్ధంగా, పురుషుల కాంపౌండ్ జట్టు నాకౌట్ రౌండ్లలోకి బలమైన పోటీదారులుగా ప్రవేశించినప్పటికీ కాంస్యంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. క్వాలిఫికేషన్ దశలో ఆధిపత్యం చెలాయించిన రజత్ చౌహాన్, రిషబ్ యాదవ్ మరియు ఉదయ్ కంబోజ్, సెమీఫైనల్‌లో వియత్నాం చేతిలో 233-234 తేడాతో స్వల్ప ఓటమిని చవిచూశారు. అలాగే రికర్వ్ ఈవెంట్లలో కూడా భారత్ కాంస్య పతకాలతో ఆకట్టుకుంది. దేవాంగ్ గుప్తా, సుఖ్‌చైన్ సింగ్, జుయెల్ సర్కార్‌లతో కూడిన పురుషుల రికర్వ్ జట్టు మలేషియాపై 5-1 తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అగ్రశ్రేణి జట్టు అయిన భారత జట్టు మ్యాచ్ ఆద్యంతం ఆధిపత్యం కొనసాగించి, టైటిల్ కోసం కజకిస్థాన్‌తో తలపడనుంది. మరోవైపు, రూమా బిస్వాస్, కీర్తి, రిధి ఫోర్‌లతో కూడిన మహిళల రికర్వ్ జట్టు మలేషియాపై 5-1 తేడాతో విజయం సాధించి కాంస్యం కైవసం చేసుకుంది.

## బులియన్ మార్కెట్‌లో

# పసిడి పరుగులు

### వెండి ధరల్లోనూ అదే ర్యాలీ



**ముంబయి, మార్చి 25:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు క్రమంగా తొలగిపోతుండటంతో ఇవాళ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయన్న నివేదికల నేపథ్యంలో మదుపరులు విలువైన లోహాల కొనుగోళ్లకు మొగ్గు చూపారు. దీంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి, వెండి ధరలు పరుగులు పెట్టాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బుధవారం ఏప్రిల్ 2 గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా రూ. 5,658 పెరిగి 10 గ్రాములకు రూ. 1,44,570 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత కాస్త తగ్గి రూ. 1,44,410 వద్ద ట్రేడ్ అయింది. మే5 సిల్వర్ ఫ్యూచర్స్ ధర కూడా దాదాపు 6 శాతం (రూ. 13,228) ఎగబాకి, కిలోకు రూ. 2,14,500 గరిష్ఠ స్థాయికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఇదేధోరణికనిపించింది. కామెక్స్ గోల్డ్ ధర 4.48 శాతం పెరిగి ఔన్సుకు 4,633.17 డాలర్లకు చేరగా, కామెక్స్ వెండి7.5% లాభపడి 74.8 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. దేశీయ మార్కెట్లలో 24 కేరట్ల తులం బంగారం రూ.1,46,670కి చేరితే 22 కేరట్లు రూ. 1,34,450గా కొనసాగింది. 18 కేరట్ల బంగారం కూడా 1,10,010గా కొనసాగినట్లు బులియన్ వర్గాలు చెపుతున్నాయి. అలాగే స్పాట్ మార్కెట్‌లో వెండిధరలు కిలో ఒక్కింటికి రూ.2.60 లక్షలుగా కొనసాగాయి. చెన్నై, హైదరాబాద్ మార్కెట్లలో 2.60 లక్షలుగా ఉంటే ముంబయి, ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరుల్లో 2.50 లక్షలుగా కొనసాగాయి. అలాగే పసిడిధరలు చెన్నై, హైదరాబాద్, ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరునగరాల్లో 1,46,670గా కొనసాగితే ఢిల్లీలో మాత్రం రూ.1,46,820గా కొనసాగింది.

వాణిజ్యం

# వర్క్‌ఫోర్స్ పెంపునకు మేనేజ్‌మెంట్స్ ఓకే!

**ముంబయి, మార్చి 25:** ప్రతి ఐదు మేనేజ్‌మెంట్‌లలో నాలుగు సంస్థలు వచ్చే తొలి ఆరునెలల్లో వర్క్‌ఫోర్స్‌ను పెంచాలని భావిస్తున్నాయి. మొత్తం యాజమాన్యాల్లో 58శాతం మంది తమ వర్క్‌ఫోర్స్‌ను పెంచుకోవాలని చూస్తుంటే 26శాతం కంపెనీలు ఎలాంటి మార్పులు ఉండవన్న ధోరణిలో ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచి సెప్టెంబరుమధ్యకాలంలోనే ఈమార్పులు ఉండవచ్చని అంచనా. టీమ్‌లీజ్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. నికర ఉపాధి మార్పు (ఎన్ఇసి) అనేది 4.7శాతం పెరిగింది. అంతకుముందున్న కాలంలో 4.4వాతంనుంచి పెరిగిందని ఏడాది క్రితం ఈ నెక్ వృద్ధిరేటు కేవలం 2.8శాతంగా మాత్రమే ఉందని టీమ్‌లీజ్ నివేదికలో పొందుపరిచింది. మొత్తం 1268 మంది యాజమాన్యాలను 23 పరిశ్రమలు, 20 నగరాల్లో ఈ సర్వే నిర్వహించారు. గత ఏడాది నవంబరునుంచి ఈ ఏడాది జనవరి మధ్యకాలంలోనే సమగ్ర సర్వేను కొనసాగించారు. 58శాతం యాజమాన్యాలు తమ వర్క్‌ఫోర్స్ ఏప్రిల్ సెప్టెంబరు మధ్యకాలంలోపెరుగుతుందని చెపితే 26శాతంమంది ఎలాంటి మార్పులుండవని, 16శాతం మంది మాత్రం సిబ్బంది సంఖ్యను తగ్గించాల్సిన అవసరాలను నొక్కిచెప్పారు. 64శాతం యాజమాన్యాలు ఉపాధి వ్యయం గణనీయంగా పెంచాలని భావిస్తున్నారు. అలాగే కొత్త లేబర్‌కోడ్‌లవల్లకూడా వ్యయం పెరుగుతున్నట్లు భావిస్తున్నారని సర్వేలో తేలింది.



# పిఎన్‌జికి మారకుంటే ఎల్‌పిజి కట్!

**న్యూఢిల్లీ, మార్చి 25:** పైప్డ్ నేచురల్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని కుటుంబాలకు ఎల్‌పీజీ గ్యాస్ డెలివరీని నిలిపివేయనున్నట్లు తెలిపింది. పీఎన్‌జీ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఆ కనెక్షన్‌కు మారాలని స్పష్టం చేసింది. అందుకు 3 నెలల సమయం ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఒక వేళ ఇచ్చిన గడువులోపు మారకపోతే వంట గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని నిర్ణయించింది. వంట గ్యాస్ కొరతను అధిగమించేందుకు పీఎన్‌జీని ప్రోత్సహించాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నిత్యావసరాల చట్టం కింద కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. పీఎన్‌జీకి మారడం ద్వారా గ్యాస్ సిలిండర్ల రీఫిల్స్ బుకింగ్ చేసే అవసరం ఉండదు. 24 గంటలు ఇంటికి గ్యాస్ సరఫరా కొనసాగుతుంది. ఏదైనా టెక్నికల్ ఇష్యూ వల్ల ఇంటికి పైపు లైన్ కనెక్షన్ ఇవ్వడం సాధ్యం కాకపోతే అలాంటి సందర్భంలో మాత్రమే ఎల్‌పీజీ సరఫరా కొనసాగుతుందని పెట్రోలియం శాఖ తెలిపింది. పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి ఎన్వోసీ తీసుకురావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. పైప్ లైన్ నేచురల్ గ్యాస్ సరఫరాకు నిర్మాణాలను వేగవంతం చేసేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు సైతం చేపట్టింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ లైన్ కు నిర్ణీత గడువులోపు అధికారులు అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేసింది. హౌసింగ్ సొసైటీలు, భూ యజమానులు సైతం పైప్ లైన్ వేసేందుకు అడ్డు చెప్పకూడదు. ఒక వేళ అడ్డు చెప్తే ఆ ప్రాంతానికి ఎల్ పీజీ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.







# మెటాకు 375 మిలియన్ డాలర్ల జరిమానా!

**న్యూఢిల్లీ, మార్చి 25:** ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాకు మెక్సికో కోర్టు 375 మిలియన్ డాలర్లు జరిమానాగా చెల్లించాలని ఆదేశించింది. చిన్నపిల్లల భద్రతకు సంబంధించి నిబంధనలు అతిక్రమించిందని కోర్టు అభిప్రాయపడింది. ఏడువారాలపాటు జరిగిన విచారణలో జ్యూరీలు అంతర్గత కంపెనీ డాక్యుమెంట్లతపరిశీలనతోను, మాజీ ఉద్యోగుల వాంగ్మూలాలనుంచి కీలక ఆధారాలు నమోదుచేసింది. అలాగే విజిల్‌బ్లోయర్ ఆర్టురో బెజార్ వాదనలు కూడా స్వీకరించింది. మెటా ఉద్దేశ్యపూర్వకంగానే యువ కస్టమర్లను లైంగికపరమైన కార్యకలాపాలవైపు ఆకర్షితులయ్యేటట్లు చేస్తోందని, ఇందుకు గాను బహిరంగంగానే చట్టాలను ఉల్లంఘిస్తోందని కోర్టు అభిప్రాయపడింది. న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రౌల్ టోర్రెజ్ ఈ తీర్పుచరిత్రాత్మకమని చిన్నారుల భద్రతకు సంబంధించి ప్రభుత్వపరంగా గెలిచిన తొలి విజయంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్వేతుక కార్యకలాపాల నిరోధక చట్టంపరిధిలో ఈకేసును విచారించారు. లైంగికార్యకలాపాలు, ఇతర అసహజ వైఖరులకు సంబంధించిన సమాచారంవైపు యువతను ఆకర్షించే కుట్రలుచేసిందని, 16% ఇన్‌స్టాగ్రామ్ కస్టమర్లు అనైతిక నగ్నత్వం, శృంగార సంబంధిత వీడియోలు ఎక్కువ ఉన్నాయని వాదించారు. అయితే మెటా సిఇఒ మార్క్ జుకర్‌బెర్గ్ ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పీలుచేస్తామనిప్రకటించారు. 375 మిలియన్ల జరిమానా వేలాదిగా ఉల్లంఘనలు జరిగాయని అందుకే జరిమానా వేసినట్లు జ్యూరీ వెల్లడించింది. ప్రతి ఒక్క ఉల్లంఘనకు ఐదువేల డాలర్లుగా జరిమానా నిర్ణయించారు.

## దలాల్‌స్ట్రీట్‌లో


# లాభాల ర్యాలీ!

### రూ.8 లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద



**ముంబయి, మార్చి 25:** దేశీయ ఈక్విటీసూచీలు రెండో సెషన్‌లో కూడా లాభాల్లోముగిసాయి. అంతర్జాతీయ ధోరణులు సానుకూలంగా మారడం,మధ్యప్రాచ్య ఉద్రిక్తతల్లో సడలింపులు కనిపించడం, ముడిచమురుదరలు తగ్గుదల వంటి వాటితో మార్కెట్‌లో ఎంపికచేసిన కంపెనీల షేర్లు ర్యాలీతీసాయి. అలాగే హార్ముజ్ జలసంధినుంచి అనుమతులతోకూడిన రవాణాకు ఇరాన్ అంగీకరించడం కూడా మార్కెట్లకు కలిసొచ్చింది. మార్కెట్లలో ఇన్వెస్టర్ల సంపద రూ.8 లక్షలకోట్లుపెరిగింది. బిఎస్ఇలో నమోదిత కంపెనీల విలువలు రూ.431 లక్షలకోట్లకు పెరగడం విశేషం. బిఎస్ఇ సెన్సెక్స్ 1205 పాయింట్లుపెరిగి 75,273.45 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 394.05 పాయింట్లుపెరిగి 23,306.45 పాయింట్ల వద్దకు చేరింది. వరుసగా రెండు సెషన్లలో సెన్సెక్స్,నిఫ్టీలు 3.54శాతం, 3.53శాతంచొప్పున పెరిగాయి.ఎలఅండ్‌టి 3.80శాతం, ఎస్‌బిఐ 2.89 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.16శాతం చొప్పున పెరిగాయి. ఇక బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 2.34శాతం, 250 స్మాల్‌క్యాప్‌సూచీ 2.41శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2959 షేర్లుపెరిగితే 1357 కంపెనీలషేర్లు క్షీణించాయి. మరో 164 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. రామనవమి సందర్భంగా 26వ తేదీ మార్కెట్లకు సెలవు ఉంటుంది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 94.08వద్ద ముగిసాయి. అంతకుముందురోజు 93.76గాచెలామణి అయిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ 2వ తేదీ సెటిలమెంట్లు 3.65 శాతంపెరిగి రూ.1,43,985కి చేరాయి. ఇక కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లు 5.48 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 99.01 డాలర్లుగా కొనసాగింది. ఇక కంపెనీలపరంగాచూస్తే సమ్మాన్ క్యాపిటల్ 6.21శాతం, ఫినోపేమెంట్స్‌బ్యాంకు 10శాతం, కోటక్‌మహీంద్ర బ్యాంకు 1.13శాతం పెరిగాయి. అలాగే వారీఎనర్జీస్ మూడుశాతంపెరిగితే మేజెల్లానిక్ క్లౌడ్ 2.51శాతంపెరిగింది. ఆర్కేడ్ డెవలపర్స్ 2.16శాతం, స్టెరిలైట్ టెక్నాలజీస్ 7.07శాతం,వెల్‌స్పన్ కార్ప్ 4.13శాతం పెరిగాయి. ఇక ఐపిఒల పరంగా సాయి పేరెంటల్30,82,332 షేర్లకు బిడ్లు రాబట్టింది. 0.41 రెట్లు ఇష్యూ కొనుగోళ్లుజరిగాయి. 24వ తేదీ బిడ్‌ప్రారంభించినసంస్థ 27వ తేదీ చివరి తేదీగా ప్రకటించింది. ఇష్యూధర రూ.372నుంచి రూ.392గా నిర్ణయించింది. అమిర్‌చంద్ జగదీష్‌కుమార్ 2,77,18,250 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఇషూ 1.47 రెట్లు కొనుగోళ్లుజరిగాయి. 27వ తేదీముగిసే ఈ బిడ్డింగ్‌లో ఇష్యూధరను రూ.201నుంచి రూ.212 మధ్యలో ప్రకటించారు. పవరికా సంస్థ కూడా 5,21,515 షేర్లకు బిడ్లు రాబట్టింది. 27వ తేదీ ముగిసే ఈ ఐపిఒలో ఇష్యూధర రూ.375 నుంచి రూ.395గా నిర్ణయించారు. ఇక అంతర్జాతీయ మార్కెట్లపరంగా డౌజోన్స్ ఫ్యూచర్స్ 450 పాయింట్లుపెరిగి వాల్‌స్ట్రీట్‌ను పటిష్ఠంచేసింది. యూరోపియన్, ఆసియా మార్కెట్లలో కూడా గణనీయంగాపెరుగుదల నమోదయింది. ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నట్లు ట్రంప్‌చేసిన ప్రకటన సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది. రాత్రికిరాత్రే వాల్‌స్ట్రీట్‌లో ఎస్అండ్‌పి 500 ర్యాలీ తీసింది. అయితే డౌజోన్స్ పారిశ్రామికసగటు మాత్రం 84.41పాయింట్లు క్షీణించింది. నాస్‌డాక్ కాంపోజిట్‌కూడా 0.84శాతం తగ్గింది.

# కేఫ్ నిబంధనలు అమలయితే కార్ల కంపెనీలకు భారమే!



**ముంబయి, మార్చి 25:** భారత ఆటో రంగంలో త్వరలో అమల్లోకి రానున్న కేఫ్3 నిబంధనలు అంటే కార్పొరేట్ సగటు ఇంధన సామర్థ్యం, చిన్న కార్ల ధరలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని అంచనా. మధ్యతరగతి వినియోగదారుల ఎంపికగా ఉన్న చిన్న కార్లు మరింత ఖరీదైనవిగా మారవచ్చని నిపుణులు చెపుతున్నారు. సాధారణంగా బైక్ నుంచి కారుకు అప్‌గ్రేడ్ కావాలనుకునే వ్యక్తులు తక్కువ ధర, మంచి మైలేజ్, తక్కువ మెయింటెనెన్స్ ఉన్న చిన్న కార్లనే ఎంచుకుంటారు. రాబోయే రోజుల్లో ఈ సెగ్మెంట్‌పై ఒత్తిడి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. 2025 సెప్టెంబర్‌లో జరిగిన జీఎస్టీ తగ్గింపులు చిన్న కార్ల విభాగానికి ఊతమిచ్చాయి. ఆ తగ్గింపుల తర్వాత ఈ సెగ్మెంట్‌లో అమ్మకాలు భారీగా పెరిగాయి. కానీ ఇప్పుడు కేఫ్3 నిబంధనలు మళ్లీ ఈ విభాగాన్ని సతమతంచేస్తాయన్నది నిపుణుల అంచనా. నుంచి వెలువడే కార్బన్ డయాక్సైడ్ (సివి ) ఉద్గారాలను తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం, 2027 నుంచి 2032 మధ్యకాలంలో కంపెనీలు తమ వాహనాల సగటు ఇంధన వినియోగాన్ని ప్రతి 100 కిలోమీటర్లకు 3.73 లీటర్ల నుంచి 3.01 లీటర్లకు తగ్గించాలి. ఈ లక్ష్యాలను చేరుకోలేకపోతే కంపెనీలపై జరిమానాలు విధించే అవకాశం ఉంది. కేఫ్3 నిబంధనలు అమల్లోకి వస్తే చిన్న కార్ల ధరలు సుమారు 10 శాతం వరకు పెరగవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.